సోమవారం 3-2-2020

సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 313

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'



## నెవర్ బిఫోర్... 5-0

న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో టి20 మ్యాచ్‌లోనూ భారత్ గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 5–0తో క్లీన్‌స్వీప్ చేసిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. – స్పోర్ట్స్‌లో

## ఇంకా సమయం ఇవ్వొద్దు!




'నిర్భయ' దోషులకు వెంటనే ఉరిశిక్ష విధించాలని, వారికి ఇక సమయం ఇవ్వొద్దని కేంద్రం ఢిల్లీ హైకోర్టును కోరింది. ఉరిశిక్ష అమలుపై స్టేను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. - 5లో

## కరోనా.. హైఅలర్ట్



రాష్ట్రంలో కరోనా వైరస్ హైఅలర్ట్ నేపథ్యంలో అన్ని మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆస్పత్రుల్లో అనుమానిత కేసులకు చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆదేశించారు. మరోవైపు నేటి నుంచి గాంధీ ఆసుపత్రిలో కరోనా పరీక్షలను పూర్తిస్థాయిలో నిర్వహించనున్నారు. - 14లో

## చర్చిలో తొక్కిసలాట.. 20 మంది మృతి



టాంజానియాలోని ఓ చర్చిలో జరిగిన తొక్కిసలాటలో 20 మంది మృతిచెందగా, మరో 16 మంది గాయపడ్డారు. బహిరంగ సభా వేదికపై పోసిన నూనెను తాకాల్సిందిగా చర్చి పాస్టర్ పిలుపునివ్వగా భక్తులు ఒక్కసారిగా రావడంతో తొక్కిసలాట జరిగింది. - 5లో

## దేశీ ఆదాయంపైనే..



ప్రవాస భారతీయుల (ఎన్నారై) ఆదాయాలపై పన్ను విధించే అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టతనిచ్చారు. ఎన్నారైలు భారత్‌లో ఆర్జించిన ఆదాయాలపై మాత్రమే దేశీయంగా పన్ను విధింపు ఉంటుందని వివరణ ఇచ్చారు. ఇతర దేశాల్లో వారికి వచ్చే ఆదాయాలపై ట్యాక్స్ విధించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. - 13లో

# స్కూళ్లకూ అక్రెడిటేషన్!

- న్యాక్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో స్టేట్ స్కూల్ స్టాండర్డ్స్ అథారిటీ
- కసరత్తు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- నాణ్యతా ప్రమాణాల పెంపే లక్ష్యం
- ఎస్ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు అక్రెడిటేషన్
- కేంద్ర ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేకంగా అథారిటీ ఏర్పాటు
- కొత్త స్కూళ్లు ఏర్పాటు చేయాలంటే ఎస్ఎస్ఎస్ఏ నుంచే లైసెన్స్



**సాక్షి, హైదరాబాద్:** ఉన్నత విద్యలోనే కాదు.. పాఠశాల విద్యలోనూ అక్రెడిటేషన్ విధానం రాబోతోంది. నాణ్యతా ప్రమాణాలు పాటించే కాలేజీలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఇచ్చే గుర్తింపు తరహాలోనే పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాల పెంపునకు అక్రెడిటేషన్ విధానం తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం జాతీయ స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయిలోనే స్వతంత్ర అక్రెడిటేషన్ సంస్థను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరంలో అమల్లోకి తీసుకురాబోతున్న నూతన విద్యా విధానంలో ఈ అంశాన్ని పొందుపరిచింది. స్టేట్ స్కూల్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ) పేరుతో దీనిని ఏర్పాటు చేయాలని నూతన విద్యా విధానంపై ఏర్పాటైన కస్తూరిరంగన్ కమిటీ ప్రతిపాదించింది. కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నా ఎస్ఎస్ఎస్ఏ నుంచే లైసెన్స్ ఇచ్చే విధానం తేవాలని స్పష్టం చేసింది.

**నాణ్యమైన విద్య కోసం...**

ప్రస్తుతం పాఠశాలల నిర్వహణ, ప్రమాణాల పెంపు కార్యక్రమాలన్నీ పాఠశాల విద్యాశాఖ (జిల్లాల్లో డీఈవోలు) నేతృత్వంలోనే కొనసాగుతున్నాయి. దీంతో అధికారం కేంద్రీకృతమైంది. అయితే దాని వల్ల పాఠశాలల నిర్వహణ విధానం దెబ్బతింటోందని, ఫలితంగా నాణ్యమైన విద్యను అందించడం సాధ్యం కావడం లేదని నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) ఫైనల్ కాపీలో కస్తూరిరంగన్ కమిటీ పేర్కొంది. పైగా చాలా ప్రైవేటు యాజమాన్యాలు విద్యను ఆర్థిక వనరుగానే చూస్తూ వ్యాపారంగా మార్చేశాయని వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో విద్యా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు పారదర్శకతతో కూడిన విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపింది. అందుకే రాష్ట్రాల పాఠశాల విద్యా విధానంలో బాధ్యతను పెంపొందించే చర్యలు చేపట్టాలని సూచించింది.

**పాఠశాల విద్యలో తేవాల్సిన మార్పులివే..**

- పాఠశాల విద్య పరిపాలన, నిర్వహణలో నాలుగు అంశాలే కీలకమని కస్తూరిరంగన్ కమిటీ పేర్కొంది. అందులో పాలసీ మేకింగ్, ప్రొవిజన్/ఆపరేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్, వృత్తి నైపుణ్యాల పెంపుతోపాటు ప్రమాణాల పెంపు, స్వయం ప్రతిపత్తిగల సంస్థతో అకడమిక్ వ్యవహారాల నిర్వహణ చేపట్టాలి. ఇందుకోసం అధికార వికేంద్రీకరణ జరగాలి.
- విద్యా ప్రమాణాల పెంపునకు పాలసీ రూపకల్పన వ్యవహారాలను అత్యున్నత విభాగంగా పాఠశాల విద్యాశాఖే పర్యవేక్షించాలి.
- పాఠశాలల్లో విధానాలు, పథకాల అమలును పాఠశాల విద్యా డైరెక్టరేట్ చూడాలి.
- అన్ని పాఠశాలలు కనీస నాణ్యతా ప్రమాణాలు సాధించేందుకు రాష్ట్రాలు వృత్తిపరమైన నాణ్యతా ప్రమాణాల పెంపునకు ఎస్ఎస్ఎస్ఏ పేరిట స్వయం ప్రతిపత్తిగల సంస్థలను ఏర్పాటు చేయాలి. వాటికి సంబంధించిన విధివిధానాలను ఆయా రాష్ట్రాల రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ

మిగతా 2వ పేజీలో ▶





కాన్హా శాంతివనం గ్లోబల్ హెడ్‌క్వార్టర్‌ను ప్రారంభించి ధ్యానకేంద్రంలోని అభ్యాసీలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కోవింద్



- కాన్హా శాంతివనం.. సంపూర్ణ జీవనానికి నమూనా
- వ్యక్తిగత, సామాజిక పరివర్తనలో రామచంద్ర మిషన్ పాత్ర కీలకం
- రాష్ట్రపతి కోవింద్ వెల్లడి
- కాన్హా శాంతివనంలో గ్లోబల్ హెడ్‌క్వార్టర్ ప్రారంభం

# మన ఆధ్యాత్మికత ప్రపంచానికి బహుమతి

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** ఆందోళనలు, అనిశ్చితి, అభద్రతాభావం, శత్రుత్వాలతో నిండిన ప్రపంచంలో రామచంద్ర మిషన్ వంటి సంస్థల బాధ్యతలు చాలా రెట్లు పెరిగాయని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. కాన్హా శాంతివనం సంపూర్ణ జీవనానికి నమూనా వంటిదని ప్రశంసించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఈ ధ్యాన కేంద్రం ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి గొప్ప ప్రదేశమని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా దేశాల్లో విస్తరించిన ఈ మిషన్ బలమైన ఆధ్యాత్మిక శక్తిగా మారిందని చెప్పారు. రామచంద్ర మిషన్ వ్యక్తిగత, సామాజిక మార్పును ప్రోత్సహిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాజయోగ (సహజమార్గ) ధ్యానానికి గల ప్రాచీన సంప్రదాయాన్ని ఆధునిక ప్రపంచంలో ఈ మిషన్ ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచానికి అత్యంత విలువైన బహుమతి వంటిదని తెలిపారు. నందిగామ మండలంలోని కాన్హా శాంతివనాన్ని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు ఆదివారం సందర్శించారు. కాన్హా శాంతివనం గ్లోబల్ హెడ్‌క్వార్టర్‌ని రాష్ట్రపతి ప్రారంభించారు. రామచంద్ర మిషన్ స్థాపించి

మిగతా 2వ పేజీలో ▶

## క్రమం తప్పకుండా ఆదాయం

ప్రైవేటు రంగం, స్వయం ఉపాధిలో ఉన్న వారు రిటైర్మెంట్ అనంతరం క్రమం తప్పకుండా ఆదాయ మార్గాల కోసం అన్వేషిస్తుంటారు. వారికోసం ఫిక్స్‌డ్ డిపాజిట్‌తోపాటు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత మొత్తాన్ని ఉపసంహరించుకోవడం వంటి పెట్టుబడి మార్గాలు ఉన్నాయి. ఈ సాధనాలు, వాటిల్లో రాబడులు, రిస్కులను తెలియజేసే కథనం. - ప్రాఫిట్ ప్లస్‌లో











# మార్క్‌ఫెడ్ 'ఔట్'!

వ్యవసాయశాఖ కీలక అడుగులు.. రైతు సమన్వయ సమితిలో విలీనం?

ఇద్దరు కీలక ప్రజాప్రతినిధుల మధ్య ఈ అంశంపై ఇటీవల చర్చలు

'సమితి'కి అధికారాలు, పరిపాలనా విభాగం సమకూర్చడమే ప్రధాన లక్ష్యం

ఇటు యూరియా సరఫరాలో మార్క్‌ఫెడ్ విఫలమవ్వడంపై విమర్శల వెల్లువ

**సాక్షి, హైదరాబాద్:** రైతు సమన్వయ సమితిలో మార్క్‌ఫెడ్‌ను విలీనం చేస్తున్నారా? తద్వారా రైతు సమన్వయ సమితిని బలోపేతం చేస్తారా? ఇక నుంచి పంట ఉత్పత్తుల సేకరణ, ఎరువుల సరఫరా బాధ్యత రైతు సమితే తీసుకుంటుందా? అంటే అవుననే అంటున్నాయి వ్యవసాయ శాఖ వర్గాలు. ఆ దిశగా కీలక అడుగులు పడుతున్నట్టు కనిపిస్తోంది. రెండ్రోజుల కిందట వ్యవసాయ శాఖకు చెందిన ఇద్దరు కీలక ప్రజా ప్రతినిధుల మధ్య ఈ అంశంపై సీరియస్‌గా చర్చలు జరిగాయని, ఈ చర్చల అనంతరం ఒక ప్రజాప్రతినిధి 'విలీనం జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయ'ని తమ వద్ద ప్రస్తావించినట్లు మార్క్‌ఫెడ్ ఉద్యోగులు చెబుతున్నారు. అంతే కాదు 'మార్క్‌ఫెడ్ గత ఖరీఫ్‌లో యూరియా సరఫరాలో ఘోరంగా విఫలమైంది. పంట ఉత్పత్తుల కొను గోలులోనూ అనేక అవకతవకలు జరుగు తున్నాయి. మొక్క జొన్న విక్రయాల పైనా విమర్శలు వచ్చాయి. దీంతో మార్క్‌ఫెడ్‌పై ఉన్నత స్థాయి వర్గాలు గుర్రుగా ఉన్నాయ'ని ఆయన ప్రస్తావించారని తెలిసింది. దీంతో మార్క్‌ఫెడ్‌లో పనిచేసే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇక మార్క్‌ఫెడ్ ఎరువులను సరఫరా చేస్తుండగా, తాజాగా ఆగ్రోస్‌ను కూడా అడిషనల్ నోడల్ ఏజెన్సీగా నియమించారు. అంటే ఇక నుంచి ఆగ్రోస్ కూడా తమ ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా కంపెనీల నుంచే నేరుగా ఎరువులను సరఫరా చేయనుంది. ఇప్పటికే దానికి సంబంధించి తాజాగా వ్యవసాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇలా మార్క్‌ఫెడ్‌ను రోజురోజుకూ నిర్వీర్యం చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. రైతు సమితిలో మార్క్‌ఫెడ్‌ను విలీనం చేస్తే దానిలో ఉన్న సమితి సభ్యులతో తాము పనిచేయడం కష్టంగా మారుతుందని అంటున్నారు. ఏది చేయాలన్నా సమస్యలు వచ్చే అవకాశం ఉందన్న భావన ఉద్యోగుల్లో నెలకొంది.





**రైతు సమితికి పాలనా విభాగం ఏర్పాటే లక్ష్యం**

రైతు సమన్వయ సమితి ఏర్పాటై ఇన్నాళ్లైనా ఇప్పటివరకు దానికి సంబంధించి పూర్తిస్థాయి కార్యక్రమాలు ప్రారంభం కాలేదు. గ్రామం, మండలం, జిల్లా,

మిగతా 4వ పేజీలో ▶



## పోటెత్తిన మేడారం..

ఆదివారం ములుగు జిల్లా మేడారంలోని శ్రీసమ్మక్క-సారలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు -4లో

## హైదరాబాద్ మేడారం మధ్య హెలికాప్టర్

సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- వివరాలు 2లో

## కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం సుస్థిరం: టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- ఏ ఎన్నికలు జరిగినా టీఆర్ఎస్‌దే విజయం
- ప్రజలకు ఉపయోగపడే ఒక్క పనీ బీజేపీ చేయదు
- హిందూ–ముస్లిం అని చలికాచుకోవడమే దాని పని

- వివరాలు 3లో

## మానవ అక్రమ రవాణా ముఠాలు

- రాష్ట్రంలో ఆపరేషన్ స్మైల్‌లో చిక్కిన విదేశీ మైనర్లు
- వీరిలో 13 మంది నేపాల్, నలుగురు మయన్మార్ పిల్లలు
- ముమ్మాటికీ అక్రమ రవాణానే అంటోన్న పోలీసులు
- ఆయా దేశాల ఎంబసీలకు సమాచారం ఇచ్చిన తెలంగాణ పోలీసులు... ఈ కేసులూ ఎన్ఐఏకు బదిలీ!

- వివరాలు 14లో

## ఇదంజగత్





ఆల్‌రెడీ మనం అదేపని చేస్తున్నాం.. ఇక ప్రభుత్వం కూడా చేస్తుందన్నమాట!



## సిటీ శివార్లకు ఆర్టీసీ దూరం..

- 250 గ్రామాలకు సర్వీసుల నిలిపివేత
- ఖర్చు తగ్గించే పేరుతో బస్సుల రద్దు
- అద్దె బస్సులకే సేవలు పరిమితం
- ఇప్పుడు ప్రైవేటు వాహనాలపై రైతులు ఆధారపడాల్సిందే -2లో

# 50 మంది ఐఏఎస్‌ల బదిలీ

## పాలనను పరుగులు పెట్టించేందుకు కొత్త జట్టు

- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కదిలిన పీఠాలు
- 21 జిల్లాలకు కొత్త కలెక్టర్లు
- రజత్‌కుమార్‌కు నీటిపారుదల శాఖ
- జనార్దన్‌రెడ్డికి వ్యవసాయ శాఖ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర పాలనా యంత్రాంగం భారీ కుదుపునకు గురైంది. ఒకేసారి 50 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ఇంత భారీ సంఖ్యలో ఐఏఎస్ అధికారుల బదిలీలు జరగడం ఇదే తొలిసారి. రాష్ట్రంలో అన్ని రకాల ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో పాలన వ్యవహారాలపై దృష్టిపెట్టేందుకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులతో కొత్త జట్టుకు రూపకల్పన చేసుకుంది. ఒకేసారి 21 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. ఇక బదిలీల్లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) రజత్‌కుమార్‌కు కీలకమైన నీటిపారుదల శాఖ వరించింది. కేంద్ర ఎన్నికల సంఘం విధుల నుంచి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది. సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హాను ప్రాధాన్యత లేని పశుసంవర్ధక, పాడిఅభివృద్ధి, మత్స్య శాఖకు ప్రభుత్వం బదిలీ చేసింది. గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్‌కు కీలకమైన విద్యాశాఖ బాధ్యతలను అప్పగించింది. వికాస్‌రాజ్‌ను మరో కీలకమైన సాధారణ పరిపాలన శాఖకు బదిలీ చేసింది. విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డికి వ్యవసాయ శాఖ, సీఎం కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు లభించాయి. పురపాలక శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ డి. రొనాల్డ్ రాస్‌లను ఆర్థికశాఖ కార్యదర్శులుగా నియమించింది. చాలా జిల్లాలకు కలెక్టర్లుగా యువ ఐఏఎస్

మిగతా 3వ పేజీలో ▶



## ఈ సమ్మర్ సుర్రుమంటది

- హైదరాబాద్‌లో ఈ వేసవిలో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 5 డిగ్రీల వరకు అధికంగా నమోదు!
- ఫిబ్రవరిలోనే పెరుగుతున్న యూవీ ఇండెక్స్ సూచిక -14లో

## కేటీఆర్‌కు హార్వర్డ్‌ వర్సిటీ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్‌: హార్వర్డ్‌ యూనివర్సిటీ ఇండియా సదస్సు–2020లో పాల్గొనాలని రాష్ట్ర మంత్రి కె.తారకరామారావుకు వర్సిటీ యాజమాన్యం ఆహ్వానం పంపింది. అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న హార్వర్డ్‌ బిజినెస్‌ స్కూల్‌లో ఈనెల 15, 16 తేదీల్లో ఇండియా సదస్సు నిర్వహించనున్నారు. ‘20/20 ఫోర్‌సైట్‌’అనే థీమ్‌తో నిర్వహిస్తున్న 17వ ఇండియా కాన్ఫరెన్స్‌ కోసం పలువురు కీలక వ్యక్తులను వర్సిటీ ఆహ్వానించింది. ‘భారతదేశంలో స్మార్ట్‌ సిటీలు’అనే అంశంపై మాట్లాడాలని కేటీఆర్‌ను సదస్సు నిర్వాహకులు కోరారు.



ఐటీశాఖతో పాటు పురపాలక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న కేటీఆర్‌.. టెక్నాలజీ, ఇన్నోవేషన్, పట్టణాల అభివృద్ధి వంటి అంశాల సమ్మిళితమైన స్మార్ట్‌ సిటీలపై ప్రసంగించడం ముదావహంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదస్సుకు భారత్, అమెరికాల నుంచి పలు రంగాల్లోని వెయ్యి మంది వరకు ప్రముఖులు హాజరు కానున్నారు. ముఖ్యంగా అమెరికాలోని యంగ్‌ ప్రొఫెషనల్స్, ఇండస్ట్రీ లీడర్లు, అమెరికాలో వివిధ కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారతీయ అమెరికన్లు, విద్యార్థులు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు హాజరై కీలకమైన అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. కేటీఆర్‌తో పాటు ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్‌ సుబ్రహ్మణ్యన్, కేంద్ర మంత్రులు అరుణ్‌ పూరి, సురేశ్‌ ప్రభు, జయంత్‌ సిన్హా, నటుడు అనుపమ్‌ ఖేర్‌ వంటి వారికి కూడా వర్సిటీ ఆహ్వానం పంపింది.

## దేశంలో జైళ్లు సరిపోవు

- జైల్‌ భరో ఆందోళన్‌ నిర్వహణపై అసదుద్దీన్‌ ఒవైసీ

సాక్షి, హైదరాబాద్‌: సీఏఏ, ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌కు వ్యతిరేకంగా జైల్‌ భరో ఆందోళన్‌ నిర్వహిస్తే దేశంలోని జైళ్లు సరిపోవని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీ అన్నారు. శివరాంపల్లిలోని జామియా ఇస్లామియా దారుల్‌ ఉలుమ్‌లో ఆదివారం యూనైటెడ్‌ ముస్లిం యాక్షన్‌ కమిటీ ఆధ్వర్యంలో పౌర సవరణ చట్టం, జాతీయ జనాభా పట్టిక, జాతీయ పౌరపట్టికలకు వ్యతిరేకంగా జరిగిన మహిళా సదస్సులో ఆయన పాల్గొని ప్రసం గించారు. మోడీకి వ్యతిరేకంగా గళం విప్పితే దాడులకు పాల్పడుతున్నార న్నారు. ‘‘నరేంద్ర మోడీజీ.. ఒక సమయం వస్తోంది..జైలుభరో ఆందోళన్‌ నిర్ణయం తీసుకుంటాం. దేశంలోని జైళ్లలో మూడు లక్షల మంది కంటే ఎక్కువగా నింపలేరు. మూకుమ్మడిగా రోడ్డుపైకి వస్తే



దేశంలోని జైళ్లు సరిపోవు’’అని పేర్కొన్నారు. గాంధీజీ వర్ధంతి రోజు రామ భక్తుడైన ఒక యువకుడిపై కాల్పులు జరిపిన సంఘటన ఫేస్‌బుక్‌ లైవ్‌ టెలికాస్ట్‌లో పెట్టగా..దానిపై కొందరు కామెంట్‌ కూడా చేశారని, అందులో ఒకరు అసదుద్దీన్‌ ఒవైసీని కూడా కాల్చాలని కామెంట్‌ చేశారని పేర్కొంటూ.. దమ్ముంటే తనను కాల్చండి..ప్రాణాలివ్వడానికి సిద్ధమేనన్నారు. మతాలకతీతంగా ఈ దేశం అందరిదీ అని ఆయన స్పష్టం చేశారు. దేశాన్ని హిందుత్వ ఎజెండా నుంచి కాపాడవల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

## అశ్వత్థామరెడ్డిపై శాఖాపరమైన చర్యలు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ మజ్దూర్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డిపై శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. సమ్మె ముగిసిన తర్వాత విధుల్లో చేరి వెంటనే ఆయన ఆరునెలలు సెలవు కోసం దరఖాస్తు చేయగా అధికారులు నిరాకరించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అసాధారణ సెలవు కింద చేసిన దరఖాస్తును కూడా అప్పట్లోనే అధికారులు తిరస్కరించారు. అయినా ప్రస్తుతానికి ఆయన విధులకు హాజరు కాకపోతుండడంతో వారం రోజుల్లో సమాధానమివ్వాలంటూ ఇటీవల ఆయనకు చార్జిషీట్‌ పంపారు. అశ్వత్థామరెడ్డి నుంచి సమాధానం రాని పక్షంలో షోకాజ్‌ నోటీసు జారీ చేసి ఆ తర్వాత విధుల నుంచి తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా, తనకు కావాలనే సెలవు మంజూరు చేయకుండా విధుల నుంచి తొలగించేలా అధికారులు ప్రయత్నిస్తున్నారని అశ్వత్థామరెడ్డి ఆరోపించారు. సమ్మె తర్వాత కార్మిక సంఘాలు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని సిబ్బందిపై తీవ్రమైన వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మేడారం జాతర తర్వాత తాను అన్ని డిపోల్లో పర్యటిస్తూ సిబ్బంది పక్షాన పోరాటం ప్రారంభిస్తానని తెలిపారు.

## ఓయూ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ కాశిం సస్పెండ్‌

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా వర్సిటీలోని ఆర్ట్స్‌ కళాశాల తెలుగు విభాగంలో అసోసియేట్‌ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్‌ కాశింను ఉద్యోగం నుంచి సస్పెండ్‌ చేశారు. పాత కేసులో మావోలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై ఆయనను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం జైలుకు వెళ్లిన ఉద్యోగులను సస్పెండ్‌ చేస్తారు. ఈ కారణంతో కాశిం సస్పెండ్‌ అయ్యారు.

## దిశ నిందితుడు చెన్నకేశవులు భార్యను కలిసిన ఆర్జీవీ

సాక్షి, హైదరాబాద్‌: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ‘దిశ’ఘటన నేపథ్యంలో సినిమా తీస్తానని ప్రకటించిన దర్శకుడు రాంగోపాల్‌ వర్మ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. సినిమా నేపథ్యం అధ్యయనంలో భాగంగా ఎన్‌కౌంటర్‌లో మరణించిన నిందితుడు చింతకుంట చెన్నకేశవులు భార్య రేణుకతో ఆదివారం సమావేశమయ్యారు. తన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో చెన్నకేశవులు–రేణుక వివాహం, పరిచయం, వారి కుటుంబ నేపథ్యాల నుంచి ఎన్‌కౌంటర్, పోస్టుమార్టం, అంత్యక్రియల వరకు జరిగిన ఘటనలపై అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. సమావేశం అనంతరం రేణుకతో మాట్లాడుతున్న ఫొటోను వర్మ ట్విట్టర్‌లో పోస్ట్‌చేశాడు. చెన్నకేశవులు కేవలం ‘దిశ’నే కాదు, అతని భార్య రేణుక జీవితాన్ని కూడా నాశనం చేశాడని వ్యాఖ్యానించారు. 16 ఏళ్ల మైనర్‌ని పెళ్లి చేసుకుని, ఆమెను 17 ఏళ్లకే తల్లిని చేశాడని, ఇప్పుడు ఆ బాలిక మరో చిన్నారికి జన్మనివ్వబోతోందని వర్మ వాపోయారు.








గ్లోబల్‌ హెడ్‌క్వార్టర్‌ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రపతి. చిత్రంలో గవర్నర్లు తమిళిసై, దత్తాత్రేయ



రాష్ట్రపతి దంపతులకు వీడ్కోలు పలుకుతున్న సీఎం కేసీఆర్‌. చిత్రంలో గవర్నర్‌ తమిళిసై

# మన ఆధ్యాత్మికత ప్రపంచానికి బహుమతి

▶ మొదటి పేజీ తరువాయి

75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ధ్యాన కేంద్రాన్ని ఇక్కడ నిర్మించారు. ఇక్కడ నిర్వాహకులు లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా చివరి మొక్కను రాష్ట్రపతి నాటి ఈ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం అభ్యాసీలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలు, రైతులు, చేతివృత్తిదారులు, చిన్న పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం ఇక్కడ చేపట్టిన కార్యకలాపాలు, పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని అన్నారు. ఐదు లక్షల మొక్కలతో విస్తరించిన ఈ క్యాంపస్‌.. ఆకుపచ్చని పరిసరాలతో అలరారుతోందన్నారు.

### సమున్నతులుగా తీర్చిదిద్దడానికి..

తమను తాము సమున్నతులుగా తీర్చిదిద్దుకోవాలన్న వారి కోరికను ఈ మిషన్‌ నెరవేర్చుతుందని రాష్ట్రపతి తెలిపారు. రామచంద్ర మిషన్‌కు చెందిన అంతర్జాతీయ సమాజం ఈ భూమండలాన్ని మెరుగైన ప్రాంతంగా తీర్చిదిద్దగలదని కోవింద్‌ ఆకాంక్షించారు. అలాగే సంతోషం, సంపూర్ణ సానుకూల శక్తియుక్తులతో అలరారే దిశగా మానవాళిని పరివర్తన చెందించగలదన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. ‘దాజీ వివరించిన ‘డిజైనింగ్‌ డెస్టినీ’లోని ఐదు సూత్రాలలో ఒకదాన్ని ఇక్కడ తప్పక నేను ప్రస్తావించాలి. మానవత్వ గమ్యాన్ని రూపొందించాలి. ఇది మనతోనే ప్రారంభం కావాలి. ఆ తర్వాత ఇతరులకు విస్తరించాలి. అందరం కలిసి పనిచేస్తే మానవత్వ దిశను మార్చేందుకు ఒక రోజు కచ్చితంగా వస్తుంది. ఇందుకు యువత సహకారం తీసుకుని మెరుగైన ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నాల్లో వారిని నిమగ్నం చేయాలి’అని పిలుపునిచ్చారు. ఈ మిషన్‌ కొత్త ప్రధాన కార్యాలయాన్ని సందర్శించే వారి సంఖ్య పెరుగుతూనే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

### శాంతివనం.. ఓర్పుకు నిదర్శనం

కాన్హా శాంతివనం మానవ ఓర్పుకు నిదర్శనమని గురూజీ కమ్లేష్‌ డీ పటేల్‌ (దాజీ) అన్నారు. ఐదేళ్లలో శాంతివనంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం నిర్మించడం వేలాది మంది అభ్యాసీకుల నిరంతర కృషితోనే సాధ్యపడిందన్నారు. 1,400 ఎకరాల్లో శాంతి వనంలో నిర్మించిన ఐకానిక్‌ ధ్యాన కేంద్రం మానవాళి పరివర్తనకు కేంద్రంగా రూపాంతరం చెందుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ధ్యాన శిబిరాలను గత నెల 28 నుంచి ఈ నెల 9 వరకు మూడు విడతలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, హిమాచల్‌ ప్రదేశ్‌ గవర్నర్లు తమిళిసై సౌందరరాజన్, బండారు దత్తాత్రేయ, డిప్యూటీ సీఎం మహమూద్‌ అలీ, మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రపతికి ఘన వీడ్కోలు..

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్‌ పర్యటన ముగించుకుని ఢిల్లీకి బయలుదేరిన రాష్ట్రపతి రామ్‌నాథ్‌ కోవింద్‌కు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్‌ పోచారంశ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఘనంగా వీడ్కోలు పలికారు.

# సిటీ శివార్లకు ఆర్టీసీ దూరం..

- దాదాపు 250 గ్రామాలకు భారీగా సర్వీసుల నిలిపివేత
- ఖర్చు తగ్గించే పేరుతో బస్సుల రద్దు
- అద్దె బస్సులకే సేవలు పరిమితం
- నగర మార్కెట్లు, రైతుబజార్లకు ఆ గ్రామాల నుంచి భారీగా కూరగాయల సరఫరా
- ఇంతకాలం రైతులకు బస్సులే ఆసరా
- ఇప్పుడు ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సిందే
- భారీగా పెరిగిన ఆటోలు, జీపుల సంఖ్య.. ఒక్కసారిగా భగ్గుమన్న వాటి ఛార్జీ

సాక్షి, హైదరాబాద్‌: ఇబ్రహీంపట్నానికి 16 కి.మీ. దూరంలో ఉన్న ఆరుట్ల సహా మంచాల, జాపాల్‌ తదితర గ్రామాల్లో కూరగాయల సాగు ఎక్కువ. రైతులు తమ పంటను ఆర్టీసీ బస్సుల ద్వారా నగరంలోని మాదన్నపేట మార్కెట్, ఎన్టీఆర్‌ నగర్‌లోని రైతు బజార్‌కు తరలించేవారు. ఈ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేవారి సంఖ్యా ఎక్కువే. వీరికి ఆర్టీసీ బస్సులు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. కానీ ఆర్టీసీ సమ్మె తర్వాత సీన్‌ మారిపోయింది. నష్టాలకు కళ్లెం వేసే పేరుతో అధికారులు ఇలాంటి గ్రామాలకు ఉన్న బస్సులను దాదాపు నిలిపివేశారు. ఆర్టీసీలోని కొన్ని అద్దె బస్సులు తప్ప సొంత బస్సులను బాగా తగ్గించేశారు. దీంతో రైతులు, ఇతర ప్రయాణికులు ఆటోల్లో ఇబ్రహీంపట్నం వరకు వచ్చి, అక్కడి నుంచి బస్సులెక్కాల్సి వస్తోంది. ఇది ఈ ఒక్క ప్రాంతంలోని గ్రామాల కథే కాదు. నగరం చుట్టూ 30 కి.మీ. పరిధిలో విస్తరించిన దాదాపు 250 గ్రామాల వ్యథ.

ఊళ్లకూ సిటీ బస్సు సర్వీసులు మొదలయ్యాయి. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఉప్పల్, రాజేంద్రనగర్, కుషాయిగూడ, మిధాని, చెంగిచెర్ల, మేడ్చల్, మెహిదీపట్నం తదితర డిపోల నుంచి నగరం చుట్టూ ఉన్న గ్రామాలకు వందల సంఖ్యలో బస్సులు తిరిగేవి. సమ్మె తర్వాత ఖర్చుల నియంత్రణ పేరుతో అధికారులు భారీగా బస్సులు తగ్గించారు. ఒక్క హైదరాబాద్‌ జోన్‌ పరిధిలోనే దాదాపు వెయ్యి బస్సులు తొలగించారు. ఇదే సమస్యకు కారణమైంది. నగరానికి కాస్త దూరంగా ఉన్న గ్రామాలకు నడుస్తున్న బస్సుల్లో సింహభాగం తొలగించేశారు. సిటీకి 40 కి.మీ. పరిధిలో ఉన్న ఊళ్లలో ఎక్కువగా కూరగాయల సాగు ఉంది. వాటిని నగరంలోని రైతుబజార్లు, కూరగాయల మార్కెట్లకు తరలిస్తారు. పెద్ద రైతులు ప్రైవేటు వాహనాలను ఎంగేజ్‌ చేసుకోగా, చిన్న రైతులు ఆర్టీసీ బస్సులనే నమ్ముకున్నారు. వారి కోసం ప్రత్యేకంగా రైతుబజార్ల వేళలకు సరిపడే సమయాల్లో సర్వీసులు నడిపేది. ఇప్పుడు బస్సులు రద్దు కావడంతో వారు గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. సాధారణ ప్రజలూ ఆటోలు, జీపులపై ఆధారపడాల్సి వచ్చింది. ఇప్పుడు ఒక్కసారిగా వాటిసంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. బస్సులున్నప్పుడు ఆర్టీసీ ఛార్జీలకు దాదాపు సమంగా వీరు వసూలు చేసేవారు. ఇక బస్సుల్లేవని తేలిపోవటంతో ఒక్కసారిగా రేట్లను పెంచేశారు. ఇలాగే ఉంటే భవిష్యత్తులో వాటి వల్ల రోడ్డు ప్రమాదాలు కూడా పెరిగిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### ఆటోలు, జీపులమయం..

రెండు దశాబ్దాల క్రితం నగరం నుంచి సిటీ బస్సులు శివారు గ్రామాలకు తప్ప అంతకు మించి ముందుకు వెళ్లేవి కాదు. కానీ, సిటీ విస్తరిస్తుండటంతో 30–40 కి.మీ. దూరంలో ఉన్న గ్రామాల ప్రజలు నిత్యం నగరానికి రాకపోకలు సాగిస్తుండటంతో క్రమంగా అంత పరిధిలో విస్తరించిన

### ఇదీ కారణం..

నగరం నుంచి గ్రామాలకు తిప్పుతున్న ఆర్టీసీ బస్సులకు కి.మీ.కు నిర్వహణ వ్యయం రూ.55గా ఉంటోందని ఆర్టీసీ లెక్కలు తేల్చింది. కానీ ఆదాయం రూ.35 లోపే ఉంటోంది. అంటే కి.మీ.కు రూ.20కి పైగా నష్టం వస్తోందని అంటోంది. ఇందులో సిబ్బంది జీతాల వాటా రూ.27 దాకా అవుతోంది. డీజిల్‌ రూ.18గా ఉంది. మిగతాది ఇతర నిర్వహణ వ్యయం.

### గ్రామీణాభివృద్ధిలో బస్సు..

- గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజా రవాణాతో అనుసంధానమై ఉండటం కూడా ముఖ్యం. నగరానికి చేరువగా ఉన్న వాటికి ఇది మరింత కీలకం. ఇప్పుడు దాన్ని చెరిపేసినట్లయింది.
- గ్రామీణాభివృద్ధి నిధుల నుంచి నష్టాన్ని భర్తీ చేయాలనే వాదన చాలా కాలంగా ఉంది. మెట్రో రైలుకు వయబిలిటీ గ్యాప్‌ ఫండింగ్‌ ఇచ్చినట్లుగానే ఆర్టీసీ గ్రామీణ సర్వీసులకు కూడా ఇవ్వాలన్న సిఫారసు ఉంది. డీజిల్‌పై పన్ను తగ్గించడం ద్వారా గానీ.. సిటీ ఆపరేషన్స్‌ రెవెన్యూలో 5 శాతం, జిల్లా రెవెన్యూలో 7 శాతం చొప్పున వసూలు చేస్తున్న మోటారు వాహన పన్నులో కొంత మినహాయింపు ఇవ్వడం ద్వారా గానీ ఈ సాయం చేయాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### మొత్తం సర్వీసుల రద్దు దిశగా..

అద్దె బస్సుల్లో సిబ్బంది జీతాల భారం చాలా తక్కువగా ఉండటం, కండక్టర్‌ జీతాన్ని ఆర్టీసీనే భరిస్తుండటంతో అద్దె బస్సుల నిర్వహణ వ్యయం తక్కువగా ఉండి వాటిని నడపగలుగుతున్నారు. క్రమంగా ఆర్టీసీ తన మొత్తం గ్రామీణ సర్వీసులను రద్దు చేసే దిశగా యోచిస్తోంది. బస్సుల రద్దుతో మిగిలిన కండక్టర్లను బదిలీ చేస్తున్నారు. తాజాగా ఒక్క ఇబ్రహీంపట్నం డిపో పరిధిలోనే 25 మంది కండక్టర్లు దూర ప్రాంతాల డిపోలకు బదిలీ అయ్యారు. ఇందులో మహిళా కండక్టర్లను దూరంగా ఉన్న హెచ్‌సీయూ డిపోకు మార్చారు. అంత దూరం వెళ్లి రావడానికి వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది.





హెలికాప్టర్‌ సేవలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌

# హైదరాబాద్‌–మేడారం మధ్య హెలికాప్టర్‌

**సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌**

సనత్‌ నగర్‌: తెలంగాణ కుంభమేళా మేడారం జాతర నేపథ్యంలో హైదరాబాద్‌ నుంచి మేడారానికి గగన మార్గాన చేరుకునేందుకు పర్యాటక శాఖ ఏర్పాట్లు చేసింది. మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే ప్రత్యేక రైళ్లు, బస్సులను ప్రారంభించగా.. తాజాగా హెలికాప్టర్‌ సేవలను అందుబాటులోకి తెచ్చింది. బేగంపేట పాత ఎయిర్‌పోర్ట్‌లో హైదరాబాద్‌–మేడారం హెలికాప్టర్‌ సేవలను టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోనే అతి పెద్ద జాతర మేడారం జాతర అని పేర్కొన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జాతరకు కోట్లాది మంది భక్తులు వస్తుంటారని, గత ప్రభుత్వాలు అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయకుండా వదిలేశాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రకృతి సౌందర్యాలకు నెలవైన మేడారంలో అవసరమైన ఏర్పాట్లు చేశారని చెప్పారు. మేడారం జాతర ద్వారా రాష్ట్ర సంస్కృతిని ప్రపంచదేశాలకు చాటిచెప్పే అవకాశం ఉన్నప్పటికీ గత ప్రభుత్వాలు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధకరమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ మేడారం జాతరను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.కోట్ల వ్యయంతో అక్కడ విడిది సౌకర్యం, రోడ్ల నిర్మాణం వంటి అన్ని రకాల వసతులు కల్పించారని పేర్కొన్నారు. మేడారం జాతరను ప్లాస్టిక్‌ రహితంగా జరుపుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఏవియేషన్‌ శాఖ సహకారంతో టూరిజం శాఖ హెలికాప్టర్‌ సేవలను ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, టూరిజం చైర్మన్‌ భూపతిరెడ్డి, ఎండీ మనోహర్, పౌర విమానయాన శాఖ డైరెక్టర్‌ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మేడారం ప్యాకేజీలు ఇవే..

బేగంపేట పాత విమానాశ్రయం నుంచి మేడారానికి, తిరిగి మేడారం నుంచి బేగంపేట విమానాశ్రయానికి హెలికాప్టర్‌ సేవలను ప్రారంభించారు. ప్యాకేజీలో భాగంగా ఆరుగురు ప్రయాణికులకు రూ.1,80,000 ప్లస్‌ జీఎస్‌టీని (అప్‌ అండ్‌ డౌన్‌) నిర్ణయించారు. ఈ ప్యాకేజీలో భాగంగా రాను పోను హెలికాప్టర్‌ ఛార్జీలు, హెలిప్యాడ్‌ నుంచి ప్రత్యేక వాహన సౌకర్యంతో పాటు వీఐపీ మార్గంలో దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తారు. మేడారంలో జాతర వ్యూను (ఏరియల్‌ వ్యూ) తిలకించేందుకు ప్రతి ప్రయాణికుడికి రూ.2,999 ఛార్జీ వసూలు చేస్తారు. హెలికాప్టర్‌ సేవల కోసం 94003 99999ను సంప్రదించవచ్చు.

## జాతరకు ప్రత్యేక బస్సులు ప్రారంభం

హన్మకొండ: ములుగు జిల్లా మేడారంలో జరగనున్న సమ్మక్క, సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ మేరకు రాష్ట్రంలోని 51 ప్రత్యేక బస్‌ స్టేషన్ల నుంచి ఆదివారం బస్సులు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని 34 ప్రత్యేక బస్‌ స్టేషన్లు, అలాగే రాష్ట్రంలోని మిగతా 16 ప్రత్యేక బస్‌ స్టేషన్లతో పాటు మహారాష్ట్రలోని సిరోంచ నుంచి ప్రత్యేక బస్సులు మేడారానికి నడిపిస్తున్నారు. ప్రత్యేక బస్‌ స్టేషన్లలో భక్తుల కోసం చలువ పందిల్లు, మూత్రశాలలు, తాగు నీటి సౌకర్యం కల్పించారు. కాగా, మొదటి రోజైన ఆదివారం 425 బస్సుల్లో 16,289 మంది భక్తులు మేడారం వెళ్లారని ఆర్టీసీ వరంగల్‌ రీజనల్‌ మేనేజర్‌ అంచూరి శ్రీధర్‌ తెలిపారు. అలాగే, తిరుగు ప్రయాణంలో 425 బస్సుల ద్వారా 14,028 మంది వచ్చారని వివరించారు.

# స్కూళ్లకూ అక్రెడిటేషన్‌!

▶ మొదటి పేజీ తరువాయి

మండళ్లు (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించాలి. పాఠశాలలు, టీచర్లు, భాగస్వాములతో సంప్రదించి వాటిని రూపొందించాలి. ఎస్‌ఎస్‌ఎస్‌ఏ పాఠశాలల సెల్ఫ్‌ ఆడిట్‌ను పరిశీలించి అక్రెడిటేషన్‌ ఇచ్చేందుకు అవసరమైన ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేయాలి.

- ఎస్‌ఎస్‌ఎస్‌ఏ అమలు చేసే విధివిధానాలు పారదర్శకంగా రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.
- అన్ని స్థాయిల విద్యలో అక్రెడిటేషన్‌ విధానం ఉండాల్సిందే. దీనిని ప్రీ స్కూల్‌ విద్య, ప్రైవేటు, ప్రభుత్వ విద్య విభాగాలన్నింటిలో అమలు చేయాలి. తద్వారా కచ్చితమైన నాణ్యతా ప్రమాణాలు సాధించాలి.
- కొత్తగా ప్రైవేటు స్కూళ్లను ఏర్పాటు చేయాలంటే ఎస్‌ఎస్‌ఎస్‌ఏ నుంచి లైసెన్స్‌ టు స్టార్ట్‌ ఏ స్కూల్‌ (ఎల్‌ఎస్‌ఎస్‌) పొందాలి. ఎస్‌ఎస్‌ఎస్‌ఏ నిబంధనల మేరకు సెల్ఫ్‌ డిక్లరేషన్‌ ఇవ్వాలి.
- అకడమిక్‌ వ్యవహారాలు, కరిక్యులమ్‌ సంబంధ అంశాలు అన్నింటినీ జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండళ్ల (ఎస్‌సీఈఆర్‌టీ) సహకారంతో ఎస్‌సీఈఆర్‌టీలే చూడాలి. ఉపాధ్యాయ శిక్షణ సంస్థలను బలోపేతం చేసి విధానాల రూపకల్పనలో వాటి సహకారం తీసుకోవాలి.
- స్కూల్‌ క్వాలిటీ అసెస్‌మెంట్‌ అండ్‌ అక్రెడిటేషన్‌ ఫ్రేమ్‌ వర్క్‌ను (ఎస్‌క్యూఏఏఎఫ్‌) ఎస్‌సీఈఆర్‌టీలు రూపొందించాలి. దీని రూపకల్పన క్రమంలో సంబంధిత అన్ని వర్గాలను భాగస్వాములను చేయాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు ఒకే రకమైన అసెస్‌మెంట్, అక్రెడిటేషన్‌ విధానం అమలు చేయాలి. దానికి సంబంధించిన విధివిధానాలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఇవ్వాలి.
- నాణ్యతా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొనే క్రమంలో నేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వే, స్టేట్‌ అచీవ్‌మెంట్‌ సర్వే (సాస్‌) అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.
- కేంద్ర విద్యా సంస్థల అక్రెడిటేషన్‌కు సీబీఎస్‌ఈ, ఎన్‌సీఈఆర్‌టీలతో సంప్రదించి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ రెగ్యులేటరీ విధానాన్ని రూపొందించాలి.
- అక్రెడిటేషన్‌ విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు విద్యాహక్కు చట్టం–2009ని సమీక్షించాలి. అయితే మూడేళ్ల వయసు నుంచి అందించే ఎర్లీ చైల్డ్‌హుడ్‌ ఎడ్యుకేషన్‌ నుంచి మొదలుకొని 12వ తరగతి వరకు విద్యాహక్కు చట్టం నిబంధనల ప్రకారం అందరికీ విద్యావకాశాలు దూరం కాకుండా చూడాలి.
- ఏటా విద్యా ప్రమాణాలు పరిశీలించే ఎస్‌ఏఎస్‌ నిర్వహణ కోసం నేషనల్‌ అసెస్‌మెంట్‌ సెంటర్‌ ఫర్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ను (ఎన్‌ఏసీఎస్‌ఈ) ఏర్పాటు చేయాలి.

## గుత్తాకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన జన్మదిన సందర్భంగా ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. గుత్తాను కేసీఆర్ శాలువాతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు ఫిల్మ్‌నగర్‌లోని గుత్తా నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

## చెన్నమనేనికి సీఎం కేసీఆర్ ఆశీస్సులు



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలసి ఆశీస్సులు పొందారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, చెన్నమనేని కుమారుడు అరుణ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బడ్జెట్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం: కర్నె

- రాష్ట్రాన్ని తిరోగమనానికి తీసుకెళ్లే బడ్జెట్
- మాంద్యాన్ని దాచి కేంద్రం అంకెల గారడీ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌ను దక్షిణాది ఆడబిడ్డ, తెలుగు రాష్ట్రాల కోడలు సీతారామన్ ప్రవేశపెట్టినా దక్షిణాది రాష్ట్రాలకు, తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసేలా ఉందని ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ విమర్శించారు. ఈ బడ్జెట్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. బడ్జెట్‌లో తెలంగాణను నోటితో మెచ్చుకుంటూ నొసటితో వెక్కిరించారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కేంద్ర బడ్జెట్ మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఓ నీతి, బీజేపీయేతర రాష్ట్రాలకు ఇంకో నీతి అన్నట్టు బడ్జెట్ ఉందన్నారు. పురోగమిస్తున్న తెలంగాణను తిరోగమన దిశలో తీసుకెళ్లే బడ్జెట్ ఇది అని మండిపడ్డారు. అయినా, తెలంగాణ బీజేపీ నేతలు బడ్జెట్‌పై జబ్బలు చరుచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కర్ణాటకకు న్యాయం చేసి తెలంగాణకు అన్యాయం చేస్తే తెలంగాణ బీజేపీ నేతలు ఎలా సమర్థిస్తారు? అని ప్రశ్నించారు. నీతి అయోగ్ సిఫారసుల మేరకు మిషన్ కాకతీయ, భగీరథ పథకాలకు రూ.24 వేల కోట్లను కేటాయించాలని కోరితే కేంద్రం పట్టించుకోలేదన్నారు. ఇక నీతి అయోగ్ ఎందుకని ప్రశ్నించారు. జీఎస్టీ విషయంలో రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్రం మోసం చేసిందన్నారు. ఆర్థిక మాంద్యాన్ని కేంద్రం దాచి పెట్టి అంకెల గారడీ చేస్తోందన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టే చర్యలకే కేంద్రం ప్రాధాన్యతనిస్తోంది తప్ప దేశ ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచేందుకు ఏ చర్య తీసుకోవడం లేదన్నారు. కేంద్ర బడ్జెట్ దేశాన్ని అధ్యక్ష తరహా పాలన వైపు తీసుకెళ్లేలా ఉందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ నేతలు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై చేసే పోరాటానికి మద్దతు పలకాలని బీజేపీ నేతలకు పిలుపునిచ్చారు. విభజన చట్టం హామీలను అమలు చేయాలని ఐదేళ్లుగా అడుగుతున్నా కేంద్రానికి చీమ కుట్టినట్టయినా లేదన్నారు. సమాఖ్య స్ఫూర్తిని మంటగలుపుతున్న బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తెలంగాణ పట్టణాభివృద్ధికి నిధులు తగ్గించడం దుర్మార్గమైన చర్య అన్నారు. తెలంగాణ బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు అడ్డు తగిలే బదులు అన్యాయం చేస్తున్న కేంద్రంపై పోరాడాలన్నారు.

## బీసీలపై ఎందుకీ వివక్ష..? ఎన్నాళ్లీ కక్ష..?



నాంపల్లి: దేశవ్యాప్తంగా జరిగే జనాభా లెక్కల సేకరణలో బీసీల జనాభా లెక్క ఎంతో తేల్చాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్‌చేశారు. జనాభా లెక్కల సేకరణ కోసం గత జనవరి 7వ తేదీన భారత ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో బీసీ అనే పదాన్ని చేర్చకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీల జనాభా ఎంతో తేల్చలేని ఈ మోదీ ప్రభుత్వం ఇక చట్టసభల్లో బీసీలకు ఏం న్యాయం చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల సంఘాల జేఏసీ సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో 'దేశంలో బీసీల లెక్క తేల్చాల్సిందే'అనే అంశంపై జరిగిన సదస్సుకు జాజుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిజర్వేషన్ల విషయంలో క్రీమీలేయర్‌ను బీసీలపై రుద్ది వివాదాస్పదమైన సీఏఏ, ఎన్ఆర్‌సీ వంటి అనవసరమైన సమస్యలను తీసుకువచ్చి కాలాన్ని వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి బీసీలపై ఎందుకీ వివక్ష? ఎన్నాళ్లీ కక్ష? అంటూ జాజుల ధ్వజమెత్తారు. ఈ నెల 18న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆలిండియా బీసీ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపుతో మార్చి 3వ వారంలో వేలాది మందితో ఢిల్లీలోని జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు జరిగే బీసీల లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్త బంగారు నర్సింహ సగర, బీసీ కుల సంఘాల నేతలు గోశిక యాదగిరి, కొండ దేవన్న, విజయ భాస్కర్, కోలా శ్రీనివాస్, సలీం బాషా, అంబాల నారాయణ గౌడ్, చింతల మల్లేశ్ గౌడ్, పద్మ, బి.నర్సింహ, ఎ.వేణు, కుల్కచర్ల శ్రీనివాస్, యస్.దుర్గయ్య గౌడ్, కనకాల శ్యాం, ప్రమీల, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, జయంతిరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఏవో సమావేశాలకు డా.కేశవులు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ విత్తన పరీక్ష సంఘం (ఇస్టా) ఉపాధ్యక్షుడి హోదాలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ కె.కేశవులు ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో)లో జరిగే సమావేశాలకు హాజరుకానున్నారు. ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు రోమ్, పారిస్, జెనీవా, బోలోగ్నలో ఆయన పర్యటించనున్నారు. రోమ్‌లోని ఎఫ్ఏవో ఉన్నతాధికారులతో తెలంగాణ విత్తన పరిశ్రమ బలోపేతానికి, ఇతర దేశాలకు ఎగుమతులను ప్రోత్సహించడానికి సహకారంపై చర్చించనున్నారు.

# కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం సుస్థిరం
- అందుకే ఏ ఎన్నికలు జరిగినా టీఆర్ఎస్‌దే విజయం: కేటీఆర్
- టీఆర్ఎస్‌లో చేరిన శంషాబాద్‌లోని 8 మంది ఫార్వర్డ్ బ్లాక్ కౌన్సిలర్లు



కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కౌన్సిలర్లు

సాక్షి, హైదరాబాద్: ఇండియా–పాకిస్తాన్, హిందూ–ముస్లిం అనడం.. చలికాచుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడే పని ఒక్కటి కూడా బీజేపీ దగ్గర లేదని టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు విమర్శించారు. బీజేపీ నేతలకు మత రాజకీయాలు తప్ప దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలని లేదన్నారు. రాష్ట్రానికి సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు. రైతుబంధు, రైతుభరోసా, విద్యార్థులకు సన్న బియ్యం భోజనం, కల్యాణలక్ష్మీ వంటి పథకాలతో ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం సుస్థిరమైపోయిందని, కేసీఆర్ ఉంటే తమకు ఎలాంటి భయం ఉండదని పేదల్లో నమ్మకం ఏర్పడిందన్నారు. అందుకే పట్నం, పల్లె, అసెంబ్లీ, పార్లమెంట్, ఢిల్లీ, గల్లీ ఏ ఎన్నికైనా టీఆర్ఎస్సే గెలుస్తోందన్నారు. టీఆర్ఎస్ వరుస విజయాలతో కాంగ్రెస్, బీజేపీలకు మతిపోయిందని అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ నుంచి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున గెలిచిన 8 మంది కౌన్సిలర్లు టీడీపీ నేత గణేశ్ గుప్తా నేతృత్వంలో ఆదివారం టీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### అడ్డిమారి గుడ్డిదెబ్బలా 4 సీట్లు..

కాంగ్రెస్, బీజేపీలు పార్టీలు రెండు పేరుకే జాతీయ పార్టీలని, వాటికి నీతి, నిజాయితీ, సిద్ధాంతం లేదని కేటీఆర్ మండిపడ్డారు. అడ్డిమారి గుడ్డిదెబ్బ లాగా బీజేపీ రాష్ట్రంలో 4 ఎంపీ సీట్లు గెలవడంతో లక్ష్మణ్ రోజూ ప్రెస్‌మీట్ పెట్టి కేసీఆర్‌ను తిట్టే పని పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి 2 డివిజన్లు మాత్రమే దక్కాయని గుర్తు చేసుకోవాలని అన్నారు. బీజేపీకి క్షేత్ర స్థాయిలో బలగం లేదని, ఆ విషయాన్ని లక్ష్మణ్ గుర్తించాలని సూచించారు. బీజేపీ రాష్ట్రంలో గెలవాలంటే కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రాజెక్టులకు ఢిల్లీ నుంచి జాతీయ హోదా నిధులు తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇది చేతకావడం లేదన్నారు. రాష్ట్రానికి రాజ్యాంగపరంగా, చట్టబద్ధంగా రావాల్సిన నిధుల కన్నా కేంద్రం అర్థపైసా కూడా అధికంగా కేటాయించలేదని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి ఫార్మాసిటీ నిర్మాణానికి రూ.3 వేల కోట్లు, హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్–నాగ్‌పూర్, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి నిధులు, నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు మిషన్ భగీరథకు రూ.19 వేల కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు కేటాయించాలని కేంద్రానికి కోరినా నయాపైసా కేటాయించలేదని తెలిపారు. ఇప్పటివరకు బీజేపీ 6 కేంద్ర బడ్జెట్లను ప్రవేశపెట్టిందని, అన్ని సార్లూ రాష్ట్రానికి అన్యాయమే చేసిందని మండిపడ్డారు.

### 3 పురపాలికల కోసం కాంగ్రెస్, బీజేపీ పొత్తు..

కాంగ్రెస్, బీజేపీలు తమ సిద్ధాంతాలను పక్కనబెట్టి బండ్లగూడ, మణికొండ, నార్సింగ్ మున్సిపాలిటీల చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ స్థానాల కోసం పొత్తుపెట్టుకున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. డైలాగులు చెప్పడంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అదరగొడుతున్నా, మున్సిపల్ ఎన్నికల్లో ఈ పార్టీలు కనీసం రెండో స్థానాన్ని కూడా కైవసం చేసుకోలేకపోయాయని ఎద్దేవా చేశారు.

### 45 శాతం బీసీలకు..

మున్సిపల్ ఎన్నికల్లో 45 శాతం సీట్లు బీసీలకు కేటాయించామని కేటీఆర్ తెలిపారు. మహిళలకు 244 చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ స్థానాలు కేటాయించడం ద్వారా వారికి 57 శాతం కోటా అమలు చేశామన్నారు. రాజకీయంగా వెనకబడిన వర్గాలకు పదవుల కేటాయింపుల్లో ప్రాధాన్యతనిస్తున్నామని, ఆర్యవైశ్యులకు 11 చైర్‌పర్సన్ పదవులు కేటాయించామని తెలిపారు. ఎన్నికల వ్యవస్థ, కోర్టులపై నమ్మకం లేదని ఫలితాల తర్వాత ఉత్తమ్ పేర్కొన్నారని, వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలు నమ్మకాన్ని కోల్పోయిందని విమర్శించారు. పౌరసత్వ చట్ట సవరణ బిల్లు(క్యాబ్)కు టీఆర్ఎస్ మద్దతు ఇవ్వకపోవడంతో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా కేంద్రం మొండిచేయి చూపిందని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సుభాహీ ఖాన్. చిత్రంలో లక్ష్మణ్ ఇతర బీజేపీ నేతలు

# ఇష్టమున్నా.. లేకున్నా.. సీఏఏ అమలు

- సీఏఏ మద్దతు సభలో పలువురు వక్తలు
- భారత్ సంఘర్ష్ సమితి భాగ్యనగర్ ఆధ్వర్యంలో సభ
- హాజరైన బీజేపీ నేతలు

చార్మినార్/దూద్‌బౌలి: ఎవరికి ఇష్టమున్నా.. లేకున్నా.. దేశంలో సీఏఏ అమలు తప్పకుండా జరుగుతుందని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ఆర్టికల్ 11 ప్రకారం కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తూచాతప్పకుండా పాటించాల్సిన అవసరముందని అన్నారు. సీఏఏ చట్టాన్ని అమలు చేయని రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు కావాలని స్వార్థ రాజకీయ లబ్ధి కోసం ముస్లింలను తప్పుదారి పట్టిస్తున్నారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అఖండ భారత్ సంఘర్ష్ సమితి భాగ్యనగర్ కన్వీనర్ ఆలే భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం కుడా స్టేడియంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ, నగర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి రఘునందన్‌రావు, సుప్రీంకోర్టు న్యాయవాది సుభూహీ ఖాన్ తదితరులు పాల్గొని సీఏఏ, ఎన్నార్సీ, ఎన్‌పీఆర్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. భారత్ మాతాకీ జై.. మోదీ, అమిత్‌షా జిందాబాద్ అంటూ.. తిరంగా జెండాలు పట్టుకొని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్వార్థ రాజకీయ లబ్ధి కోసం ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి రఘునందన్ రావు అన్నారు. ఆయనకు దమ్ము, ధైర్యం ఉంటే కుడాలో నిర్వహిస్తున్న ఈ సభకు రావాలని.. తామే దారుసలాంకు వచ్చి డిబేట్ నిర్వహిస్తామని సవాలు విసిరారు. గతంలో బంగ్లాదేశ్‌కు చెందిన తస్లీమా నస్రీన్ నగరానికి వచ్చి ప్రెస్‌క్లబ్‌లో సమావేశాన్ని నిర్వహిస్తే మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు ఆమెపై విచక్షణారహితంగా దాడులు నిర్వహించారన్నారు. దాడులు చేసిన మజ్లిస్ పార్టీ నాయకులపై ఇప్పటికైనా నగర పోలీసులు కేసులు నమోదు చేసి చార్జ్‌షీట్ వేయాల్సిన అవసరముందన్నారు. అసదుద్దీన్‌తో చేతులు కలిపిన సీఎం కేసీఆర్.. సీఏఏను తెలంగాణలో అమలు చేయబోమంటూ ప్రకటిస్తున్నారని, అవసరమైతే అసెంబ్లీలో ప్రకటన చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని వ్యతిరేకించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ల సందర్భంగా ఇంటికి వచ్చే అధికారులు ఎలాంటి పత్రాలు అడగబోరని.. కేవలం 14 ప్రశ్నలకు జవాబులను మాత్రమే సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో హిందూ సంఘటన్ అధ్యక్షుడు కరుణసాగర్, కార్పొరేటర్లు ఆలే లలిత నరేంద్ర, రేణు సోనీల తదితరులు పాల్గొన్నారు.

## మూణ్నెళ్లు రాజకీయాలు మాట్లాడను: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మూడు నెలల పాటు రాజకీయ నిశ్శబ్ద వ్రతం తీసుకుంటున్నట్లు సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రకటించారు. అప్పటి వరకు తాను రాజకీయాల గురించి మాట్లాడబోనని, మే నెల తర్వాత పరిస్థితులను బట్టి రాజకీయాలపై మాట్లాడుతానని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు నెలల పాటు సంగారెడ్డి ప్రజల సమస్యలపైనే మాట్లాడుతానని చెప్పారు. తన నియోజకవర్గంలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, దీన్ని నియోజకవర్గ మహిళలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపిన జగ్గారెడ్డి.. త్వరలోనే నియోజకవర్గంలో మద్యపాన నిషేధ ఉద్యమ కార్యాచరణ చేపడతానని, స్థానికంగా ఉన్న బీర్ల కంపెనీల నుంచే ఉద్యమాన్ని ప్రారంభిస్తానని వెల్లడించారు.

# 50 మంది ఐఏఎస్‌ల బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులను ప్రభుత్వం నియమించింది. ఇటీవల ముగిసిన పల్లెప్రగతి తొలి విడత కార్యక్రమంలో సాధించిన ఫలితాలు, త్వరలో అమల్లోకి తేనున్న పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని పరిగణనలోకి తీసుకుని సర్కారు జిల్లా కలెక్టర్ల బదిలీలు జరిపింది.

| ఐఏఎస్ | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| చిత్రా రామచంద్రన్ | ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, గృహనిర్మాణ శాఖ | ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ, హౌసింగ్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు |
| అధర్ సిన్హా | ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ | ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య శాఖ |
| రజత్‌కుమార్ | రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి | ముఖ్యకార్యదర్శి, నీటిపారుదల శాఖ |
| వికాస్‌రాజ్ | ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ | ముఖ్యకార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ |
| ఎం.జగదీశ్వర్ | ముఖ్యకార్యదర్శి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ | ముఖ్యకార్యదర్శి, రెవెన్యూ శాఖ |
| సి.పార్థసారథి | ముఖ్యకార్యదర్శి, వ్యవసాయ శాఖ | డైరెక్టర్ జనరల్, ఈపీటీఆర్ఐ |
| బి.వెంకటేశం | కార్యదర్శి, యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ | కార్యదర్శి, కమిషనర్ బీసీ సంక్షేమ శాఖ |
| బి.జనార్దన్‌రెడ్డి | కార్యదర్శి, విద్యాశాఖ | కార్యదర్శి, వ్యవసాయ శాఖ |
| సందీప్‌కుమార్ సుల్తానియా | సీఎం కార్యదర్శి | కార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ |
| రాహుల్ బొజ్జా | కమిషనర్, వ్యవసాయ శాఖ | కార్యదర్శి, ఎస్సీ అభివృద్ధి శాఖ |
| క్రిస్టినా జెడ్ చొంగ్తు | కమిషనర్, గిరిజన సంక్షేమశాఖ | కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ |
| టీకే శ్రీదేవి | డైరెక్టర్, పురపాలక శాఖ | కార్యదర్శి, ఆర్థిక శాఖ |
| కె.మాణిక్‌రాజ్ | కలెక్టర్, హైదరాబాద్ జిల్లా | కమిషనర్, పరిశ్రమల శాఖ |
| డి.రొనాల్డ్ రాస్ | కలెక్టర్, మహబూబ్‌నగర్ జిల్లా | కార్యదర్శి, ఆర్థిక శాఖ |
| రజత్‌కుమార్ సైనీ | కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | డైరెక్టర్, భూపరిపాలన |
| ఎన్.సత్యనారాయణ | కలెక్టర్, కామారెడ్డి | కమిషనర్, డైరెక్టర్, పురపాలక శాఖ |
| డి.దివ్య | కలెక్టర్, ఆదిలాబాద్ | కార్యదర్శి, స్త్రీ, శిశు, వికలాంగులు, వయోజనుల సంక్షేమ శాఖ |
| అద్వైత్ కుమార్ సింగ్ | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ | ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ టు చీఫ్ సెక్రటరీ |
| మహమ్మద్ అబ్దుల్ అజీం | డైరెక్టర్, యువజన సేవలు | కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి |
| ఎ.శరత్ | కలెక్టర్, జగిత్యాల | కలెక్టర్, కామారెడ్డి |
| పౌసుమి బసు | సీఈఓ, సెర్ప్ | కలెక్టర్, వికారాబాద్ జిల్లా |
| ఎంవీ రెడ్డి | కలెక్టర్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా | కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం |
| ఎ.దేవసేన | కలెక్టర్, పెద్దపల్లి జిల్లా | కలెక్టర్, ఆదిలాబాద్ జిల్లా |
| హరిచందన | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ | కలెక్టర్, నారాయణ్‌పేట |
| శ్వేతామహంతి | కలెక్టర్, వనపర్తి జిల్లా | కలెక్టర్, హైదరాబాద్ |
| పాటిల్ ప్రశాంత్ జీవన్ | కలెక్టర్, వరంగల్ అర్బన్ | కలెక్టర్, నల్లగొండ జిల్లా |
| రాజీవ్ గాంధీ హన్మంతు | కలెక్టర్, కుమ్రం భీం–అసిఫాబాద్ జిల్లా | కలెక్టర్, వరంగల్ అర్బన్ |
| శృతి ఓఝా | అదనపుకమిషనర్ జీహెచ్ఎంసీ | కలెక్టర్, జోగులాంబ–గద్వాల |
| టి.వినయ్‌కృష్ణారెడ్డి | కలెక్టర్, జనగామ | కలెక్టర్, సూర్యాపేట జిల్లా |
| వి.వెంకటేశ్వర్లు | కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి | కలెక్టర్, మేడ్చల్–మల్కాజ్‌గిరి |
| సందీప్‌కుమార్ ఝా | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ | కలెక్టర్, కుమ్రం భీం–ఆసిఫాబాద్ జిల్లా |
| సిక్తా పట్నాయక్ | అదనపుకమిషనర్, జీహెచ్ఎంసీ | కలెక్టర్, పెద్దపల్లి జిల్లా |
| ముషరఫ్ అలీ ఫారూఖీ | అదనపుకమిషనర్, జీహెచ్ఎంసీ | కలెక్టర్, నిర్మల్ జిల్లా |
| ఎస్.కృష్ణా ఆదిత్య | ప్రాజెక్టు ఆఫీసర్, ఐటీడీఏ ఉట్నూరు | కలెక్టర్, ములుగు జిల్లా |
| వీపీ గౌతం | ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ భద్రాచలం | కలెక్టర్, మహబూబాబాద్ |
| జి.రవి | జేసీ, హైదరాబాద్ | కలెక్టర్, జగిత్యాల |
| కె.నిఖిల | జేసీ, సంగారెడ్డి | కలెక్టర్, జనగామ |
| షేక్ యాస్మిన్ బాషా | జేసీ, రాజన్న సిరిసిల్లా | కలెక్టర్, వనపర్తి |
| ఎస్.వెంకటరావు | కలెక్టర్, నారాయణ్‌పేట | కలెక్టర్, మహబూబ్‌నగర్ |
| గౌతం పొట్రు | సబ్‌కలెక్టర్, మెట్‌పల్లి | ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ భద్రాచలం |
| రాహుల్‌రాజ్ | సబ్ కలెక్టర్, బెల్లంపల్లి | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ |
| భావేశ్ మిశ్రా | సబ్ కలెక్టర్, భద్రాచలం | ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ ఉట్నూరు |
| జెండగే హన్మంత్ కొండిబా | ప్రత్యేకాధికారి, ఖమ్మం | ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ ఏటూనాగారం |
| వల్లూరు క్రాంతి | ప్రత్యేకాధికారి, మహబూబ్‌నగర్ | మున్సిపల్ కమిషనర్, కరీంనగర్ |
| పి.ఉదయ్‌కుమార్ | ప్రత్యేకాధికారి, జగిత్యాల | మున్సిపల్ కమిషనర్, రామగుండం |
| జితేష్ వి.పాటిల్ | ప్రత్యేకాధికారి, సంగారెడ్డి | మున్సిపల్ కమిషనర్, నిజామాబాద్ |
| బి.గోపి | ప్రత్యేకాధికారి, ఆదిలాబాద్ | మున్సిపల్ కమిషనర్, నిజాంపేట |
| బధావత్ సంతోష్ | ప్రత్యేకాధికారి, వరంగల్ రూరల్ | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ |
| ప్రియాంక అల | ప్రత్యేకాధికారి, యాదగిరి భువనగిరి | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ |
| పి.ప్రవిణ్య | ప్రత్యేకాధికారి, కరీంనగర్ | అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ |

# 5 రోజులు 135 ఫిర్యాదులు

- మోతమోగుతున్న రవాణా మంత్రి వాట్సాప్
- అధికారులపై ఆర్టీసీ డిపో సిబ్బంది ఆరోపణలు
- సంస్థ బాగు కోసం కొన్ని సూచనలు కూడా..

సాక్షి, హైదరాబాద్

'సర్ అధికారులు నాకో మైకు ఇచ్చారు. బస్టాండులోకి బస్సు రాగానే ప్రయాణికులను పిలుస్తూ, దాని వివరాలను మైకులో గట్టిగా చెప్పాలని చెప్పారు. ఇది ఇబ్బందిగా ఉంది. దయచేసి మైకులో అరిచే బాధ తప్పించండి'

–ఖమ్మం జిల్లా నుంచి ఓ మహిళా కండక్టర్

'నగరంలో బస్సు ప్రయాణికుల్లో ఎక్కువ మంది దగ్గర బస్‌పాసులే ఉంటాయి. బస్సు నిండుగా ఉన్నా, టికెట్ రెవెన్యూ తక్కువగానే కనిపిస్తుంది. ఆదాయం తక్కువగా ఉంటోందని అధికారులు నన్ను వేధిస్తున్నారు. ఇందులో నా తప్పేముంది'



–హైదరాబాద్ సిటీ కండక్టర్

'బస్సు బయలు దేరినా పాప్‌కార్న్ అమ్ముకునే వ్యక్తి దిగకపోవటంతో మందలించాను. ఆ వెంటనే బస్టాండులోని ఆ షాపు యజమాని వచ్చి నన్ను దుర్భాషలాడాడు. నా తప్పు లేనందున నేను జవాబిచ్చాను. అంతే నన్ను దోషిని చేసి విధులు ఇవ్వకుండా స్పేర్‌లో ఉంచారు'

ఇవీ రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వాట్సాప్‌కు వచ్చిన ఫిర్యాదులు. డిపోల్లో అధికారులు వేధిస్తున్నారంటూ కండక్టర్లు, డ్రైవర్ల నుంచి అధికంగా ఫిర్యాదులు వచ్చి పడుతున్నాయి. వీటితోపాటు, ఆర్టీసీని లాభాల దిశలో నడపాలంటే తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు కూడా పెద్ద సంఖ్యలోనే వస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఈ మెసేజ్‌లతో మంత్రి వాట్సాప్ మోత మోగిపోతోంది. గత నెల 29న మంత్రి పువ్వాడ ఖైరతాబాద్‌లోని ట్రాన్స్‌పోర్టు భవన్‌లో కొత్త చాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆర్టీసీ, రవాణాశాఖలకు చెందిన విషయాలు వెల్లడించారు. కార్మిక సంఘాలు లేకపోవటాన్ని ఆసరా చేసుకుని కొందరు డిపో అధికారులు సిబ్బందిని వేధిస్తున్నారంటూ వారి వాట్సాప్ గ్రూపుల్లో ఆవేదన వ్యక్తంచేసుకుంటున్నారని విలేఖరులు మంత్రి దృష్టికి తెచ్చారు. నిజంగా వేధింపులు ఉంటే తనకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చంటూ అజయ్‌కుమార్ తన వాట్సాప్ నంబర్‌ను వెల్లడించారు. ఇక అంతే, ఆ రోజు నుంచే ఆయన ఫోన్‌కు వాట్సాప్ మెస్సేజ్‌ల పరంపర మొదలైంది. గడచిన ఐదు రోజుల్లో 135కు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వాటి వివరాలు క్రోడీకరిస్తున్నారు. అందులోంచి కొన్నింటిని పరిశీలించిన మంత్రి, 15 ఫిర్యాదులకు సంబంధించి అధికారులతో మాట్లాడారు. సంస్థ నిబంధనలు, డిపో అవసరాలకు చెందిన సూచనలను అధికారులు చేస్తే వాటిని వేధింపులుగా భావించే సిబ్బందికి నచ్చ చెప్పాలని, కానీ, కావాలనే కొన్ని అనవసర విషయాలపై ఒత్తిడి తేవడం గాని, సిబ్బంది తప్పు లేకున్నా బాధ్యులను చేసి చర్యలు తీసుకోవటం సరికాదని ఆయన సూచించారు. మహిళా కండక్టర్లకు మైకు ఇచ్చి బస్టాండ్లలో అరిపించటం కూడదన్నారు. సంస్థ ఇప్పుడిప్పుడే పురోగమించే స్థితిలో ఉన్నందున అధికారులు–సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సి ఉందని, అనవసరంగా అభిప్రాయభేదాలు కలిగేలా చూసుకుంటే సంస్థకు నష్టం వాటిల్లుతుందన్నారు. అలాగే, తప్పుడు ఫిర్యాదులు చేస్తే సిబ్బందిపై కూడా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సంస్థకు లాభాలు తెచ్చేందుకంటూ సిబ్బంది చేసిన సూచనలను కూడా పరిశీలిస్తున్నారు. వాటిల్లో మెరుగైనవి, అమలు చేయదగ్గవాటిని గుర్తించి ఈడీలకు పంపుతున్నారు.

## రేసింగ్‌కు పాల్పడితే లైసెన్స్ రద్దు!

మంత్రి పువ్వాడ ఆదేశాలతో చర్యల దిశగా అడుగులు

సాక్షి, హైదరాబాద్: నగరంలో ఖరీదైన వాహనాలతో రోడ్లపై రేసింగ్, ఛేజింగ్‌లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు రవాణా శాఖ సిద్ధమవుతోంది. గతంలో రాత్రివేళ ఖరీదైన స్పోర్ట్స్ కార్లలో రోడ్డెక్కే యువకులు రేసింగ్‌లకు పాల్పడేవారు. కానీ ఇప్పుడు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో కూడా రేసింగులకు పాల్పడుతున్నారు. నెక్లెస్ రోడ్డు, పీవీ ఎలివెటెడ్ ఎక్స్‌ప్రెస్ వే, ఔటర్ రింగురోడ్లపై వారు రెచ్చిపోతున్నారు. ఆదివారం ఉదయం పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై రెండు ఖరీదైన స్పోర్ట్స్ కార్లలో విపరీతమైన వేగంతో దూసుకుపోతున్న వారిని పోలీసులు వెంబడించి మరీ పట్టుకున్నారు. దీనిపై రవాణా శాఖ మంత్రి పు వ్వాడ అజయ్‌కుమార్ స్పందించారు. 'ఇప్పటికే నాకు వీటిపై చాలా ఫిర్యాదులొచ్చాయి. పత్రికల్లో కూడా వాటి గురించి చదువుతున్నాను. రోడ్లపై వాహనాల సంఖ్య పెరిగినందున జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. రేసింగ్‌కు పాల్పడే వారి వల్ల ఇతరులకు సైతం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటికి అడ్డుకట్టపడాల్సిన అవసరముంది. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను ఆదేశిస్తున్నాను' అని వెల్లడించారు.

### కౌన్సెలింగ్.. తర్వాత లైసెన్స్ రద్దు

నగరంలో ఇలాంటి వాహనాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి వాటి యజమానులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో పోలీసుల సహకారాన్ని కూడా తీసుకుంటారు. సదరు వాహనాలను చిన్న వయసున్న వారు నడుపుతుంటే తల్లిదండ్రులను కూడా పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తారు. ఒకసారి కౌన్సెలింగ్ ఇచ్చాక కూడా వాహనాలను పరిమితికి మించిన వేగంతో నడిపినట్లు తేలితే వారి లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. వాహనాలను కూడా సీజ్ చేస్తారు. కాగా చట్టసవరణ చేసి రేసింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునేలా చేస్తే తప్ప దానికి ముకుతాడు పడదన్న విషయాన్ని ఇప్పుడు రవాణా మంత్రి పరిశీలిస్తున్నారు.

## మాజీ ఎంపీ నారాయణరెడ్డి మృతి



**నిజామాబాద్ అర్బన్:** తొలి దశ తెలంగాణ ఉద్యమ నాయకుడు, నిజామాబాద్ మాజీ ఎంపీ ఎం.నారాయణరెడ్డి (89) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలం జిల్లాలోని మోర్తాడ్ మండలం సుంకెట్. 1931 సెప్టెంబర్ 10న జన్మించిన నారాయణరెడ్డి ప్రజా సేవకుడిగా, న్యాయవాదిగా మంచి పేరుపొందారు. ఆయనకు గుండెపోటు రావడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. 1967లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నారాయణరెడ్డి విజయం సాధించారు. అలాగే, 1972లో బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సీఎల్పీ సెక్రెటరీగా, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఏపీ షుగర్ కేన్ గ్రోవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి పని చేశారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాల వ్యవస్థాపకులైన నారాయణరెడ్డికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

**సంతాప సభగా సన్మాన సభ..**

మాజీ ఎంపీ నారాయణరెడ్డికి ఆదివారం పౌర సన్మానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం మాక్లూర్ మండలం మామిడిపల్లి గ్రామ శివారులోని శ్రీ అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయంలో అంతా సిద్ధం చేశారు. అయితే, ఇంతలోనే ఆయన హఠన్మరణం చెందడంతో సన్మాన సభ సంతాప సభగా మారింది. పౌర సన్మాన కార్యక్రమానికి వచ్చిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ స్పీకర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రి సంతోష్‌రెడ్డి తదితరులు.. నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## మాజీ మంత్రి సురేందర్‌రెడ్డి మృతి



**ఘట్‌కేసర్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, కొమురెడ్డి సురేందర్‌రెడ్డి ఆదివారం మరణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన టీడీపీ నుంచి 1985లో ఎమ్మెల్యేగా, 1989లో ఎన్టీఆర్ మంత్రివర్గంలో అటవీశాఖ, పశు సంవర్థక శాఖ మంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవలందించారు. బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా, 2001లో టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడిగా, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా కేసీఆర్‌తో కలిసి పనిచేశారు. గ్రామం, నియోజకవర్గంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామం కొర్రెముల్‌లో సర్పంచ్ ఓరుగంటి వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం

**సాక్షి, హైదరాబాద్:** మాజీ ఎంపీ ఎం.నారాయణరెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**

మాజీ మంత్రి సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ, స్వాతంత్ర్య సమరయోధుడు ఎం.నారాయణరెడ్డిల అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని మేడ్చల్, నిజామాబాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించాలని కోరారు.

**నారాయణరెడ్డి మృతి పట్ల కేటీఆర్ సంతాపం**

**సాక్షి, హైదరాబాద్:** తొలి తరం తెలంగాణ నాయకుడు, నిజామాబాద్ మాజీ ఎంపీ పండిట్ ఎం.నారాయణరెడ్డి మృతి పట్ల ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు సంతాపం వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆరు దశాబ్దాల పాటు నారాయణరెడ్డి తెలంగాణ ఉద్యమంతో మమేకం అయ్యారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అన్నారు. నారాయణరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

## పీఆర్సీ 65 శాతం ప్రకటించాలి

### టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి



అతిథి గృహం వద్ద టీఎన్జీవో నేతలు

**తిమ్మాపూర్ (మానకొండూర్):** ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ 65 శాతం ప్రకటించాలని టీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ఎస్సారెస్పీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ.. పీఆర్సీ కమిషన్ గడువు ఫిబ్రవరిలో ముగుస్తున్నందున సకాలంలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరారు. పీఆర్సీ నివేదిక సమర్పణలో జాప్యం జరిగితే మార్చిలో అన్ని ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, కోశాధికారి రాగాని శ్రీనివాస్, నాయకులు ఆర్.ప్రతాప్, మారం జగదీశ్వర్, మడిపెల్లి కాళీచరణ్, మామిడి రమేశ్, సంగెం లక్ష్మణ్‌రావు, నాగుల స్వామి, గూడ ప్రభాకర్‌రెడ్డి, రవీందర్, వొంటెల రవీందర్‌రెడ్డి, గూడ రాఘవరెడ్డి, అమరేందర్‌రెడ్డి, నాగేందర్, కిరణ్ కుమార్, రాజేష్, భరద్వాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్ల పాటు రేషన్ బియ్యం ఉచితం

### వార్డు ప్రజలకు కౌన్సిలర్ ప్రకటన

**తూప్రాన్:** మున్సిపల్ ఎన్నికల్లో విజయం అందించిన వార్డు ప్రజలకు ఐదేళ్ల పాటు ప్రతి నెలా రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తానని మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పదో వార్డు కౌన్సిలర్ చింత రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానికులకు రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వార్డు పరిధిలోని బ్రాహ్మణపల్లి, వెంకటాపూర్ (పీటీ) గ్రామస్తులకు ఐదేళ్ల పాటు ప్రతి నెలా ఇచ్చే రేషన్ బియ్యం ఖర్చులను తాను భరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డిని వంటేరు ప్రతాప్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దీపక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సహచరులపై జవాను కాల్పులు


### ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కేంద్రంలో సహచర జవాన్లపై మరో జవాను కాల్పులు జరపడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కాగా, కాల్పులకు పాల్పడిన జవాను కూడా తనను తాను కాల్చుకోవడంతో అతడి పరిస్థితి విషమంగా ఉంది. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ కథనం ప్రకారం.. బీజాపూర్‌లోని సీఏఎఫ్ క్యాంపులో దయాశంకర్ శుక్లా అనే జవాను ఆదివారం తన సర్వీస్ రివాల్వర్‌తో సహచర జవాన్లపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో రవిరంజన్ అనే జవాను మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జవాన్ల మధ్య వివాదం వల్లనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు భావిస్తున్నామని ఐజీ పేర్కొన్నారు.

## తల్లీకొడుకుల ఆత్మహత్య



ఎదిరె చిట్టెమ్మ



శ్రీరాం

**నవాబుపేట (జడ్చర్ల):** క్షణికావేశానికి గురై తల్లి, కొడుకు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం కొల్లూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎదిరె చిట్టెమ్మ (38), నర్సింహులు దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె చిన్న కిరాణా దుకాణం పెట్టుకుని ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. ప్రస్తుతం పెద్ద కుమారుడు సిద్ధార్థ డిగ్రీ, చిన్న కుమారుడు శ్రీరాం (17) ఇంటర్ చదువుతున్నారు. కాగా, బాగా చదవాలని శనివారం చిన్న కొడుకును తల్లి మందలించడంతో వారిద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఇరువురు ఆదివారం తెల్లవారుజామున పురుగు మందు తాగారు. గమనించిన పెద్ద కుమారుడు వెంటనే వారిని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.



మేడారం వద్ద జంపన్నవాగులో స్నానాలు చేస్తున్న భక్తులు

## భక్తులతో పోటెత్తిన మేడారం

ములుగు జిల్లా మేడారంలో శ్రీసమ్మక్క–సారలమ్మ మహా జాతర ప్రారంభానికి ఇంకా రెండు రోజుల సమయం ఉండగానే భక్తులు పోటెత్తారు. వనదేవతలను ముందస్తుగా దర్శించుకోవడానికి ఆదివారం తెలంగాణతో పాటు, పొరుగున ఉన్న రాష్ట్రాల నుంచి జనం లక్షల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో జంపన్నవాగు, మేడారం పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జంపన్నవాగులోకి లక్నవరం నీరు రావడంతో వాగులో, అలాగే షవర్ల కింద భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ కుటుంబ సమేతంగా వరాల తల్లులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యవతిరాథోడ్ నిలువెత్తు బంగారం (95 కేజీల బెల్లం) మొక్కు కింద చెల్లించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మేడారం జాతరలో గిరిజన సంప్రదాయ తలపాగాలను ధరించిన మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

# కేటీపీఎస్ రెండో యూనిట్ మూసివేత

- ముగిసిన 'ఏ'స్టేషన్‌లోని 60 మెగావాట్ల ప్లాంట్ ప్రస్థానం
- 53 ఏళ్ల పాటు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించిన యూనిట్

**పాల్వంచ**

కాలం చెల్లిన కేటీపీఎస్ (కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్) ఓఅండ్ఎం కర్మాగారంలో యూనిట్లు ఒక్కొక్కటిగా మూతబడుతున్నాయి. ఈ క్రమంలో 60 మెగావాట్ల సామర్థ్యం గల ఏ స్టేషన్‌లోని 2వ యూనిట్‌లో ఉత్పత్తిని శాశ్వతంగా నిలిపివేస్తూ టీఎస్ జెన్‌కో యాజమాన్యం ఆదివారం నిర్ణయం తీసుకుంది. పర్యావరణ అనుమతుల దృష్ట్యా మార్చి 31 తర్వాత ప్లాంట్ మొత్తం మూసివేయాల్సి ఉండగా సాంకేతిక కారణాల నేపథ్యంలో రెండు నెలల ముందే 2వ యూనిట్‌ను మూసివేశారు. జపాన్ టెక్నాలజీతో 1966లో ప్రారంభమైన ఈ యూనిట్ రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి సాధించి రాష్ట్రానికి వెలుగులు పంచింది. ఈ యూనిట్ మూసివేతతో అక్కడి సిబ్బందికి త్వరలో బదిలీలు అనివార్యంగా మారనున్నాయి. నూతనంగా నిర్మించిన కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో (800 మెగావాట్లు) వార్షిక మరమ్మతుల కోసం గత నవంబర్ 28న ఉత్పత్తిని నిలిపివేశారు. అందులో కీలకమైన 'టర్బైన్'లో సమస్య జటిలంగా మారడంతో తిరిగి ఉత్పత్తి ప్రారంభం కావడానికి మార్చి వరకు సమయం పట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో గత డిసెంబర్ 31న మూసేయాల్సిన కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారాన్ని మార్చి 31 వరకు నడిపించాలని నిర్ణయం తీసుకున్నారు.

**సాంకేతిక సమస్యలతో ముందస్తుగా..**

కాలం చెల్లిన ఓఅండ్ఎం కర్మాగారాన్ని మూసివేయాల్సి ఉండడంతో జెన్‌కో యాజమాన్యం ముందస్తుగా స్పేర్ పార్ట్స్ (మరమ్మతులకు అవసరమైన విడి భాగాలు) తెప్పించడాన్ని నిలిపేసింది. కాగా, 60 మెగావాట్ల 2వ యూనిట్‌లో మిల్స్ నుంచి బొగ్గును బాయిలర్‌లోకి పంపే వెజ్‌బార్, లైనర్స్, టర్బైన్ దెబ్బతినడంతో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో వచ్చే మార్చి 31 వరకు దీనిని నడిపించాలని ముందు అనుకున్నప్పటికీ భారీ ఖర్చుతో మరమ్మతు చేయడం కంటే మూసేయడమే మేలని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో బంకర్లలోని బొగ్గు మొత్తం ఉపయోగించి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉత్పత్తిని నిలిపేశారు.

**53 సంవత్సరాల 2 నెలల పాటు నిరంతరాయంగా..**

జపాన్ టెక్నాలజీతో 1966 జూలై 4న కేటీపీఎస్ 'ఏ'స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి 1వ యూనిట్ నుంచి 60 మెగావాట్ల ఉత్పత్తితో దీనిని ప్రారంభించారు. అదే ఏడాది నవంబర్ 27న 2వ యూనిట్ నుంచి 60 మెగావాట్ల ఉత్పత్తిని ప్రారంభించారు. నాటి నుంచి 2020 ఫిబ్రవరి 2వ తేదీ వరకు 53 సంవత్సరాల 2 నెలల పాటు నిరంతరాయంగా ఈ యూనిట్ ఉత్పత్తిని సాధించడం గమనార్హం.



కేటీపీఎస్‌లోని 2వ యూనిట్



కేటీపీఎస్ ప్లాంట్‌లో చెడిపోయిన టర్బైన్

**ఇప్పటికే 3, 6, 8 యూనిట్ల మూత..**

కేటీపీఎస్ ఏ, బీ, సీ స్టేషన్‌లలో కలిపి మొత్తం 8 యూనిట్ల ద్వారా 720 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో ఈఎస్పీ యంత్రంలో సమస్య కారణంగా తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లుతున్న 60 మెగావాట్ల 3వ యూనిట్‌ను 2017 మే 20న మూసివేశారు. 120 మెగావాట్ల సామర్థ్యంగల 6వ యూనిట్‌ను 2019 జనవరి 3న, మరో 120 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల 8వ యూనిట్‌లో అదే ఏడాది ఫిబ్రవరి 14న ఉత్పత్తిని నిలిపివేశారు. మొత్తంగా 300 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోగా ఇక మిగిలింది 420 మెగావాట్లు మాత్రమే. కాగా, 3, 6, 8 యూనిట్లలో పనిచేస్తున్న సుమారు 150 మంది ఉద్యోగులను ఇప్పటికే ఇతర కర్మాగారాలకు బదిలీ చేశారు.

### సాంకేతిక సమస్యతో ఉత్పత్తిని నిలిపేశాం



కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో బాయిలర్ వద్ద సాంకేతిక సమస్య ఏర్పడటంతో 2వ యూనిట్‌లో ఉత్పత్తిని నిలిపివేశాం. మార్చితో కర్మాగారంలోని అన్ని యూనిట్లను మూసేస్తామనే ఉద్దేశంతో స్పేర్‌పార్ట్స్ కూడా తెప్పించలేదు. మరమ్మతులకు అధిక మొత్తంలో ఖర్చు చేయడం కంటే మూసేయడమే సంస్థకు మేలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాం.

*బి.లక్ష్మయ్య, జెన్‌కో డైరెక్టర్ (థర్మల్)*



బస్సులో సందడి చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

## డ్రైవర్‌గా ఎమ్మెల్యే.. కండక్టర్‌గా ఎంపీ

### మేడారానికి బస్సులు ప్రారంభించిన శంకర్‌నాయక్, మాలోతు కవిత

**మహబూబాబాద్ అర్బన్ :** మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ ఆర్టీసీ డ్రైవర్ అవతారమెత్తారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కలసి మేడా రం శ్రీసమ్మక్క–సారలమ్మ జాతరకు బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్‌నాయక్ బస్సును బస్టాండ్ ఆవరణలో కొద్దిదూరం నడిపారు. ఎంపీ మాలోతు కవిత టికెట్లు ఇచ్చి ప్రయాణికులను ఉత్సాహపరిచారు. మేడారానికి వెళ్లే ప్రతీ భక్తుడు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సురక్షితంగా అమ్మవార్లను దర్శించుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# మార్క్‌ఫెడ్ 'ఔట్'!


▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర స్థాయిలో రైతు సమన్వయ సమితులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం లక్షలన్నర మందికిపైగా కిందినుంచి పైస్థాయి వరకు సభ్యులున్నారు. దానికి చైర్మన్‌గా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సర్కారు నియమించిన సంగతి తెలిసిందే. అంతకుముందు దానికి గుత్తా సుఖేందర్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారు. రైతు దుక్కి దున్ని పంట పండించి, మార్కెట్‌కు తీసుకెళ్లేంత వరకు కూడా సమితి సభ్యులు అండగా ఉండాలనేది సర్కారు ఉద్దేశం. రైతుబంధు నిధులు అందేలా సాయం చేయడం, బ్యాంకుల్లో పంట రుణాలు ఇప్పించేలా కృషి చేయడం, పంట పండించాక దాన్ని మద్దతు ధరకు విక్రయించేలా ఏర్పాట్లు చేయడం, దేశంలో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో మంచి ధరలున్నాయో గుర్తించి అక్కడికి పంట ఉత్పత్తులు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవడం వంటి అనేక కీలకమైన బాధ్యతలు సమన్వయ సమితి చేయాలనేది సర్కారు లక్ష్యం. అంతేకాదు ఎరువులు, విత్తనాలు



సకాలంలో రైతులకు అందించేలా చేయడం, నాసిరకం విత్తనాలు అమ్మకుండా అడ్డుకోవడం, పంట పండించాక మార్కెట్లో ఇబ్బందులు తలెత్తకుండా సమితి సభ్యులు కృషి చేయాలని కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ వారికి అప్పట్లో దిశానిర్దేశం చేశారు. అయితే రైతు సమన్వయ సమితికి ఇవన్నీ చేసే పరిపాలనా విభాగం లేదు. అధికారులు, ఉద్యోగులు, ఇతరత్రా వ్యవస్థ ఏర్పాటు కాలేదు. కేవలం చైర్మన్లు, సభ్యులు మాత్రమే ఉన్నారు. దీనికి ఎటువంటి అధికారాలు, పరిపాలనా యంత్రాంగం, చెక్ పవర్ వంటివేవీ లేవు. ఈ పరిస్థితిని మార్చాలనేది సర్కారు ఉద్దేశం. ఇటు రైతు సమన్వయ సమితి లక్ష్యాలు ఏవైతే ఉన్నాయో, ఆ ప్రకారమే మార్క్‌ఫెడ్ రైతులకు యూరియా, ఇతర ఎరువులను సరఫరా చేస్తుంది. పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంది. కాబట్టి మార్క్‌ఫెడ్‌ను విలీనం చేస్తే, ఆ పరిపాలనా యంత్రాంగం మొత్తం రైతు సమితిలోకి వచ్చి పరిపుష్టిగా ఉంటుందనేది ఆ ఇద్దరు కీలక ప్రజాప్రతినిధులు భావించినట్లు సమాచారం. మార్క్‌ఫెడ్‌లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 150 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో పటిష్టమైన యంత్రాంగం, విభాగం ఉంది. దానికి చైర్మన్, ఎండీ, జనరల్ మేనేజర్ కూడా ఉన్నారు. కానీ దాన్ని సక్రమంగా నడిపించడం లేదన్న ఆరోపణలున్నాయి. రైతు సమన్వయ సమితిలో మార్క్‌ఫెడ్ విలీనంపై వివరణ ఇవ్వడానికి అటు అధికారులు, ఇటు సంబంధిత ప్రజాప్రతినిధులు సుముఖంగా లేరు.

## తుది దశకు ప్రహ్లాద చరిత్ర ఘట్టాల బిగింపు



**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన ప్రహ్లాద చరిత్ర ఘట్టాల పనులు తుది దశకు చేరాయి. గర్భాలయ మహామండపం పైభాగంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రహ్లాదుడి చరిత్ర ఘట్టాలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ వైటీడీఏ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శిల్పులు డిసెంబర్ 21న ప్రహ్లాద ఘట్టాల పనులను ప్రారంభించారు. బంగారు వర్ణంతో కూడిన పంచలోహాలతో పది ఘట్టాల ప్యానల్స్ పనులు చివరి దశకు చేరాయి. మరో 2 రోజుల్లో ఈ పనులు పూర్తి కానున్నట్లు అధికారులు తెలిపారు.

## నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వారు, మేడారం జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణమైన భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. 20 వేలకు పైగా భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ధర్మ దర్శనానికి సుమారు గంటన్నర సమయం పట్టిందని భక్తులు పేర్కొన్నారు. భక్తుల ద్వారా స్వామి వారికి రూ.17.46 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

**శ్రీరాముడిగా, వైకుంఠనాథుడిగా..**

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న పాతగుట్ట ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం ఉదయం శ్రీరాముడిగా, రాత్రి వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార సేవలను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు.



# తహసీల్దార్‌కు రైతుల జేజేలు

### ఒకే దఫాలో 1,548 పట్టా పుస్తకాల పంపిణీకి కృషి

- భుజాలపై ఎత్తుకుని ఊరేగించిన రైతులు
- భావోద్వేగానికి లోనైన తహసీల్దార్ రంజిత్‌కుమార్

**మహబూబాబాద్ రూరల్:** 70 ఏళ్లుగా పట్టాలు లేని భూములకు ఒకే దఫాలో 1,548 పట్టా పుస్తకాల పంపిణీకి కృషి చేయడంతో రైతులు తహసీల్దార్‌ను భుజా లపై ఎత్తుకుని ఊరేగించిన ఘటన మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో 70 ఏళ్ల క్రితం కొందరు వ్యక్తులు తమ భూములను రైతు లకు దానంగా ఇచ్చారు. మరికొందరు రైతు లు కొనుగోలు చేశారు. అయితే ఆ భూము లకు పట్టాదారు పుస్తకాలు రాలేదు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టా పుస్తకాలు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తహసీల్దార్ ముత్తినేని రంజిత్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ఒకే దఫాలో 1,548 పట్టా పుస్తకాలు పంపిణీకి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టా పుస్తకాలను పంపిణీ చేసేందుకు గ్రామానికి వచ్చిన తహసీల్దార్‌కు రైతులు ఘనస్వాగతం పలికారు. భుజాలపై ఎత్తుకుని పూలు చల్లుతూ ఊరేగింపుగా తీసుకువచ్చారు. రైతులు చూపించిన అభిమానంతో తహసీల్దార్ భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'రైతులందరికీ పట్టా పుస్తకాలు ఇవ్వడం భగవంతుడు నాకు కల్పించిన అదృష్టం. రైతుల్లో చూస్తున్న ఈ ఆనందాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న సమయంలో గ్రామానికి వచ్చినప్పుడు రైతులు పడిన బాధ చూశాను. పట్టా పుస్తకాలు ఇప్పించాకే వెళ్తానని వారికి చెప్పాను. ఇప్పుడు మాట నిలబెట్టుకున్నాను' అని అన్నారు.



మల్యాలలో తహసీల్దార్ రంజిత్‌కుమార్‌ను ఊరేగిస్తూ తీసుకెళ్తున్న రైతులు, గ్రామస్తులు

## దైవ దర్శనానికి వచ్చి భక్తురాలి మృతి

**వేములవాడ అర్బన్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లె వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భూపాలపల్లి జిల్లా పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన కోయడ సారమ్మ (65) మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. సారమ్మ కుటుంబసభ్యులతో కలసి ఆటోలో రాజన్న దర్శనం చేసుకునేందుకు వేములవాడకు వచ్చింది. దర్శనం అనంతరం రాత్రి అందరూ కలసి తిరుగు ప్రయాణమయ్యారు. కాగా, వేములవాడ మండలం ఆరెపల్లె శివారులోని కరీంనగర్, సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన కొద్దిసేపు సేదదీరేందుకు ఆటో ఆపారు. ఈ సమయంలో సారమ్మ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సారమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. వేములవాడ పట్టణ సీఐ శ్రీధర్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# గల్లీల్లో ఢిల్లీ ప్రచారం

ఢిల్లీలో ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. బీజేపీ, ఆప్ ప్రచార పర్వంలో దూసుకు పోతూ ఉంటే, కాంగ్రెస్ పూర్తిగా వెనుకబడి పోయింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మీ ఇంటి పెద్ద కొడుకునంటూ కుటుంబ సెంటిమెంట్‌ను రగిలిస్తున్నారు. ప్రభుత్వ పథకాల్ని వివరించడానికి మీ ఇంటికొస్తానంటూ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా బీజేపీ ప్రచారానికి అన్నీ తానై తన భుజస్కంధాలపై మోస్తున్నారు. వీరిద్దరూ ఓటర్లతో వ్యక్తిగతంగా కనెక్ట్ అవడానికిప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు, కొత్త ముఖాలు పార్టీ ప్రచారానికి ఊపు అందించ లేకపోతున్నాయి.

- న్యూఢిల్లీ

- మీ ఇంటికొస్తానంటున్న కేజ్రీవాల్
- ఓటర్లతో అమిత్ షా భావోద్వేగ బంధం
- చతికిలపడిపోతున్న కాంగ్రెస్

రాజధాని రణరంగం

## కేజ్రీవాల్ ఫ్యామిలీ సెంటిమెంట్



రోడ్‌షోలో పాల్గొన్న కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రాముడు మంచి బాలుడు టైప్. ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థిగా ఉన్నప్పుడు, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసినప్పుడు, ముఖ్యమంత్రి హోదాలో కూడా ప్రజలతో మంచి సీఎం అనిపించుకోవాలన్న తపనతోనే ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో వివాదాస్పద అంశాలపై పెదవి విప్పకుండా ఓటర్లతో నేరుగా అనుసంధానమయ్యేలా వ్యూహాలు రచిస్తున్నారు. ఢిల్లీ కుటుంబాలకు పెద్ద కొడుకునంటూ ఫ్యామిలీ సెంటిమెంట్‌ని రగిలిస్తున్నారు. 'నేనే మీ ఇంటి పెద్ద కొడుకుని. అందుకే మీ వాటర్ బిల్లు, కరెంట్ బిల్లు, అనారోగ్యం వస్తే ఆస్పత్రికి తీసుకువెళ్లడం, వృద్ధులైతే తీర్థయాత్రలకి వెళ్లడం వంటివన్నీ నేనే చూసుకుంటున్నాను' అంటూ తమ ఉచిత పథకాలకు మైలేజ్ వచ్చేలా ప్రచారాన్ని ఉరకలెత్తిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పట్టు పెంచుకోవడానికి 'ఆప్‌కా కేజ్రీవాల్ ఆప్ కే ద్వార్' అన్న వ్యూహంతో ముందుకు వెళుతున్నారు. ఇందుకోసం welcomekejriwal.in అన్న వెబ్‌సైట్ ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్‌లోకి వెళితే కేజ్రీవాల్ ఇంటి డోర్ బెల్ మోగిస్తున్న వీడియో ప్రత్యక్షమవుతుంది. లేదంటే 7690944444కు మిస్డ్ కాల్ ఇచ్చినా కేజ్రీవాల్ వాళ్ల ఇంటికి వెళ్లి అయిదేళ్లలో ఆప్ సర్కార్ ఏం చేస్తుందో స్వయంగా వివరిస్తారు.

## బీజేపీ ప్రచారానికి ఫేస్ షా

ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విస్తృతంగా ప్రచార బాధ్యతనుమోస్తే, అమిత్ షా తెరవెనుక వ్యూహాలు రచిస్తూ ఆయనకు కుడిభుజంగానే పనిచేసేవారు. కానీ, ఈసారి అమిత్ షా ఢిల్లీ ఎన్నికల బాధ్యతను పూర్తిగా తన చేతుల్లోకి తీసుకున్నారు. ప్రచారానికి ఫేస్‌గా మారారు. పెద్ద పెద్ద సభలకు బదులుగా చిన్న చిన్న ర్యాలీలు నిర్వహిస్తూ ఢిల్లీని చుట్టేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఓటర్లతో వ్యక్తిగత బాంధవ్యం ఏర్పడేలా ముందుకు వెళుతున్నారు. చిన్న గల్లీల్లో జరిగే సభల్లో పాల్గొంటూ, ట్వీట్లు చేస్తూ, బీజేపీ సైబర్ వారియర్లతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ ప్రచార పర్వాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ప్రతీరోజూ రెండు, మూడు సభలు, ఒక రోడ్ షోలో షా పాల్గొంటున్నారు. 5 వేల నుంచి 50 వేల మంది వరకు వచ్చే సభల్లో మాత్రమే పాల్గొని జాతీయ భావమే ప్రధాన ఎజెండాగా చేసుకున్నారు. సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలే ప్రధాన అస్త్రంగా చేసుకొని బీజేపీ కేడర్‌లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.



మెహ్రామ్‌నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతున్న అమిత్ షా

## కాంగ్రెస్‌లో స్తబ్దత

ఢిల్లీ ఎన్నికలకు మరో వారం రోజులు కూడా గడువు లేదు. కాంగ్రెస్‌లో ఇంకా స్తబ్దత వీడలేదు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్ చోప్రా, ప్రచార కమిటీ చైర్మన్ కీర్తి ఆజాద్ మధ్య విభేదాలు పార్టీ ప్రచారంపై ప్రభావం చూపిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఎక్కువ మంది కొత్తవారే కావడంతో ప్రచారానికి ఇప్పటివరకు ఒక ఊపు రాలేదు. పార్టీ స్టార్ క్యాంపెయినర్లు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక 4,5 తేదీల్లో రోడ్ షోలు నిర్వహించే అవకాశం ఉంది. కాంగ్రెస్‌లో నెలకొన్న ఒకరకమైన నిర్వే దం ఆప్‌కి లాభించనుందనే వాదనలున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ఆప్ పూర్తిగా కొల్లగొట్టేసింది. తన ఓటు బ్యాంకు కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ పెద్దగా ప్రయత్నాలు చేయకపోవడంతో ఈ మూడు స్తంభాలాటలో ఆప్‌ది పై చేయిగా నిలిచే అవకాశాలున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## తులిప్ తుళ్లింత...



ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ ఆవరణలో ఉన్న మొఘల్ గార్డెన్స్‌లో ఆడుకుంటున్న చిన్నారులు. తులిప్ పుష్పాల అందాలకు పేరుగాంచిన ఈ గార్డెన్స్‌ను ప్రజల సందర్శనార్థం ఈ నెల 5వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు తెరిచి ఉంచనున్నారు.

# నిరుద్యోగ భృతి, క్యాష్‌బ్యాక్

### ఢిల్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేసింది. పార్టీ అధికారంలోకి వస్తే యువ స్వాభిమాన్ యోజన కింద నిరుద్యోగులకు నెలకు రూ. 5,000–7,500 వరకు నిరుద్యోగ భృతి ఇస్తామంది. కరెంటు, నీటిని ఆదా చేసే వినియోగదారులకు క్యాష్‌బ్యాక్ పథకాలు అమలు చేస్తామంది. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని ప్రకటించింది. బడ్జెట్‌లో 25 శాతం నిధులను కాలుష్యంపై పోరాటానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడానికి కేటాయిస్తామని, 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందజేస్తామని తెలిపింది. 100 ఇందిరా క్యాంటీన్లను ఏర్పాటు చేసి రూ.15 కే భోజనం అందిస్తామని వెల్లడించింది. ఈ మేరకు 'ఐసీ హోగీ హమారీ ఢిల్లీ' పేరిట కాంగ్రెస్ నాయకులు తమ మేనిఫెస్టోను పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు.

## క్లుప్తంగా...



బంధువులను కోల్పోయి రోదిస్తున్న మహిళ

### చర్చిలో తొక్కిసలాట.. 20 మంది మృతి

**దారెస్సలామ్:** టాంజానియాలోని ఓ చర్చిలో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 20 మంది మృతిచెందగా, మరో 16 మంది గాయపడ్డారు. టాంజానియాలో ప్రముఖ పాస్టర్ బోనిఫేస్ వాంపోసా ఆధ్వర్యంలో శనివారం రాత్రి భారీ బహిరంగ సభ జరిగింది. అందులో ఆయన ప్రార్థించిన నూనెను వేదిక ఎదుట పోశారు. భక్తులు ముందుకొచ్చి నూనెను తాకాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. అది తాకితే రోగాల నుంచి విముక్తి పొందుతామని భావించిన భక్తులు ఒక్కసారిగా ముందుకు రావడం తొక్కిసలాటకు దారితీసింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఘటనకు కారణమైన పాస్టర్‌తోపాటు మరో ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### సోనియాకు అస్వస్థత

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరారు. ఆదివారం ఉదయం ఆమె ఢిల్లీలోని సర్ గంగా రామ్ ఆస్పత్రిలో చేరినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఆస్పత్రిలో ఆమెతో పాటు కొడుకు రాహుల్ గాంధీ, కూతురు ప్రియాంక గాంధీ కూడా ఉన్నట్లు చెప్పాయి.

### మహారాష్ట్రలో నో ఎన్నార్సీ



**సాక్షి ముంబై:** దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)ను మహారాష్ట్రలో అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే స్పష్టంచేశారు. అయితే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు మాత్రం అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. శివసేన పత్రిక 'సామ్నా'కిచ్చిన ఇంటర్వ్యూలో.. ఎన్నార్సీ, సీఏఏలపై అడిగిన ప్రశ్నలకు ఉద్ధవ్ సమాధానమిచ్చారు. ఎన్నార్సీని రాష్ట్రంలో అమలు చేయబోమన్నారు. సీఏఏతో దేశంలోని పౌరులకు ఎలాంటి ఇబ్బందిలేదన్నారు. మరోవైపు ఎన్నార్సీ వల్ల హిందువులు, ముస్లింలకు తమ పౌరసత్వం నిరూపించుకోవడం ఇబ్బందికరంగా మారనుందని, అందుకే దాన్ని రాష్ట్రంలో అనుమతించబోమని చెప్పారు.

### లక్నోలో కాల్పులు.. 'హిందూ' నేత మృతి

**లక్నో:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి జరిపిన కాల్పుల్లో విశ్వ హిందూ మహాసభ స్థాపకుడు మృతి చెందారు. అత్యంత భద్రత ఉండే శాసనసభ సముదాయ ప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రంజిత్ బచ్చన్(40), తన బంధువు ఆదిత్య శ్రీవాస్తవతో కలిసి ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో గ్లోబ్ పార్క్ సమీపంలో నడకసాగిస్తున్నారు. శాలువా కప్పుకుని వచ్చిన ఒక అపరిచితుడు తుపాకీ వారిపైకి కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో రంజిత్ అక్కడికక్కడే చనిపోగా ఆదిత్య చేతికి గాయమయింది. దీనిపై పోలీసులెవరూ వెంటనే స్పందించలేదని గుర్తించిన కమిషనర్ సుజిత్ పాండే.. ఎస్సై సహా నలుగురు సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేశారు.

# ఇంకా సమయం ఇవ్వొద్దు!


- వారు న్యాయవ్యవస్థతో ఆడుకుంటున్నారు
- నిర్భయ దోషులకు ఉరిశిక్ష అమలు చేయడంపై ఢిల్లీ హైకోర్టులో కేంద్రం
- హైదరాబాద్ 'దిశ' ఘటన ప్రస్తావన





**న్యూఢిల్లీ:** 'నిర్భయ'పై పాశవికంగా హత్యాచారం జరిపిన దోషులకు వెంటనే ఉరిశిక్ష విధించాలని కేంద్రం కోరింది. వారికి ఇంక ఎంతమాత్రం సమయం ఇవ్వడం సరికాదని, అందుకు వారు అర్హులు కారని స్పష్టం చేసింది. నిర్భయ హత్యాచారం కేసు దోషుల ఉరిశిక్ష అమలుపై విధించిన స్టేను సవాలు చేస్తూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు ముందు ఆదివారం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా, గత సంవత్సరం డిసెంబర్‌లో హైదరాబాద్‌లో చోటు చేసుకున్న 'దిశ' సామూహిక అత్యాచారం, హత్య ఘటనను ఆయన ప్రస్తావించారు. ఆ నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారని, ఆ ఎన్‌కౌంటర్ షాకింగ్ ఘటనే అయినా, ప్రజలు సంబరాలు చేసుకున్నారని గుర్తు చేశారు. 'ఆ ఘటన తీవ్రమైన తప్పుడు అభిప్రాయాన్ని ఏర్పరిచింది. న్యాయవ్యవస్థ విశ్వసనీయత, సొంత తీర్పును అమలు చేసే అధికారం ప్రశ్నార్థకంగా మారాయి' అని మెహతా వ్యాఖ్యానించారు. ఉరిశిక్ష పదేపదే వాయిదా పడేలా నిర్భయ దోషులు వ్యవహరిస్తున్న తీరు దేశ ప్రజల ఓపికను పరీక్షిస్తోందని ఆయన పేర్కొన్నారు. 'ఆ నలుగురు దోషులు ఉద్దేశపూర్వకంగా, ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తూ చట్టం ఇచ్చిన తీర్పును అవహేళన చేస్తున్నారు' అన్నారు. పవన్ గుప్తా ఇన్నాళ్లు క్యురేటివ్ పిటిషన్ కానీ, క్షమాభిక్ష పిటిషన్ కానీ దాఖలు చేయకపోవడం ఈ ఉద్దేశపూర్వక ప్రణాళికలో భాగమేనన్నారు. సాధ్యమైన అన్ని మార్గాలను ఉపయోగించుకుని ఉరి శిక్ష అమలును వాయిదా వేయడం లక్ష్యంగా వారు ప్రయత్నిస్తున్నారన్నారు. న్యాయవ్యవస్థతో ఆ దోషులు ఆడుకుంటున్నారని మెహతా ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులు అక్షయ్ సింగ్, వినయ్ శర్మ, పవన్ గుప్తాల తరఫున న్యాయవాది ఏపీ సింగ్, మరో దోషి ముకేశ్ కుమార్ తరఫున న్యాయవాది రెబెకా జాన్ వాదనలు వినిపించారు. ఉరిశిక్ష అమలుపై స్టే విధించడాన్ని కేంద్రం సవాలు చేయకూడదని రెబెకా అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రయల్ కోర్టులో జరిగిన ఈ కేసు విచారణలో కేంద్రం ఎన్నడూ భాగస్వామి కాలేదన్నారు. ఉరిశిక్ష అమలు జరిగేలా డెత్ వారెంట్లను జారీ చేయాలని ట్రయల్ కోర్టును ఆశ్రయించింది బాధితురాలి తల్లిదండ్రులే కానీ కేంద్రం కాదని ఆమె కోర్టుకు గుర్తు చేశారు. దోషులను ఒకే రోజు కాకుండా, వేర్వేరు రోజుల్లో ఉరి తీసే అవకాశంపై స్పష్టత ఇవ్వాల్సిందిగా కేంద్రం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్న విషయాన్ని హైకోర్టుకు రెబెకా తెలిపారు. అంతేకాకుండా, ఒకే తీర్పు ద్వారా ఆ నలుగురు దోషులకు ఉరి శిక్ష పడినందువల్ల.. వారిని వేర్వేరు రోజుల్లో ఉరి తీయడం చట్టబద్ధంగా సమ్మతం కాదన్నారు. 'నేనొక దుర్మార్గుడిని. దారుణ నేరానికి పాల్పడ్డాను. ఉరి ప్రక్రియను ఆలస్యం చేస్తున్నాను. ఇవన్నీ నేను ఒప్పుకుంటున్నాను. అయినా, ఆర్టికల్ 21 కింద జీవించే హక్కును కోరుకునే హక్కు నాకుంది' అని దోషుల తరఫున రెబెకా వాదించారు. చట్టబద్ధంగా తమకున్న అన్ని అవకాశాలను ఉపయోగించుకునే హక్కు దోషులకు ఉందని తేల్చిచెప్పారు. దాదాపు 3 గంటలకు పైగా సాగిన వాదనల అనంతరం.. తీర్పును రిజర్వ్‌లో ఉంచుతూ న్యాయమూర్తి సురేశ్ కాయిట్ నిర్ణయం తీసుకున్నారు. నలుగురు దోషుల్లో ముకేశ్, వినయ్‌ల క్షమాభిక్ష పిటిషన్‌లను రాష్ట్రపతి తిరస్కరించారు. అక్షయ్ సింగ్ శనివారం క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకున్నారు. అది పెండింగ్‌లో ఉంది. పవన్ ఇంకా క్షమాభిక్ష కోసం రాష్ట్రపతిని ఆశ్రయించలేదు.

## షెంగన్ వీసా రుసుం పెంచిన ఈయూ





**న్యూఢిల్లీ:** యూరప్‌లోని 26 దేశాల్లో పర్యటించడానికి అవసరమయ్యే షెంగన్ వీసా ఫీజును యూరోపియన్ యూనియన్ (ఈయూ) పెంచింది. ఇన్నాళ్లూ 60 యూరోలుగా (సుమారు రూ.4,750) ఉన్న ఫీజును 80 యూరోలకు (రూ.6,350) పెంచినట్టు ఈయూ ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం నుంచి ఈ కొత్త ఫీజులు అమల్లోకి వచ్చాయి. ఆస్ట్రియా, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, స్విట్జర్లాండ్, స్పెయిన్ వంటి దేశాల పర్యటనకు షెంగన్ వీసా అవసరం. ఆర్థిక మాంద్యం కారణంగానే వీసా ఫీజుల్ని పెంచాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. వీసా ఫీజు పెంపుతో ఆయా దేశాలు వీసా ప్రక్రియను మరింత వేగవంతంగా, సులభంగా జారీ చేయడానికి అవసరమయ్యే సదుపాయాలు కల్పిస్తాయని వెల్లడించారు. యూరప్ పర్యాటకులు ఇప్పుడు ఆరు నెలల ముందుగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 2018లో షెంగన్ వీసా కోసం అత్యధిక దరఖాస్తులు వచ్చిన దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది.

## తొలిసారి అంటార్కిటిక్ త్వైట్స్ చిత్రాలు




**న్యూయార్క్:** సముద్రాల నీటి మట్టం పెరగడానికి ముఖ్యకారణమైన అంటార్కిటిక్ ఖండంలోని త్వైట్స్ అనే మంచు కొండకు సంబంధించిన చిత్రాలను శాస్త్రవేత్తలు తొలిసారి బంధించారు. అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు రోబోటిక్ సబ్‌మెరైన్ సాయంతో చిత్రాలను తీశారు. వీటి సాయంతో త్వైట్స్ కదలికలను క్షుణ్నంగా పరిశీలించే అవకాశం లభించనుంది. త్వైట్స్ కారణంగా భూమిపై సముద్రాల నీటి మట్టం 4 శాతం మేర పెరుగుతుంది. దీని కదలికల్లో చోటుచేసుకునే చిన్న పరిణామాల వల్ల కూడా సముద్ర నీటి మట్టాలు 25 అంగుళాల మేర పెరిగే అవకాశం ఉంది. గత 30 ఏళ్లలో త్వైట్స్ నుంచి సముద్రాల్లోకి ప్రవహించే మంచు శాతం రెట్టింపైనట్టు పరిశోధకులు వెల్లడించారు. ఇప్పటికే సముద్రాల్లోకి చేరుతున్న గ్రీన్‌ల్యాండ్‌లోని మంచు అత్యంత ప్రమాదకర స్థాయిల్లోకి వెళ్లిందని, తాజాగా అంటార్కిటికాలోని మంచు కూడా ఇప్పుడిప్పుడే సముద్రాల్లోకి చేరుతోందని తెలిపారు. భూమిపై అతిపెద్ద మంచు పలకం అయిన దీని వల్ల రానున్న వందేళ్లలో సముద్రాల నీటి మట్టాలు పెరగడానికి ప్రధాన కారణమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

## ఆగ్నేయ ఢిల్లీ డీసీపీని తొలగించిన ఈసీ

**న్యూఢిల్లీ:** షహీన్‌బాగ్, జామియా నగర్‌లో గత వారం చోటు చేసుకున్న కాల్పుల ఘటనల నేపథ్యంలో ఆగ్నేయ ఢిల్లీ డీసీపీని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తొలగించింది. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన చిన్మోయ్ బిశ్వాల్ స్థానంలో అత్యంత సీనియర్ అదనపు డీసీపీ కుమార్ గ్యానేశ్‌ను ఆగ్నేయ ఢిల్లీ డీసీపీగా నియమిస్తున్నట్లు చెప్పింది. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపింది. దీనికి సంబంధించిన నివేదికలను హోంశాఖకు పంపాల్సిందిగా ఆదేశించింది.

## 6న కర్ణాటక కేబినెట్ విస్తరణ



**బెంగళూరు:** కర్ణాటక మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారయింది. కేబినెట్‌ను ఈనెల 6వ తేదీన విస్తరించనున్నట్లు ముఖ్యమంత్రి యడియూరప్ప ప్రకటించారు. 'ఈ నెల 6న ఉదయం 10.30 గంటలకు రాజ్‌భవన్‌లో 13 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేస్తారు'అని ఆదివారం సీఎం వెల్లడించారు. వీరిలో కాంగ్రెస్, జేడీఎస్ తదితర పార్టీల నుంచి బీజేపీలో చేరిన 10 మంది ఉన్నారని తెలిపారు. అన్ని ప్రాంతాలకు, కులాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించనున్నట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం లింగాయత్‌లు 8 మంది, ఒక్కలిగలు ముగ్గురు, ఎస్సీలు ముగ్గురు, ఇద్దరు ఓబీసీలు, బ్రాహ్మణ, ఎస్టీల నుంచి ఒక్కరు చొప్పున కేబినెట్‌లో ప్రాతినిధ్యం ఉంది. మంత్రివర్గం పరిమితి 34 మంది కాగా, ముఖ్యమంత్రి సహా ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 18 మంది మంత్రులున్నారు. ఆరు నెలల క్రితం అధికారపగ్గాలు చేపట్టిన యడియూరప్ప కేబినెట్ విస్తరణపై రెండు నెలలుగా కసరత్తు చేస్తున్నారు. ఎట్టకేలకు జనవరి 31వ తేదీన బీజేపీ అధిష్టానం ముఖ్యమంత్రి ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది.

## డీఎంకేకు ప్రశాంత్ కిశోర్ సేవలు

**చెన్నై:** ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సేవలను వినియోగించుకుంటున్న రాజకీయ పార్టీల్లో తాజాగా డీఎంకే కూడా చేరింది. తమిళనాడులో 2021లో జరిగే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రశాంత్ కిశోర్‌కు చెందిన సంస్థ 'ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ(ఐప్యాక్)' సహాయం తీసుకోనున్నామని ఆదివారం డీఎంకే అధినేత స్టాలిన్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. స్టాలిన్ ట్వీట్‌పై ఐప్యాక్ కృతజ్ఞతలు తెలిపింది. '2021లో విజయమే లక్ష్యంగా తమిళనాడులో డీఎంకేతో కలిసి పనిచేసేందుకు ఉత్సుకతతో ఉన్నాం' అని ట్వీట్ చేసింది. గత పదేళ్లుగా విపక్షంలో ఉంటున్న డీఎంకే.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా అన్నాడీఎంకే నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని భావిస్తోంది. సినీ నటుడు కమల్‌హాసన్ పార్టీ 'మక్కల్ నీది మయ్యం' కూడా ప్రశాంత్ కిశోర్ వ్యూహాలను వాడుకోనుందని కొంత కాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. గత సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికలను డీఎంకే దాదాపు స్వీప్ చేసింది. మొత్తం 39 లోక్‌సభ స్థానాల్లో 38 సీట్లను డీఎంకే గెలుచుకుంది. 2019లో జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం రెండు అసెంబ్లీ స్థానాలను అన్నాడీఎంకే గెల్చుకుంది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం కోసం, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కోసం ప్రశాంత్ కిశోర్ సంస్థ ఐప్యాక్ పనిచేస్తున్న విషయం తెలిసిందే.



స్టాలిన్



ప్రశాంత్ కిశోర్

# కరోనా డేంజర్ బెల్స్

- చైనాలో 300 దాటిన వైరస్ మృతులు
- భారత్‌లో రెండో కేసు నమోదు
- ఫిలిప్పీన్స్‌లో తొలి మరణం

**బీజింగ్ /న్యూఢిల్లీ:** చైనాలోని వుహాన్‌లో బట్టబయలైన కరోనా వైరస్ ప్రపంచ దేశాలకు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. చైనాలో రోజురోజుకి వ్యాధిగ్రస్తులు పెరిగిపోతూ ఉంటే, చైనా వెలుపల ఫిలిప్పీన్స్‌లో తొలి మరణం సంభవించింది. ఇక భారత్‌లోని కేరళలో రెండో కరోనా కేసు నమోదు కావడం డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఇప్పటివరకు కరోనా వైరస్‌తో 305 మంది మరణిస్తే, 15వేల మంది వరకు ఈ వైరస్ సోకింది. 25 దేశాలకు విస్తరించింది. వుహాన్ నుంచి ఫిలిప్పీన్స్‌కి వచ్చిన 44 ఏళ్ల చైనీయుడు ఈ వైరస్ కారణంగా మృతి చెందినట్టు ఫిలిప్పీన్స్ ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి చైనా పలు చర్యలు చేపట్టింది. కరోనా వ్యాధితో మృతి చెందిన వారికి అంతిమ యాత్రలపై నిషేధం విధించింది. శవాలను పూడ్చిపెట్టకుండా, వారు మృతి చెందిన ప్రాంతానికి సమీపంలో ఉన్న శ్మశాన వాటికల్లో దహనం చేయాలని చైనా నేషనల్ హెల్త్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.



వుహాన్ నుంచి ఎయిరిండియా విమానంలో ఆదివారం ఢిల్లీకి చేరుకున్న భారతీయులు

**కేరళలో రెండో కరోనా కేసు**

మన దేశంలోని కేరళలో మరో కరోనా కేసు నమోదైంది. ఇటీవల చైనా నుంచి వచ్చిన విద్యార్థికి కరోనా వైరస్ సోకినట్టు అధికారులు వెల్లడించారు. అయితే పుణేలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) నుంచి వచ్చే నివేదిక కోసం ఎదురు చూస్తున్నారు. వుహాన్ యూనివర్సిటీ నుంచి కేరళకు వచ్చిన ఆ విద్యార్థికి కరోనా వైరస్ సోకినట్టు అనుమానం రావడంతో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ఆ విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆరోగ్య శాఖ మంత్రి కె.కె. శైలజ వెల్లడించారు. మరోవైపు వుహాన్ నుంచి మరో 323 మంది భారతీయులు, ఏడుగురు మాల్దీవుల వాసుల్ని భారత్‌కు తీసుకువచ్చారు. వీరిని ఆర్మీ, ఐటీబీపీ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆసుపత్రుల్లో ఉంచి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.


**చైనాలో బర్డ్ ఫ్లూ భయం**

కరోనా వైరస్‌తోనే నానాయాతన పడుతున్న చైనాలో హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ వ్యాధి బయల్పడింది. హుబాయ్ ప్రావిన్స్‌కు దక్షిణ సరిహద్దుల్లో హువాన్ ప్రావిన్స్‌లో ఈ వ్యాధి బయటకి వచ్చింది. షోయాంగ్ నగరంలోని పౌల్ట్రీలో ఈ వైరస్ బయటపడినట్టు చైనా వ్యవసాయం, గ్రామీణ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అక్కడ 7,850 కోళ్లు ఉంటే, 4,500 కోళ్లు ఈ వ్యాధితో చనిపోయాయి. మరో 17,828 కోళ్లను వ్యవసాయాధికారులే చంపేశారు. ఇప్పటికింకా మనుషులకు ఈ వ్యాధి సోకలేదు.

### చైనా ప్రయాణికులకు భారత్ ఇ-వీసా రద్దు

చైనా నుంచి వచ్చే ప్రయాణికులు, ఆ దేశంలోని ఇతర దేశస్తులకు ఇ–వీసా సౌకర్యాన్ని భారత్ తాత్కాలికంగా రద్దు చేసింది. ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీజింగ్‌లో భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. ఇక అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలు చైనా మీదుగా ప్రయాణించే వారిని కూడా తమ దేశంలోకి రానివ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు.

సాక్షి
సాహిత్యం
నల్లగొండ | సోమవారం
ఫిబ్రవరి | 3 | 2020
sakshisahityam@gmail.com




## ఈవారం పుస్తకాలు

### మహాత్మాగాంధీ ముస్లిం సహచరులు - అనుచరులు
రచన: సయ్యద్ నశీర్ అహమ్మద్ ; పేజీలు: 32 ; వెల: 25 ; ప్రతులకు: ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, ఫ్లాట్ నం. సి-2, శ్రీరామ్స్ ఆర్కేడ్, ఉండవల్లి-522501. ఫోన్: 9440241727

### తెలుగునాట నాల్కలపై నడయాడిన నాటక పద్యాలు
కూర్పు: విహారి ; పేజీలు: 54 ; వెల: 50 ; ప్రతులకు: యువభారతి, తెలంగాణ సారస్వత పరిషత్ భవనం, తిలక్ రోడ్, హైదరాబాద్-500001. కూర్పరి ఫోన్: 9848025600

### నూటొకటో మార్కు
(సిలబస్‌లో లేని చదువుల కథలు)



రచన: జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి ; పేజీలు: 128 ; వెల: 100 ; రచయిత చిరునామా: ఫ్లాట్ నం. 104, దేవి నిలయం అపార్ట్‌మెంట్స్, ఓల్డ్ మారుతీ నగర్, కొత్తపేట, హైదరాబాద్-35. ఫోన్: 9440037258

### భాగవత కథా తత్త్వం
రచన: డాక్టర్ కపిలవాయి లింగమూర్తి ; పేజీలు: 386 ; వెల: 300 ; ప్రతులకు: కపిలవాయి అశోక్‌బాబు, 17-110, విద్యానగర్ కాలనీ, నాగర్‌కర్నూలు-509209. ఫోన్: 8790727772

### ఆంధ్ర భగవద్గీత
రచన: సామంతపూడి దశరథరామరాజు ; పేజీలు: 184 ; వెల: 120 ; ప్రతులకు: ఎస్.మారుతీ కుమారి, 21-2-9, జయభారతి నిలయం, జెండాచెట్టు వీధి, ముత్యాలంపాడు, విజయవాడ-520011. ఫోన్: 9985104800

### పూర్ణ
(ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన చిన్నారి)




ఆంగ్లమూలం: అపర్ణ తోట ; తెలుగు: పి.సత్యవతి ; పేజీలు: 208 ; వెల: 295 ; ప్రతులకు: ప్రిజమ్ బుక్స్, హైదరాబాద్ బ్రాంచ్ ఫోన్: 040-27612938

### మనుచరిత్రము పరిచయము
రచన: బాలాంత్రపు వేంకటరమణ ; పేజీలు: 152 ; వెల: 150 ; ప్రతులకు: బి.వి.రమణ, 105, మీనాక్షి కోర్ట్స్, మేడ్చల్ రోడ్, జీడిమెట్ల విలేజ్, హైదరాబాద్-67. ఫోన్: 9573170800

### నవ్వుల నజరానా
(26 మంది రచయితల కథా సంకలనం)
పేజీలు: 128 ; వెల: 100 ; ప్రతులకు: జ్యోతి వలబోజు, 3-6-18, ఫ్లాట్ నం. 103, జయ అపార్ట్‌మెంట్స్, హిమాయత్‌నగర్, హైదరాబాద్-29. ఫోన్: 8096310140


### కన్యాశుల్కం నాటకాన్ని తెలుగువాళ్లెవరూ సరిగా అర్థం చేసుకోలేదా
(సాహిత్య వ్యాసాలు)



రచన: అంపశయ్య నవీన్ ; పేజీలు: 324 ; వెల: 300 ; ప్రతులకు: నవోదయ బుక్ హౌజ్. రచయిత ఫోన్: 0870-2456458

### అరణ్య వాసం
(గ్రామోద్ధరణను ఆశించే యువతకు ప్రత్యేకం)
రచన: డాక్టర్ ప్రణవి ; పేజీలు: 84 ; వెల: 120 ; ప్రతులకు: విజయేంద్ర క్రియేషన్స్, బృందావన్ ఫ్లాట్స్, 86/సి, పి.టి.రాజన్ రోడ్డు, కె.కె.నగర్, చెన్నై-600078. ఫోన్: 9444964268



● కథాసారం

# నవ్వ్వేన చెట్టు

**ఒకనాడు ఆఫీసుకు వస్తూనే అహమ్మదుతో చెప్పేడు 'సాయిబూ, మన పెరట్లో తొగరు చెట్టు నరికించీ... వెధవ చెట్టు'. సాయిబు హడలిపోయేడు. 'అదేం అయ్యగోరూ- పాపం ఆ సెట్టు యెన్నాల్లకో ముచ్చటగా సిగిర్పింది. దాన్నెందుకు నరకాలి?'**

జిల్లా ట్రెజరీ హెడ్ అకౌంటెంటు చిట్టి వెంకట్రామయ్య గారు అవాళ సాయంత్రం గడియారం టంగు టంగున ఐదుకొట్టగానే టక్కున ఇంటికి వెడిపోయారు. ఏం చెప్మా అనుకున్నారు పెద్ద గుమస్తా అంతా. ఇవాళైనా వెలుగులో భార్యాబిడ్డల మొహాలు చూస్తామనుకున్నారు టైపిస్టులూ, అటెండర్లూ.

అయితే, గత పన్నెండు సంవత్సరాలలో యిలాంటి విపరీతం జరగలేదు. ఇది జనన తేదీలు అజాయించేపట్ల మనవాళ్లు భూతకాలంలోని తుపానులు, భూకంపాలు మొదలైనవి ఉటంకించినట్లు చెప్పుకోతగ్గది.

చిట్టి వెంకట్రామయ్య గారు పన్నెండేళ్ల కిందట ఆ జిల్లా ట్రెజరీకి హెడ్ అకౌంటెంటుగా వచ్చేరు. అప్పటికీ యిప్పటికీ ఆయన హోదాలో గాని, ప్రవర్తనలో గాని మార్పు లేదు. ఉదయం పదకొండింటికి వచ్చి సాయంత్రం ఏడున్నరకు లేచేవారు. ఎప్పుడూ నవ్వకపోయినా యేడుపు ముఖం పెట్టలేదు. ఎవర్ని యెన్ని తిట్టినా పై అధికారితో చెప్పి అపకారం చేయించలేదు. ఆయన్ని అర్థం చేసుకున్నామనుకున్నవాళ్లు గత్యంతరం లేక సమాధానపడ్డారు.

పోతే, అవాళ సాయంత్రం ఐదింటికి అకస్మాత్తుగా ఆయన యెందుకు లేచి వెడిపోయారో యెవ్వరికీ తెలీదు. చివరికి ఆయన ప్రైవేట్ సెక్రటరీలాంటి బంట్రోతు అహమ్మదుకు కూడా. అసలాయనకి ప్రైవేటు జీవితం లేదనే అందరి అభిప్రాయం. ఆయన భార్య సుమారు ముప్పై యేళ్ల కిందట పెళ్లి అయిన కొద్ది నెలలలోనే పోయిందని కొందరికి తెలుసు. ఇంకా లోతైన విషయాలు అహమ్మదుకీ, కనీసం పన్నెండేళ్లనుంచీ వంట చేస్తున్న నరసింహానికీ కూడా తెలీవు.

సూర్యుడికంటే ముందు లేచి స్నానం చేసి, సంధ్య వార్చి, ఆఫీసు కాగితాలు చూసుకుని, తొమ్మిది గంటలకి వేడి వేడి పెసరట్టూ, వుడికించిన కూర, పెరుగూ అన్నం తిని ఆఫీసుకు వెళ్లడం, సాయంత్రం సుమారెనిమిదింటికి యిల్లు చేరి మడికట్టుకుని భోంచేసి, రాత్రి సుమారు పదకొండు వరకూ తిరిగి ఆఫీసు కాగితాలు చూసుకుని పడుకోవడం ఆయన దినచర్య. దీనిలో యెన్నడూ యేమీ మార్పుండదు.

ఆయన యెప్పుడూ సినీమాలూ నాటకాలూ చూడరు. ఎప్పుడైనా వాళ్ల బంధువులెవరైనా ఆ వూరు వస్తే వాళ్లింట్లోనే దిగేవారు. దూరపు అన్నదమ్ములు, రెండువేళ్లు విడిచిన మేనమామ మనవరాళ్లూ, స్నేహితులు, స్నేహితుల స్నేహితులు యిత్యాది. కారణం ఆయనమీద అభిమానం అనుకోవడం సత్యానికి చాలా దూరం; ఆయన కలిగినవాడని, ఖర్చు లేనివాడని. అయితే ఆయన యెవ్వరితోటీ ఆట్టే మాట్లాడేవారు కారు. చుట్టపక్కాలున్నప్పుడు కూడా ఆయన మేడమీద తన గదిలోంచి బైటికి వచ్చేవారు కారు. అంచేత ఆ వచ్చినవాళ్లు కూడా ఆనవాయితుకు 'బాబాయీ బాగున్నావా' అనో, 'అన్నయ్యా యెన్నాళ్లయింది నిన్ను చూసి' అనో పలకరించినా, ఆ యింటిని సుమారొక విశ్రాంతి గృహంగానే భావించేవారు, చార్జీలు మినహా.

చిట్టి వెంకట్రామయ్య గారి 'గది' మేడమీదుంది. మేడమీదున్న గది అదొక్కటే. ఆ గదికి ఉత్తరం వేపున్న కిటికీ గుండా పెరట్లో వున్న తొగరుచెట్టు పైభాగం సూటిగా అగుపిస్తుంది. తీరికగా వున్నప్పుడల్లా ఆయన దానివేపు చూసేవారు. ఆయన యెరికని ఆ చెట్టు యెప్పుడూ అలాగేవుంది, ఆకులు లేకుండా మోడులా. దానిని చూస్తున్నంతసేపూ ఆయన మనసు శాంతియుతంగా వుండేది.

అవాళ ఆయన సాయంత్రం ఐదు గంటలకి టక్కున లేచి ఆఫీసు నుంచి వెళ్లిపోవడం లగాయతు, ఆర్నెళ్లపాటు ఆయన ఆఫీసు జీవితంలో వింత మార్పు వచ్చింది. ఉన్నంతసేపూ అందరిమీదా రుసరుసలాడ్డం, తిట్టడం, ట్రెజరీ ఆఫీసు మీదే ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ విసుక్కోవడం. ఎంత గొడవ చేసినా ఐదింటికల్లా డ్రాయర్లు మూసి వెడిపోవడం. ఆయన్ని యెవరూ యేమీ అనేవారు కారు. కారణం ఆయనకి అప్పుడే చాలా సర్వీసు అయిపోయింది. పైగా ఆయన వయసు యాభైలో పైనా, పళ్లూడిపోయి, దిగజారిపోయి అరవై యేళ్లవాడిలా అగుపించేవాడు.

డిసెంబరు నెల నడుస్తూంది. హేమంతుడి ప్రతాపానికి తట్టుకోలేక పృథకి శియ్యలు ఏకశియ్యలౌతున్నాయి. చిట్టి వెంకట్రామయ్య వొక్క నిద్ర తీసేరు. ఈదురుగాలికి తెలివి వచ్చింది. పెరటి వైపు కిటికీ మూసివేద్దామని లేచారు.

కిటికీ దగ్గరికి వెళ్లగానే తొగరుచెట్టు మొండికొమ్మల్లోంచి వొక దృశ్యం అగుపించింది. అవతల వీధి మేడగది కిటికీ తెరిచివుంది. ఎలక్ట్రి దీపం కాంతి చక్కగావుంది. ఒక యువకుడు వొక యువతి – నిటారుగా, నగ్నంగా, గాఢాలింగనంలో పెనచుకుపోయేరు, చెట్టుతీగలా. చిట్టి వెంకట్రామయ్య హృదయం వేగంగా కొట్టుకుంది. వెంటనే చలి పటాపంచలై ఆపాదమస్తకం వేడెక్కింది.

కిటికీ మూసి వెడిపోదామా అనిపించింది. కానీ అలా చెయ్యలేకపోయేరు. వారు చీకట్లో వున్నారు. వాళ్ల లోకానికి మటుకే చీకట్లో వున్నారు. వాళ్లు నూతన దంపతులై వుంటారు. నిర్భయంగా, నిస్సంకోచంగా, నిర్లజ్జగా, రక్తమాంసాస్థి నరాలకు పంచభక్ష్య పరమాన్నాలతో విందుగా ప్రవర్తిస్తున్నారు. చిట్టి వెంకట్రామయ్య శరీరం విపరీతంగా కంపిస్తూంది. నిత్య శిశిర జీవితం గడుపుతూన్న ఆ నిర్భాగ్యపు తొగరుచెట్టు అవతలి, జీవిత పరిణామంలో మహోద్రేక పూరితమైన యీ ఘట్టపు విశ్వరూపం యిలా ఆ హేమంత నిశామధ్యంలో ప్రత్యక్షం అవుతుందని ఆయన కలలో కూడ అనుకోలేదు. ఆ సన్నివేశం ఆయన ప్రవృత్తిని పునాదులతో కుదిపింది.

ఆఫీసులో అంత అలజడి ఆ మర్నాడే జరిగింది. కిటికీలో నాటకం ఆరంభం ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకే. దానికి చివరి అంకం భరతవాక్యం వుంటాయని చిట్టి వెంకట్రామయ్య గారు అనుకోలేదు.

కాలచక్రం తిరుగుతూంది. మార్చి నెల ప్రవేశించింది. హఠాత్తుగా పెరట్లో తొగరు చెట్టు చిగిర్చింది పన్నెండేళ్ల తరువాత. చూస్తుండగా చెట్టంతా గుబురై, పచ్చటి ఆకులు నిండింది. తొగరుపూల పరిమళాలు చిట్టి వెంకట్రామయ్య గది మీద, కాదు గుండెల మీద దాడి తీస్తున్నాయి. ఏం లాభం? కిటికీ కనిపించడం లేదు. ఆయనకి చిర్రెత్తింది. వెర్రెత్తింది. నిద్ర ఇదివరకే లేదు. కానీ ఇప్పుడు నిద్రలేని సుఖం కూడా లేదు.

ఒకనాడు ఆఫీసుకు వస్తూనే అహమ్మదుతో చెప్పేడు 'సాయిబూ, మన పెరట్లో తొగరు చెట్టు నరికించీ... వెధవ చెట్టు'. సాయిబు హడలిపోయేడు. 'అదేం అయ్యగోరూ- పాపం ఆ సెట్టు యెన్నాల్లకో ముచ్చటగా సిగిర్పింది. దాన్నెందుకు నరకాలి?'

'నీకు తెలీదు- సాయంత్రానికి నరికించీ'. అహమ్మదు గొణుక్కుంటూ వెడిపోయేడు.

ఒంటిగంటకి ఆఫీసుకి ఒక యువకుడొచ్చాడు చిట్టి వెంకట్రామయ్య గారి కోసం. ఆయనకి సరిగా గుర్తురాలేదు.

'మరేం లేదు. మీ యింట్లో క్రింద భాగములో చాలా గదులున్నాయిట. నాకో గది అద్దెకిస్తారేమో అని అడుగుదామని వచ్చా.'

'నేనెప్పుడూ యెవరికీ అద్దెకివ్వలేదే... అయినా మీ రెక్కడుంటున్నారు?'

'ఇక్కడే... అంటే ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. మీ యింటి దగ్గరసానే వుంటున్నా. మా మేడ మీంచి మీ పెరట్లో తొగరుచెట్టు అగుపిస్తుంది.'

చిట్టి వెంకట్రామయ్య అదిరిపడ్డాడు. ఇప్పుడు పోల్తి అందింది. కొంచెం సర్దుకుని అడిగారు, 'మీరు బ్యాచిలరా?'

అతడు సిగ్గుతో అన్నాడు, 'కాదండీ... మా ఆవిడ పుట్టింటికి వెడుతూంది. మరేం... పురిటికి... ఈలోగా నాకెందుకు అంత యిల్లని... మీ యింట్లో ఏదో వొకగది ఇస్తే చాలు...'

చిట్టి వెంకట్రామయ్య మనసులో ఒక పెద్ద అల్లకల్లోలం లేచి క్రమేణా చల్లబడింది. అది వొక పెద్ద శస్త్రచికిత్స! యువకుడిని మర్నాడు మంచిరోజని తన యింట్లో దిగిపొమ్మన్నాడు.


'అహమ్మదూ...'

'అయ్యగోరూ...'

'తొగరుచెట్టు నరకొద్దురా...'

'ఏం అయ్యగోరూ...'

'తొగరుచెట్టు చిగిర్పిందిరా...' చిరునవ్వుతో అన్నారు. అహమ్మదుతో సహా ఆఫీసంతా మూర్ఛపోయింది.



అంగర వెంకట కృష్ణారావు

అంగర వెంకట కృష్ణారావు కథ 'తొగరు చెట్టు' కు సంక్షిప్త రూపం ఇది. 1959 లో ప్రచురితమైంది. ఉత్తరాంధ్రకు చెందిన అంగర- కథకుడు, నవలాకారుడు. తెలుగులో సైన్యం నేపథ్యంలో సాహిత్య సృజన చేసిన అతి తక్కువ మంది రచయితల్లో అంగర (1920-74) ఒకరు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఆయన సైన్యంలో పనిచేశారు. ఆ అనుభవాలతో 'విరామం' నవల రాశారు. పెద్ద మనిషి, పోయిన పుటలు ఆయన కథల్లో కొన్ని.

● పరిచయం

# విద్వాంసులకు దారిదీపం



**పీఠికలు**
రచన: డాక్టర్ శ్రీరంగాచార్య ; పేజీలు: 652 ; వెల: 350 ; ప్రచురణ: పూర్ణోదయ పబ్లికేషన్స్, వనస్థలిపురం, హైదరాబాద్-70. ఫోన్: 9440466636

ప్రాచీన తెలుగు కావ్యాల పాఠపరిష్కరణ సంప్రదాయం కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్న కాలమిది. మానవల్లి, వేటూరి, చిలుకూరి నారాయణరావు, రాళ్లపల్లి, దీపాల పిచ్చయ్య శాస్త్రుల వంటి పండిత పరంపర సమాప్తమై పట్టుమని పదిమంది పాఠ పరిష్కర్తలు లేని యుగమిది. ప్రాచీన తెలుగు కావ్య పాఠ పరిష్కరణే తమ ధ్యేయంగా, విస్మృత కావ్య ప్రకాశనమే తమ ఏకైక లక్ష్యంగా సంప్రదాయ మార్గంలో పయనిస్తున్న పథికులు డాక్టర్ పెరుంబుదూరు శ్రీరంగాచార్యులు.

రంగాచార్యులు 1969 నుంచి 2019 వరకు పరిష్కరించి సంపాదకత్వం వహించిన 30 గ్రంథాల పీఠికల సమాహారమే ఈ గ్రంథరాజం. మొదటి పీఠిక 'దశరథరాజ నందన చరిత్ర' ఆచార్యులు పైలాపచ్చీసు వయస్సులో(1969) రచించిన పాండిత్య పూర్ణమైన రచన. నల్లగొండ జిల్లాకు చెందిన మరింగంటి సింగరాచార్యులు వెలార్చిన దశరథరాజ నందన చరిత్ర నిరోష్ఠ్య రామాయణ కావ్యం. సింగరాచార్యులు నిరోష్ఠ్యంగా అనువదించడంలో చాలాచోట్ల కుదించారనీ, సుందరకాండను మరింతగా సంక్షిప్తం చేయడం విచారకరమనీ అన్నారు. నిరోష్ఠ్య కావ్యరచన కావించడంలోని సాధక బాధకాల్నీ, ఆ కావ్య రచనా వైశిష్ట్యాన్నీ విశదపరచడం విశేషం.

ఆసూరి మరింగంటి వెంకట నరసింహాచార్య విరచిత 'తాలాంక నందినీ పరిణయము' నకు రాసిన పీఠికలో కావ్యంలోని అలంకార సౌందర్యాన్నీ, అర్థ భావ పద చమత్కారాల్నీ రసవంతంగా విశ్లేషించి, శృంగార రస వైలక్షణ్యాన్ని వెల్లడించారు. అలాగే కావ్యంలోని సంశయాల్నీ, అనౌచిత్యాల్నీ నిస్సంకోచంగా ప్రస్తావించారు.

గోవర్ధనం వెంకట నరసింహాచార్యుల 'శ్రీలక్ష్మీ నృసింహ వైభవం-లాలి-ప్రహరి' సుకృతికి రాసిన పీఠిక 'సుదర్శనం'లో మహావిష్ణువుల పవ్వళింపు సేవ సందర్భంలో పాడే ప్రహరి (హెచ్చరిక) పద్యగద్యాలు భక్తి ప్రపత్తుల్ని సుందరంగా, సుతారంగా, సుశోభితంగా చాటుతాయని పేర్కొన్నారు. ప్రహరి తెలుగు సాహిత్యంలో ఉదాహరణ వాఙ్మయంలాగానే ప్రత్యేక ప్రక్రియ అని వాక్రుచ్చారు.

భైరవకవి 'శ్రీరంగ మహత్త్వము'నకు రాసిన పీఠిక 99 పేజీల విస్తారం కలది. ఇది చిలుకూరి నారాయణరావు, నిడదవోలు వెంకటరావు గార్ల భూమికల్ని జ్ఞప్తికి తెస్తుంది. ఇందులో మాహాత్మ్య కావ్యాల పుట్టుపూర్వోత్తరాల్ని సమీక్షించారు. భైరవకవి వంశ చరిత్రను వివరిస్తూ, అతనిపై ప్రభావం చూపిన ఎర్రన, శ్రీనాథ, పోతన, నాచన సోముల్ని ప్రస్తావించి, భైరవ కవి ప్రభావం పొందిన కవుల్ని కూడా స్థూలంగా పేర్కొన్నారు. గ్రంథంలోని ఐదాశ్వాసాల కథాసారాంశాన్ని ఇస్తూ, భైరవకవి కవితా కళను విశ్లేషించారు. తెలంగాణ కవి పండితులు రాసి శాస్త్ర గ్రంథాల్ని ప్రచురించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

రంగాచార్యుల భాష గ్రాంథికమైనా, సరళ గ్రాంథికంగా ఎలాంటి తికమకలు లేకుండా కావ్యప్రియుల హృదయాలకు హత్తుకుంటుంది. ఈ పీఠికలు రంగాచార్యుల పాండిత్యాన్నీ, పాఠ పరిష్కరణా విధానాన్నీ, ఆయా కవుల వైదుష్య సృజనాత్మక ప్రతిభల్నీ తేటతెల్లం చేస్తాయి.

◆ ఘట్టమరాజు

● రీవిజిట్



'శ్మశానంలో నిశ్శబ్దమే కాదు జ్ఞానమూ ఉంటుందని' తెలిసిన కవి కృష్ణప్రసాద్. 'కత్తులు చెయ్యలేని పని కారుణ్యం చేస్తుంది పరిపూర్తి' అన్నది ఆయన అవగాహన. కృష్ణప్రసాద్ తొలి కవితాసంపుటి 'స్మృతి చప్పుడు' గతేడాది వచ్చింది. అందులోని ఈ కవిత 2009లో రాసింది. కవి ఫోన్: 7382349119

## అసలు నిజం

మనుషులున్నాయంటావా?
అడిగింది పిల్లదెయ్యం తల్లిని.

''ఇంతవరకూ రాలేదు నా ఉనికిలోకి''

మరి మనాళ్లంటారే?

''ఔను మన పెద్దలు అంటుంటారు
మనలో కోర్కెలు చావని వాళ్లు
మనుషులౌతాయని''

నిజం కాదా మరి?

''ఏమో నాకు తెలియంది ఏం చెప్పను?''


పాపం కదా మనుషులు!

తలూపింది తల్లిదెయ్యం
నిర్వికారంగా–

◆ పరుచూరి కృష్ణప్రసాద్

● ఎందుకు రాశానంటే...

# విప్లవంలో అస్తిత్వాల అన్వేషణ





**నేరేడురంగు పిల్లవాడు** (కథలు)
రచన: పాణి ; పేజీలు: 160 ; వెల: 150
ప్రచురణ: విప్లవ రచయితల సంఘం ; ప్రతులకు: రచయిత, 87/106, శ్రీ లక్ష్మీనగర్, బి-క్యాంప్, కర్నూల్-518002. ఫోన్: 9866129458

కథలు రాయడానికి తక్షణ ప్రేరణ స్వీయానుభవమే కావచ్చు. కానీ వ్యక్తుల, సమూహాల అనుభవంలోకి రాని వాస్తవికత ఎంతో ఉంటుంది. దాన్ని సొంతం చేసుకొని కాల్పనీకరించడమే సాహిత్యానికి ఉండే సామాజిక లక్ష్యం. నా వరకైతే– అనుభవాల సొద అయిపోయాక, కంటికి కనిపించే వాటి వెనుక ఉండే తార్కిక పరిణామాలను, పర్యవసానాలను విశ్లేషిస్తూ వ్యాసాలు రాసేశాక, ప్రసంగాలు చేశాక ఇంకా ఏమైనా మిగిలి ఉన్నదా అనే అన్వేషణే కథా రచన. ఎప్పటి నుంచో కథలు రాస్తూ ఉన్నా ఇలా అనిపించే క్రమంలో రాసిన కథలు నా వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేశాయి. ఇందులో కొన్ని రాశాక, నేను అంతకుముందులా లేనని అనిపించేది. నా చుట్టూ ఉన్న వాస్తవికతను కాల్పనికంగా అందుకొనే క్రమంలో నా స్వభావం కూడా మార్పునకు లోనైంది. ఇది గమనించాకే ఈ కథలను పుస్తకంగా తేవచ్చనే నమ్మకం కలిగింది.

స్వీయానుభవ పరిధిని అధిగమించడమే దీనికి కారణం అనుకుంటా. వాస్తవికతను చేరుకోడానికి ఇతర ప్రక్రియల కంటే కథా రచన నాకు చూపిన దారి చాలా థ్రిల్ అనిపిస్తుంది. ఇది చాలా జ్ఞానాన్ని ఇచ్చింది. దేన్నయినా కొంచెం పైనుంచి, లోపలి నుంచి విమర్శనాత్మకంగా చూసే దృష్టిని ఇచ్చింది. కార్యకర్తగా ఇతరులతో వ్యవహరిస్తున్నప్పుడు ఇది రోజూ నాకు అనుభవంలోకి వస్తుంటుంది. ఇదంతా కథతో నా అనుబంధం మాత్రమే కాదు. కథ నిర్వహించే సామాజిక పాత్ర ఇదే అని నా నమ్మకం. ఈ కథల్లోని మల్టీ లేయర్స్, మల్టీ ఫోకస్ పాయింట్స్ మధ్య అంతస్సూత్రం నేరేడు రంగు పిల్లవాడే. అతను వ్యక్తి కాదు. జ్ఞాపకం కాదు. విప్లవోద్యమ చైతన్యం. అనేక కారణాల వల్ల వ్యక్తిగా నాకుండే అనుభవ పరిధిని అధిగమించి విశాలమైన వాస్తవికతను నాలో భాగం చేసింది అదే. కాబట్టి ఈ కథల్లోని శిల్ప ప్రత్యేకత వేరే ఏమో కాదు. అది నా దృక్పథమే.

ఈ కథలు సుమారుగా ఈ విడత రాయలసీమ ఆందోళన మొదలయ్యాక రాసినవే. అస్తిత్వాల గురించి ఆలోచించడానికి అస్తిత్వవాదాలు తప్పనిసరేం కాదు. విప్లవాన్ని సక్రమంగా అర్థం చేసుకుంటే అందులో అస్తిత్వాలు ఎలా కనిపిస్తాయి? అనే కాల్పనిక అన్వేషణే ఈ కథలు. విప్లవం గురించిన నా సకల ఉద్వేగాలతో, ఎరుకతో రాయలసీమ అస్తిత్వాన్ని కూడా సొంతం చేసుకొన్నానని ఇప్పుడనిపిస్తోంది.

◆ పాణి

## గ్రహం అనుగ్రహం

శ్రీవికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, శిశిర ఋతువు. మాఘ మాసం. తిథి శు.నవమి సా.5.16 వరకు, తదుపరి దశమి. నక్షత్రం కృత్తిక రా.9.26 వరకు, తదుపరి రోహిణి. వర్జ్యం ఉ.8.40 నుంచి 10.22 వరకు. దుర్ముహూర్తం ప.12.35 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.50 నుంచి 3.35 వరకు. అమృత ఘడియలు సా.6.51 నుంచి 7.56 వరకు **సూర్యోదయం:** 6.35 **సూర్యాస్తమయం :** 5.53 ; **రాహుకాలం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు. **యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు



**నమాజ్ వేళలు**
ఫజర్ : 5.33 జొహర్ : 12.30
అసర్ : 4.36 మగ్రీబ్ : 6.12
ఇషా : 7.27

## రారండోయ్

- రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారాన్ని అద్వంద్వం కవితాసంపుటికిగానూ శ్రీరామ్‌కు ఫిబ్రవరి 9న ఉదయం 10 గంటలకు సిరిసిల్లలోని రంగినేని ట్రస్టులో ప్రదానం చేయనున్నారు. దేశపతి శ్రీనివాస్, జూకంటి జగన్నాథం, జిందం కళాచక్రపాణి, రంగినేని మోహన్‌రావు, మద్దికుంట లక్ష్మణ్, పత్తిపాక మోహన్, నాగిళ్ల రమేశ్ పాల్గొంటారు.
- నోరి నరసింహ శాస్త్రి 121వ జయంతి ఉత్సవం ఫిబ్రవరి 6న సా. 6 గంటలకు హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో జరగనుంది. ఇందులో– నోరి పురస్కారాన్ని అక్కిరాజు సుందరరామకృష్ణకూ, నోరి యువరచయిత ప్రోత్సాహక పురస్కారాన్ని గౌరీభట్ల రుక్మిణీ బాలముకుంద శర్మకూ ప్రదానం చేస్తారు. నిర్వహణ: నోరి నరసింహ శాస్త్రి చారిటబుల్ ట్రస్ట్, నాచారం, హైదరాబాద్.
- జానుడి– సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న ఒంగోలులోని డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు భవన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు ఇటీవల వచ్చిన 12 కవితా సంపుటాల పరిచయ సభ జరగనుంది.
- దాట్ల దేవదానం రాజు రచనలు– 'మధు హాసం', 'చైనా యానం'– ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 8న సాయంత్రం 5 గంటలకు కాకినాడలోని గాంధీ భవన్‌లో జరగనుంది. పి.చిరంజీవినీ కుమారి, వాడ్రేవు వీరలక్ష్మీ దేవి, మధునాపంతుల మూర్తి, రెంటాల శ్రీవెంకటేశ్వరరావు, కె.శైలజ, మధునా మూర్తి పాల్గొంటారు. నిర్వహణ: ఆంధ్రీకుటీరం, స్ఫూర్తి.

● సాహిత్య మరమరాలు

# దేవుడికేం కావాలో!



జాక్ లండన్ ఆత్మలాలసత గురించి ఒక్క విషయం చెప్పవచ్చు. ''నా యిష్టం'' అన్నమాటకు తిరుగులేదని అతను ''క్రూయిజ్ ఆఫ్ ద స్నార్క్''లో రాశాడు. అతని ఆత్మీయులు అతని యిష్టానికి తలవగ్గవలిసి వచ్చేది, లేకపోతే ఆత్మీయులు కాకుండా పోవలసిందే. చాలామందికి అతనిలో ఉన్న ఈ గుణం నచ్చలేదు. అతని కెప్పుడూ బోలెడంతమంది శత్రువులుండేవారు. మన్యూంగీ అనే జపనీయుడొకడు జాక్ లండన్‌కు నౌకరుగా ఉండేవాడు. వాడిలో తన యజమానిపై చాలాకాలంగా కసి పేరుతూ ఉండి ఉండాలి. ఒకనాడు జాక్ లండన్ అనేకమంది అతిథుల మధ్య ఉన్న సమయంలో వాడు పళ్లెంలో పానీయాలు తెచ్చి, తన యజమాని ముందు వంగి, అతి వినయంగా, ''దేవుడికి బీర్ కావాలా?'' అని అడిగి కసి తీర్చుకున్నాడు. అతిథులు నివ్వెరపోయారు. జాక్ లండన్ జీవితం రచించిన అతని భార్య అతని అహంకారాన్ని ''రాజోచితమైనది'' అన్నది.

(కొడవటిగంటి కుటుంబరావు తెలుగులోకి అనువదించిన జాక్ లండన్ 'ప్రకృతి పిలుపు' ముందుమాటలోంచి)

◆ ఫ్రాంక్ లూథర్‌మాట్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 3-2-2020

స్కిన్ కేర్



# మెరిసే మేని కోసం ఇంటి ట్రీట్‌మెంట్

**చ**ర్మం మీద కొవ్వు కణాలు, మృత కణాలు పేరుకు పోవడం అనేది మహిళలకు ఎదురయ్యే అత్యంత సాధారణమైన సమస్య. కొవ్వు కణాలు చర్మం బయటకు పొడుచుకుని వచ్చి చర్మం మీద పేరుకుపోవడం అనేది మగవారిలో కనిపించదు. ఆడవాళ్ల చర్మం కంటే మగవాళ్ల చర్మం మందంగా ఉండడమే ఇందుకు కారణం. కొవ్వు కణాలను, మృత కణాలను ఎప్పటికప్పుడు తొలగించుకోకపోతే చర్మం నల్లగా, బిరుసుగా మారిపోతుంది. నడుమకు కింది భాగంలో, తొడల మీద ఈ సమస్య ఎక్కువ. ఎక్స్‌ఫోలియేషన్ (మృత కణాల తొలగింపు) కోసం స్పాలకు, బ్యూటీ పార్లర్లకు వెళ్లలేని వాళ్లు సొంతంగా ఇంట్లో ఇలా చేసుకోవచ్చు.

## ఆయిల్ మసాజ్



**యాం**టీ సెల్యులైట్ మసాజ్ ఆయిల్‌ను ఒంటికి పట్టించి మసాజ్ చేయాలి. ఈ ఆయిల్ లెమన్ గ్రాస్, తులసి, రోజ్‌మెరీల మిశ్రమం. దీంతో మసాజ్ చేయడం వల్ల చర్మం మీదున్న కొవ్వు, మృతకణాలు తొలగిపోవడంతోపాటు దేహంలో రక్త ప్రసరణ కూడా మెరుగవుతుంది. ఈ ఆయిల్ దేహంలో గూడుకట్టుకుని పోయిన వ్యర్థాలను మూత్రం ద్వారా బయటకు పోయేలా చేస్తుంది.

## కాఫీ స్క్రబ్

ఫిల్టర్‌లో వేయడానికి ఉపయోగించే కాఫీ పొడి (ఇన్‌స్టంట్ కాఫీ పౌడర్ కాదు)ని ఒక టేబుల్ స్పూన్ తీసుకుని కొద్ది నీటితో పేస్టు చేయాలి. ఆ పేస్ట్‌ని ఒంటికి రాసి, ఐదునిమిషాల తర్వాత వలయాకారంగా మర్దన చేయాలి. ఇలా చేస్తే కొవ్వు కణాలు, మృతకణాలు రాలిపోవడంతో పాటు చర్మం శుభ్రపడుతుంది. మృదువుగా మారుతుంది.



## నేచురల్ బాడీ బ్రష్

**రో**జూ స్నానం చేసేటప్పుడు బాడీ బ్రష్‌తో ఒకసారి రుద్దుకుంటే పాడిబారిన చర్మకణాలు ఏరోజుకారోజు రాలిపోతుంటాయి. కాబట్టి చర్మం మీద పేరుకునే ప్రమాదం ఉండదు. స్టెరిలైజ్ చేసిన కొబ్బరి పీచును చెక్క హ్యాండిల్‌కి అమర్చిన బ్రష్‌లు రెడీమేడ్‌గా దొరుకుతాయి. ఈ బ్రష్‌ను వేడి నీటితో శుభ్రం చేయాలి.



చెట్టు నీడ

## మాటల చిలుక

**ఒ**క అడవిలో మర్రిచెట్టు మీద చిలుక, పావురం నివసించేవి. అనతి కాలంలోనే వాటి మధ్య స్నేహం కుదిరింది. చిలుక చక్కటి మాటలతో పావురాన్ని సంతోష పరిచేది. పావురం కూడా మిత్రుడు చెప్పే విశేషాలు ఎంతో ఆసక్తిగా వినేది కానీ ఏనాడూ నోరు విప్పి తన అభిప్రాయాలు చెప్పేదికాదు. ఒక రోజు చిలుక పావురంతో.. 'మిత్రమా నేను రోజూ వసపిట్టలా వాగుతుంటాను. కానీ నువ్వు మాత్రం నేను చెప్పేవి వింటూ చిరునవ్వు చిందిస్తావు కానీ ఏనాడూ ఒక సందేహాన్ని కానీ, అభినందన కానీ మాటల రూపంలో బయటపెట్టవు'' అంది నిష్ఠూరంగా.



'అంతమాట అనకు మిత్రమా.. సృష్టిలో మనుషులకు మాత్రమే ఉండే 'మాట' అనే అదృష్టం భగవంతుడు మీ చిలుక జాతికి కల్పించాడు. మేము మీ మాటలు విని ఆనందించగలం. తిరిగి విశ్లేషించి చెప్పే జ్ఞానం, సామర్థ్యం మాకు లేవు' అని చెప్పింది.

మిత్రుడి మాటలకి పొంగిపోయిన చిలుక నిజమే కదాని నాటి నుండి తన వాగుడిని మరింతగా పెంచింది.

అదే పనిగా వాగడంతో పావురానికి విసుగు మొదలైంది కానీ మిత్రుడిని ఏమీ అనలేక మౌనంగా భరించేది.


ఒక రోజు ఒక వేటగాడు చెట్టు కింద సేద దీరడానికి వచ్చి చెట్టుపై ఉన్న పావురాన్ని, చిలుకను చూశాడు. చిలుక గడగడ వాగడం చూసి.. 'ఆహా...ఏమి నా అదృష్టం! ఈ మాట్లాడే చిలుకను పట్టుకుని పట్నంలో అమ్మితే నెల రోజుల వరకూ నా తిండి గింజలకు లోటుండదు' అని వలవేసి చిలుకను పట్టేశాడు.

మిత్రుడిలోని అతి వాగుడే వేటగాడికి పట్టించిందని బాధపడ్డ పావురం.. మిత్ర వియోగంతో మరో అడవిలోకి వెళ్లిపోయింది.

**– లోగిశ లక్ష్మీనాయుడు**

# నీళ్లు పట్టుకెళ్లి పాలు తెచ్చుకోండి

**'నీళ్లు పట్టుకెళ్లి పాలు తెచ్చుకోండి'.. న్యూఢిల్లీలో నలభై ఏళ్ల కిందట అద్భుతమైన ఫలితాలను ఇచ్చిన మాట ఇది. అప్పట్లో న్యూఢిల్లీలో చాలా కాలనీల్లో కాలనీకి ఒక్క పాలబూత్ మాత్రమే ఉండేది. వైద్యనాథన్ నివసించే 'ఓల్డ్ ఆరావళి రేంజ్' కు సమీపంలోని కాలనీకి కూడా అంతే. వాళ్లకు 'మదర్ డెయిరీ' బూత్ మాత్రమే ఆధారం. అప్పటికి ఇంకా పాలకు ప్యాకెట్ రూపం రాలేదు. అందరూ గిన్నె లేదా చిన్న క్యాన్ పట్టుకెళ్లి పాలు పోయించుకునే వాళ్లు. అప్పుడు వైద్యనాథన్‌కి వచ్చిన 'నీళ్లు పట్టుకెళ్లి పాలు తెచ్చుకోండి'.. అనే ఆలోచనే ఆ కాలనీని పచ్చగా పెంచింది.**



వైద్యనాథన్, ఉషా రామస్వామి

కాలనీలోని వీధుల్లో వైద్యనాథనే స్వయంగా మొక్కలు నాటారు. తర్వాత ప్రతి ఇంటికి ముందుకూ వెళ్లి.. 'పాల కోసం మీరు ఉదయం బూత్‌కి వెళ్లేటప్పుడు పాల గిన్నె నిండా నీళ్లు పట్టుకెళ్లి ఒక్కొక్కరు ఒక్కో మొక్కకు పోయండి. వచ్చేటప్పుడు ఆ గిన్నెలో పాలు పోయించుకుని రండి. ఇది మీకు కష్టమైన పనేమీ కాదు కదా' అని అభ్యర్థించాడు. ఆ ప్రయత్నం ఫలించి ఇదిగో ఇప్పుడీ కాలనీ మొత్తం పచ్చటి చెట్లతో చల్లగా ఉందని చెప్పారు వైద్యనాథన్ కూతురు ఉషా రామస్వామి.

### మొక్కలే ఉద్యోగం

ఎనభై ఏళ్ల వైద్యనాథన్‌ది తమిళనాడులోని ఓ మారుమూల పల్లె. చదువుకుని ఉద్యోగరీత్యా ఢిల్లీలో స్థిరపడ్డారాయన. ఉద్యోగం చేసిన రోజుల్లోనూ మొక్కల పెంపకం మీద ఆసక్తితో ఉండేవారు. రిటైర్ అయిన తర్వాత ఆయన పూర్తి స్థాయిలో మొక్కలతోనే జీవించడం మొదలుపెట్టారు. ఢిల్లీ, గుర్‌గావ్ పరిసరాల్లో ఆయన మొక్కలు నాటి పెంచిన పార్కులకు లెక్కేలేదు. మొక్కలు పెంచడం ఖర్చుతో కూడిన పని కానే కాదని చెప్తారు, చేసి చూపిస్తారు కూడా. ఎండాకాలంలో నీటి ఎద్దడి ఉన్న రోజుల్లో తన దుస్తులు ఉతుక్కున్న నీటిని బకెట్లతో మోసుకెళ్లి ఇప్పటికీ ఇంటికి దగ్గరలో ఉన్న మొక్కలకు పోసి వస్తారు. ఎనభై ఏళ్ల వయసులో ఈయనకు ఎంత ఓపిక అని నలభై ఏళ్ల వాళ్లు ఆశ్చర్యపోతుంటారని చెప్పారు ఉషా రామస్వామి.

### మొక్క కోసం పోరు

తమ ఇంటికి సమీపంలోని రాక్ గార్డెన్‌ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో అది పాడుపడి పోయిందని, తండ్రి తన రెక్కల కష్టంతో ఆ గార్డెన్‌ను చిగురింపచేశారని, ఆ తర్వాత అది కబ్జాదారుల కోరల్లోకి చిక్కుకుపోయిందని చెప్పారు ఉష.

ఆ సమయంలో వైద్యనాథన్ ఆ వార్డు కౌన్సిలర్‌కు, సంబంధిత ప్రభుత్వ శాఖలకు, వార్తాపత్రికలకు లెటర్లు రాసి రాసి ఎట్టకేలకు అధికారుల కళ్లు తెరుచుకునే వరకు పోరాడారు. ప్రభుత్వంతో ఆయన పోరాటం మొక్కలకే పరిమితం కాలేదు. బస్ స్టాప్‌ను కాలనీ వాసులకు అనువైన ప్రదేశంలోకి మార్పించడం, రద్దీగా ఉన్న ప్రదేశాల్లో పాదచారుల సౌకర్యం కోసం నడక వంతెన ఏర్పాటు చేయించడం, లైబ్రరీ పెట్టించడం వంటి పనులను అధికారుల వెంటపడి మరీ పూర్తి చేయించారు. అందుకే ఆ కాలనీవాసులతోపాటు ఆ కాలనీకి వచ్చే పాలవాళ్లు, కూరగాయలు అమ్ముకునే వాళ్లు కూడా దీపావళి పండుగ రోజు ఆయనతో స్వీట్లు పంచుకుంటారు. ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యి ఇరవై ఏళ్లు నిండినా ఇప్పటికీ ఆయన జూనియర్‌లు వైద్యనాథన్‌కు అంతేస్థాయిలో గౌరవం ఇస్తారు.

### మొక్క పూజ

'ఈ వయసులో విశ్రాంతిగా ఉండకుండా ఇన్ని వ్యాపకాలెందుకు' అంటే నవ్వి.. ''నా వయసు వాళ్లు మంత్రాలు చదువుతూ, పూజలు చేసుకుంటూ గడుపుతారు. నేను మాత్రం 'ప్రార్థించే పెదవుల కంటే పని చేసే చేతులు మిన్న' అని నమ్ముతాను. అంతగా పూజలు చేయాలని ఉంటే దండిగా వండి చుట్టు పక్కల వాళ్లకు పంచి పెడితే సరి. మన చుట్టూ ఉన్న వాళ్లను సంతోషంగా ఉంచడంతోపాటు మన కారణంగా ఎవరికీ కష్టం కలగకుండా నడుచుకుంటే చాలు'' అంటారు వైద్యనాథన్.

**– మంజీర**

### మొక్క మనిషి

**మొ**క్కలు నాటడం కోసం ఈ వయసులోనూ నాన్న గుంటలు తవ్వుతుంటారు. అడ్డదిడ్డంగా పెరిగిన రెమ్మలను కత్తిరిస్తుంటారు. ఎండిన ఆకులను ఏరివేస్తారు. మొక్కల మధ్య దారులు తీస్తారు. మొక్కలకు పాదులు కూడా తీస్తుంటారు. అంతేకాదు, నిచ్చెన ఎక్కి మొక్కల తీగలను పైకి అల్లకం పెడతారు. ఈ పనులు చేస్తున్నప్పుడు ఈ వయసులో ఆయన దేహాన్ని ఎలా బాలెన్స్ చేసుకుంటున్నారా అని చూసే వాళ్లు ఆందోళన పడాల్సిందే తప్ప ఆయనకు ఏ మాత్రం భయం ఉండదు.

**– ఉషా రామస్వామి, వైద్యనాథన్ కూతురు**

రెండు విషయాలు

## అభినందన

చదువుల తల్లులు



**బ**డ్జెట్‌లో ఆడపిల్లల గురించి చాలా మంచి విషయాలు చెప్పారు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. అన్నిటికన్నా వినసొంపైన విషయం.. దేశవ్యాప్తంగా ఏ తరగతిలో చూసినా పాఠశాలల్లో చేరుతున్న వారిలో అబ్బాయిల కన్నా అమ్మాయిల సంఖ్యే ఎక్కువగా ఉండటం! గత ఏడాది ప్రాథమిక స్థాయిలో 94.32 శాతం, ప్రాథమికోన్నత స్థాయిలో 81.32 శాతం, ఉన్నత స్థాయిలో 59.70 శాతం మంది బాలికలు ఉండగా.. అబ్బాయిలు 89.28 శాతం, 70 శాతం, 57.4 శాతం మాత్రమే ఉన్నారని సీతారామన్ తెలిపారు. చదువుతున్న అమ్మాయిల్నే కాదు, చదివిస్తున్న అమ్మానాన్నలను మంత్రి అభినందించారు.

## ఆవేదన

చిన్నారికి శిక్ష!



**పి**ల్లలకు టీచర్‌లు విధించే శిక్షలు కొన్నిసార్లు ఊహకు కూడా అందనివిగా ఉంటాయి. యు.ఎస్.లోని ఒక క్రెష్‌లో టీచర్.. ఏడాది వయసున్న తన 'స్టూడెంట్' పాల పొట్ట మీద.. చెరిపితే చెరిగిపోని ఇంకుతో 'ఐ యామ్ అవుటాఫ్ డైపర్స్' అని రాసి, ఆ చిన్నారిని ఇంటికి పంపింది. క్లాస్ రూమ్‌లో వాడు 'ఒకటికి' పోవడంతో సహనం నశించి ఆమె ఆ పని చేసింది. ''డైపర్స్ పంపించండి అని నాకు ఒక్క మాట చెప్పి ఉంటే సరిపోయేది. నేనొక సింగిల్ మదర్‌ని. ఆఫీస్‌లో ఊపిరి సలపనంత పనిలో ఉంటాను. కొన్ని మర్చిపోతుంటాను కూడా. మిమ్మల్ని నమ్మి నా బిడ్డను అప్పగించి పోతే ఇలా చేస్తారా'' అని ఆ తల్లి ఆవేదన వ్యక్తం చేయడంతో స్కూలు యాజమాన్యం ఆ టీచర్‌ని తక్షణం ఉద్యోగంలోంచి తొలగించింది.

హెల్త్ టిప్



**ఆ**హ్లాదం కలిగినప్పుడు మన మెదడులో చోటు చేసుకునే మార్పులు, రసాయనాలను గమనించినప్పుడు డోపమైన్, సెరిటోనిన్, ఎండార్ఫిన్ వంటివి మనలో స్వాభావికంగానే స్రవిస్తాయి. వీటిలో సెరిటోనిన్ గురించి... **సెరిటోనిన్** మనకు సంతోష భావనను ఇస్తుంది. అందుకే దీన్ని 'హ్యాపీనెస్ హార్మోన్' అంటారు. డిప్రెషన్, మూడ్స్ త్వరగా మారిపోవడం వంటి మానసిక సమస్యలు దీని లోపం ఎక్కువ కావడం వల్లనే వస్తాయి.

**ఎక్కడ దొరుకుతుంది:** గోరువెచ్చటి నీటితో స్నానం చేసి, రోజూ రాత్రి ఒక గ్లాసు గోరువెచ్చని పాలు తాగండి. ఆ వెంటనే ఒక ఆహ్లాదకరమైన ఫీలింగ్ కలిగి, మంచి నిద్రపడుతుంది. దానికి కారణం పాలల్లోని ట్రిప్టోఫాన్. ఇది సెరిటోనిన్‌ను స్రవించేలా చేస్తుంది. విటమిన్ బి6 ఉండే బఠాణీలు, క్యాలీఫ్లవర్, అవొకాడోలతో పాటు... విటమిన్ బి12 ఉండే కాలేయం, కిడ్నీ, క్యాబేజీ, బ్రకోలీతో పాటు, ఒమెగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ ఎక్కువగా ఉండే అవొకాడో, వాల్‌నట్ వంటివీ సెరిటోనిన్ స్రావానికి సహాయపడతాయి. సెరిటోనిన్ నేరుగా లభ్యం కావాలంటే పైనాపిల్, అరటిపండ్లు, ప్లమ్ తిని చూడండి.

ఓల్డ్ ఏజ్

## పెద్దవాళ్లను పడనివ్వకండి



**వృద్ధాప్య భయాలలో అతి ప్రధానమైనది.. కింద పడిపోయే పరిస్థితి ఉండటం. యేటా దేశవ్యాప్తంగా అరవై ఐదు, అంతకన్నా ఎక్కువ వయసులో కింద పడటం వల్ల 35 శాతం గాయాలైనవారు ఉండగా, 40శాతం మరణించినవారు ఉంటున్నారు!**

కోల్‌కతా న్యూటౌన్‌లోని 'స్నేహోదయ' అనే సంస్థ వయోవృద్ధుల కోసం ఇటీవల ఒక సదస్సు నిర్వహించింది. వయోవృద్ధుల సంరక్షణకు కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించడానికి ఉద్దేశించిన ఈ సదస్సులో సాధారణ వైద్యులు, ఫిజియోథెరపిస్టులూ పాల్గొన్నారు. వృద్ధులకు మూడింట రెండు వంతుల ప్రమాదాలు ఇంటి లోపలే జరుగుతాయని చెబుతూ.. వీటిని నివారించడానికి ఆ సమావేశంలోని వైద్యులు కొన్ని సూచనలు కూడా చేశారు. అవి ఈ విధంగా ఉన్నాయి.

- వృద్ధులు తిరిగే గదులలో సోఫాలు, టేబుళ్లు మొదలైనవి అడ్డంగా కాకుండా విశాలంగా ఉన్న గదిలో గోడలకు దగ్గరగా ఉండాలి.
- కార్పెట్ కాళ్లకు తట్టుకుని పడిపోయే అవకాశాలు ఎక్కువ కాబట్టి ఆ విషయంలో జాగ్రత్త వహించాలి.
- ఏ వస్తువులైనా కింద చిందరవందరగా ఉంచకూడదు.
- ఫ్లోర్‌ని తడిగా, జారే విధంగా ఉంచకూడదు.
- బాత్‌రూమ్‌లలో చేత్తో పట్టుకుని నడిచేందుకు వీలుగా గోడలకు హ్యాండ్‌రెయిల్స్, నేలపై జారని మ్యాట్స్ ఉండాలి.
- ఇంట్లో గాలి, వెలుతురు ధారాళంగా ఉండాలి.
- పడినప్పుడు తక్కువ గాయం అయినా సరైన 24 నుంచి 48 గంటల్లోపు చికిత్స అందించాలి.

# అడ్డుకుంటేనే ఆగుతారు

**విద్యార్థినులు, యువతులు, మహిళా ఉద్యోగినులు, అంగన్‌వాడీ, ఆశా మహిళలకు ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇస్తున్నారు లక్ష్మి. శాంతి భద్రతలను కాపాడడంతోపాటు, సమాజానికి రక్షణ కల్పించే పనిలో ఉన్న మహిళ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, షీ టీం సభ్యులకు సైతం పోరాట కళలో మెళుకువలు నేర్పిస్తున్నారు. నిత్యం జరుగుతున్న ఆగడాల భయంతో ఆడపిల్లలు ఇంట్లోనే ఉండిపోతే తమ కలల్ని నిజం చేసుకోలేరని లక్ష్మి అంటున్నారు.**

**ఈ** కథ లక్ష్మిదే అయినా, రవి దగ్గర్నుంచి మొదలు పెట్టాలి. రవిది వరంగల్ జిల్లా కొత్తవాడ. కరాటే అంటే ఆసక్తి. చిన్నతనంలోనే ఏడాదిన్నర వ్యవధిలో బ్లాక్ బెల్ట్ సాధించే దశకు చేరుకున్నాడు! ప్రస్తుతం బ్లాక్ బెల్ట్‌లో సెవన్త్ డాన్. కరాటేనే వృత్తిగా ఎంచుకొని పాఠశాల పిల్లలకు నేర్పిచడానికి రాష్ట్రమంతటా తిరుగుతున్నప్పుడు అతడికి లక్ష్మితో పరిచయం అయింది. లక్ష్మిది నిజామాబాద్ జిల్లా మాకులూరు మండలం శాంతినగర్ గ్రామం. అప్పటికే ఆమెకు కరాటేలో ప్రవేశం ఉంది. ఇద్దరూ 1997లో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తరువాత కూడా లక్ష్మి మార్షల్ ఆర్ట్స్‌ను కొనసాగించారు. ప్రస్తుతం ఆమె బ్లాక్‌బెల్ట్‌లో సిక్స్త్ డాన్.

### షీ టీమ్‌లకు కోచింగ్!

తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రత కోసం షీ టీమ్‌లను ఏర్పాటు చేయడంతో లక్ష్మి ప్రాధాన్యం మరింత పెరిగింది. మహిళా ఐపీఎస్‌ల నేతృత్వంలో విధులు నిర్వర్తించే షీ టీమ్‌లకు శిక్షణ ఇవ్వడానికి లక్ష్మికి అవకాశం వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌ను నేర్పించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు కూడా లక్ష్మికి ప్రాధాన్యం లభించింది. ఆమె చేత పాఠశాలల్లో పని చేస్తున్న పీఈటీలకు శిక్షణ ఇప్పించారు. మూడేళ్ల క్రితం జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన 'సంఘటిత సబల' కార్యక్రమం గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించడం వెనుక లక్ష్మి కృషి, పట్టుదల ఉన్నాయి. ఆమె భర్త సహకారం ఉంది.

**– ఇల్లందుల వెంకటేశ్వర్లు, సాక్షి, జనగామ**
**ఫొటోలు: గోవర్ధనం వేణుగోపాల్**

### పోకిరీల భయంతో చదువు ఆగకూడదు

**చి**న్నప్పటి నుంచే పోలీసు ఆఫీసర్ కావాలనే కోరిక బలంగా ఉండేది. సుమన్, విజయశాంతి, సినిమాలను చూసి అప్పుడే కరాటే నేర్చుకోవడం ప్రారంభించాను. పదో తరగతి చదువుతున్న సమయంలోనే నా స్నేహితురాలిని కొందరు పోకిరీలు వేధించడంతో భయంతో చదువును ఆపేసి ఇంటి వద్దనే ఉండిపోయింది. ఆ సంఘటన తరువాత ప్రతి విద్యార్థినీ ధైర్యంగా చదువుకోవడానికి స్వేచ్ఛగా వెళ్లాల్సిన ఆత్మ విశ్వాసాన్ని నెలకొల్పాలని భావించాను. ఆ విధిని నా భర్తతో కలిసి నెరవేరుస్తున్నాను.

**– లక్ష్మి**

ఆత్మరక్షణ



సంఘటిత సబల కార్యక్రమంలో బాలికలు (ఫైల్ ఫొటో)

లక్ష్మి, కరాటే ఇన్‌స్ట్రక్టర్

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
సోమవారం ॥ 3-2-2020


చిరంజీవి

## యాక్షన్

మాట వినని రౌడీలకు చేత్తో సమాధానం చెబుతున్నారు చిరంజీవి. మరి దెబ్బలు తిన్నాకైనా మాట విన్నారా? ఆ సంగతి సినిమా చూసి తెలుసుకోవాలి. కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. నిరంజన్ రెడ్డి, రామ్ చరణ్ నిర్మిస్తున్నారు. ఇందులో త్రిష కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాకు సుమారు 20 కోట్ల ఖర్చుతో హైదరాబాద్ నగర శివార్లలో ఓ భారీ సెట్‌ను నిర్మించారని తెలిసింది. సినిమాలోని కీలక సన్నివేశాలను ఆ సెట్లో చిత్రీకరిస్తారట. ఆగస్ట్‌లో ఈ సినిమా విడుదల కానుంది.

# కురుమలైలో నారప్ప


వెంకటేష్

తమిళనాడులో ఫైట్ చేస్తున్నారు 'నారప్ప'. వెంకటేష్ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో డి.సురేష్‌బాబు, కలైపులి ఎస్.థాను సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నారప్ప'. ఈ చిత్రంలో ప్రియమణి, అమలాపాల్ కథానాయికలుగా నటిస్తున్నారని తెలిసింది. తమిళంలో హిట్ సాధించిన 'అసురన్' చిత్రానికి 'నారప్ప' తెలుగు రీమేక్. అనంతపురం జిల్లా ఉరవకొండ ప్రాంతంలోని పాల్తూరు గ్రామంలో ఇటీవల 'నారప్ప' చిత్రీకరణ మొదలైంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తమిళనాడులోని కురుమలైలో జరుగుతోంది. స్టంట్ కొరియో గ్రాఫర్ పీటర్ హెయిన్స్ నేతృత్వంలో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నారు. తమిళనాడు షెడ్యూల్ పూర్తి కాగానే తిరిగి అనంతపురంలో 'నారప్ప' చిత్రీకరణ మొదలవుతుంది. 'నారప్ప' చిత్రాన్ని వేసవిలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ.

# మనతో పాటు ఇంటికి వచ్చే చిత్రం జాను

''96' సినిమాను రీమేక్ చేయొద్దు అని' రాజు గారికి నా అభిప్రాయం చెప్పాను. శర్వానంద్, సమంత చేస్తున్నారని తెలిసిన తర్వాత ఎప్పుడెప్పుడు చూస్తానా? అని ఎదురుచూస్తున్నా'' అని నాని అన్నారు. శర్వానంద్, సమంత జంటగా సి.ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జాను'. తమిళ చిత్రం '96'కి ఇది తెలుగు రీమేక్. 'దిల్' రాజు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ-రిలీజ్ వేడుకలో 'దిల్' రాజు మాట్లాడుతూ – ''జాను' పాత్రలో సమంతను తప్ప ఎవర్నీ ఊహించుకోలేకపోయాను. శర్వా కూడా '96' చూసి సూపర్ అన్నాడు. ఒరిజినల్ '96' చేసిన ప్రేమ్‌కుమార్, టెక్నీషియన్స్ అందరూ ఈ సినిమాకు పని చేశారు. షూటింగ్ సమయంలో శర్వా ప్రయాణిస్తున్న జీపు బోల్తా పడింది. దేవుడి దయ వల్ల ఏమీ కాలేదు. ఆ తర్వాత మరో ఇబ్బంది. ఒక్కో అడ్డంకి దాటుకొని సినిమా పూర్తి చేశాం. ఈ సినిమా చూసి ప్రేక్షకులు ఎన్నో జ్ఞాపకాల్ని ఇంటికి తీసుకెళ్తారు'' అన్నారు. ''ఫ్యాన్స్‌ని నిరుత్సాపరచకూడదని ప్రతి సినిమాకు భయపడుతుంటా. ప్రతి రోజు మొదటి సినిమా షూటింగ్‌లానే భావిస్తాను. ప్రతిరోజూ షూటింగ్‌లో మ్యాజిక్ జరుగుతుండేది. ప్రేమ్‌కుమార్ మ్యాజిక్‌ని రిపీట్ చేశారు. ఫ్యాన్స్ అందరూ గర్వంగా ఫీలయ్యేలా – **నాని** చేస్తాననే అనుకుంటున్నాను'' అన్నారు సమంత. ''నిత్యామీనన్, సాయి పల్లవి, సమంత వంటి హీరోయిన్స్‌తో నటించేటప్పుడు చాలా అలర్ట్‌గా ఉండాలి. లేకపోతే సన్నివేశాలను తినేస్తారు. ప్రతీ సినిమా వంద శాతం చెక్ చేసుకుంటుంది సమంత. అందుకే సూపర్‌స్టార్ అయింది. ఆరు నుండి తొంభై ఏళ్ల వరకూ అందరికీ 'జాను' సినిమా కనెక్ట్ అవుతుంది. ఇంత మంచి సినిమా నాకు ఇచ్చిన టీమ్ అందరికీ థ్యాంక్స్. నానితో నా స్నేహం సారథి స్టూడియోస్‌లో ప్రారంభం అయింది. నేను, నరేశ్, నాని చాలా ట్రిప్స్‌కి వెళ్లేవాళ్లం'' అన్నారు శర్వానంద్. ''నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో శర్వా నా తొలి ఫ్రెండ్. శర్వానంద్, సమంత ఇద్దరూ బెస్ట్ పెర్ఫార్మర్స్. పోటీ పడి నటించారు. శర్వానంద్ చేసే ప్రతి సినిమాలో తనకు మంచి పేరు వస్తుంది. స్యామ్ ఎంచుకుంటున్న సినిమాలు చూసి గర్వపడుతున్నాను. రాజుగారికి ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవ్వాలి. కొన్ని సినిమాలు ఎంజాయ్ చేస్తాం. కొన్ని సినిమాలను ఇంటికి తీసుకెళ్తాం. 'జాను' మీతో పాటు ఇంటికి తీసుకువెళ్లే సినిమా'' అన్నారు నాని. దర్శకుడు వంశీ పైడిపల్లి, నటీనటులు సాయి కిరణ్, గౌరి మాట్లాడారు.


'దిల్' రాజు, శర్వానంద్, సమంత, నాని, శిరీష్

# వాటే బ్యూటీ

'భీష్మ' టీమ్‌కి బై బై చెప్పేశారు నితిన్. వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ హీరోగా నటించిన చిత్రం 'భీష్మ'. ఇందులో రష్మికా మందన్నా కథానాయికగా నటించారు. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేశారు నితిన్. నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. అలాగే ఆదివారం ఈ చిత్రంలోని 'వాటే వాటే వాటే బ్యూటీ...' అనే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఈ పాటకు జానీ మాస్టర్ కొరియోగ్రాఫర్. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. ధనుంజయ్, అమల చేబోలు ఈ పాటను ఆలపించారు. మహతి స్వర సాగర్ సంగీతం అందించారు. 'భీష్మ' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది.


రష్మిక, నితిన్

# పెళ్లి కుదిరింది

'అర్జున్ సురవరం' సూపర్ సక్సెస్‌తో మంచి జోష్‌లో ఉన్న హీరో నిఖిల్, త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. పల్లవి వర్మ అనే డాక్టర్‌తో నిఖిల్ నిశ్చితార్థం గోవాలో జరిగింది. ఏప్రిల్ 16న పెళ్లి తేదీని కూడా ఫిక్స్ చేశారు. పల్లవి వర్మ, నిఖిల్ కొంత కాలంగా ప్రేమలో ఉన్నారు. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకోబోతున్నారు. పల్లవి వర్మది భీమవరం అని తెలిసింది.


నిఖిల్


ఐశ్వర్యా రాజేష్, విజయ్ దేవరకొండ

# ట్రైలర్ రెడీ

విజయ్ దేవరకొండ హీరోగా క్రాంతి మాధవ్ దర్శకత్వంలో కేయస్ రామారావు నిర్మించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. ఈ చిత్రంలో రాశీఖన్నా, ఐశ్వర్యా రాజేష్, కేథరీన్, ఇజబెల్లా నటించారు. ఈ సినిమాలో నాలుగు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు విజయ్. ఈ లుక్స్ ఉన్న మిస్టరీకి ఈ గురువారం క్లూ దొరుకుతుంది. ఈ చిత్రం ట్రైలర్ గురువారం విడుదల కానుంది. 'వరల్డ్ ఫేమస్ లవర్' చిత్రం ఈ నెల 14న విడుదల కాబోతోంది.


పాయల్ రాజ్‌పుత్

# హీరోబజన్ సింగ్


హర్భజన్ సింగ్

ఇండియన్ టీమ్ స్పిన్ బౌలర్ హర్భజన్ సింగ్ తన స్పిన్ బౌలింగ్‌తో మ్యాజిక్ చేసేవారు. ఈ మధ్యే నటుడిగా మారి యాక్టింగ్ మొదలుపెట్టారు. తమిళ నటుడు సంతానం నటిస్తున్న 'డిక్కీలోనా' సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా లీడ్ యాక్టర్‌గా ఓ సినిమా చేస్తున్నారు. 'ఫ్రెండ్‌షిప్' అనే టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఒక క్రికెటర్ లీడ్ యాక్టర్‌గా నటించడం ఇదే తొలిసారి అని చిత్రబృందం పేర్కొంది. జేపీఆర్, శ్యామ్ సూర్య ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది.

## ఫైటర్ పైలెట్

పాకిస్తాన్ జైలులో ఖైదీగా ఉన్న ఓ భారతీయ బాక్సర్ ఎలా బయటపడ్డాడు? అతనికి ఎవరు సహాయం చేశారు? అసలు.. అతను ఖైదు కావడానికి దారితీసిన పరిస్థితులు ఏంటి? అన్న అంశాల నేపథ్యంలో జయంత్ సి. పరాన్జి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'నరేంద్ర'. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఇందులో 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్ ఫీమేల్ ఫైటర్ పైలెట్‌గా నటిస్తున్నారు. ''పాకిస్తాన్ జైలులో ఖైదీ అయిన భారతీయ మాజీ బాక్సర్‌గా నీలేష్ నటిస్తున్నారు. స్వేచ్ఛా పోరాటానికి మద్దతు ఇచ్చే మానవ హక్కుల కార్యకర్తగా బ్రెజిలియన్ బ్యూటీ ఇసాబెల్లా లియేటి కనిపిస్తారు. భారత ఖైదీలను రక్షించే ప్రయత్నంలో తనను తాను త్యాగం చేసుకునే ఆఫ్గన్ ఖైదీ పాత్రను డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్ ద గ్రేట్ ఖలి చేశారు. ఈ సినిమాలోని ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. రామ్ సంపత్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

# 22 సినిమా హిట్ కావాలి – నాగార్జున


రూపేష్, నాగార్జున, శివ, నాగచైతన్య

రూపేష్ కుమార్, సలోని మిశ్రా జంటగా బి. శివకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '22'. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన నాగార్జున మాట్లాడుతూ–''బి.ఎ రాజు, జయగార్ల అబ్బాయి శివ దర్శకుడు అవుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. '22' సినిమా టీజర్ చూశాను. ఆసక్తికరంగా ఉంది.పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అన్నారు. నాగార్జున విడుదల చేసిన టీజర్ వీడియో, '22' క్యాలెండర్‌ను విడుదల చేసిన దర్శకుడు మారుతి మాట్లాడుతూ–''కొత్తవారిని ప్రోత్సహించడంలో నాగార్జునగారు ముందుంటారు. కొత్తగా దర్శకులు కావాలనుకునేవారు తొలుత ఓ ప్రేమకథను తీయాలనుకుంటారు. కానీ శివ ఓ క్రైమ్ థ్రిల్లర్‌ను డైరెక్ట్ చేశాడంటే అతని మెచ్యూరిటీ లెవల్ తెలుస్తోంది. హీరోగా రూపేష్ చాలా కష్టపడ్డాడనిపిస్తోంది. ఫస్ట్ డే మార్నింగ్ షో చూడాలనుకుంటున్నాను'' అన్నారు మారుతి. ''టీజర్‌ను చూసినవారు శివ పెద్ద దర్శకుడు అవుతాడని అంటున్నారు. అది తప్పక జరగాలని కోరుకుంటున్నాను. శివకు జయ ఆశీస్సులు ఉంటాయి'' అన్నారు బి.ఎ రాజు. ''నాగార్జునగారు టీజర్ చూసి ఇంప్రెస్ అయ్యారు'' అన్నారు శివ. ఈ కార్యక్రమంలో హీరోయిన్ సలోని మిశ్రా, నిర్మాత కొండా కృష్ణంరాజు, ఆదిత్య మ్యూజిక్ ప్రతినిధులు మాధవ్, నిరంజన్ రెడ్డి, కో డైరెక్టర్ పుల్లారెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ పెద్దిరాజు, సినిమాటోగ్రాఫర్ రవికిరణ్, నటుడు కృష్ణచైతన్య, ఎడిటర్ శ్యామ్ పాల్గొన్నారు.

# పద్మశ్రీకి ఏక్తా అర్హురాలు – కేతిరెడ్డి

ప్రముఖ బాలీవుడ్ నటుడు జితేంద్ర కుమార్తె, నిర్మాత ఏక్తా కపూర్‌కి ఇటీవల పద్మశ్రీ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఆమెకు అభినందనలు తెలియజేశారు దర్శక–నిర్మాత, తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి. ''ఈ అవార్డుకి ఏక్తా అర్హురాలు. చిన్న వయసులో పద్మశ్రీ పురస్కారం అందుకోవడానికి ఆమె పట్టుదల, క్రమశిక్షణే కారణం'' అన్నారు కేతిరెడ్డి. ఆయన తీస్తున్న 'శశి లలిత' (జయలలిత బయోపిక్) చిత్రానికి ఆశీస్సుల కోసం షిరిడీ సందర్శించారు కేతిరెడ్డి.


కేతిరెడ్డి, జితేంద్ర, ఏక్తా కపూర్


అంజలి

# వేసవిలో ఆనందభైరవి

అంజలి, లక్ష్మీరాయ్, అదిత్ అరుణ్ ప్రధాన పాత్రధారులుగా కర్రి బాలాజీ దర్శకత్వంలో ఎమ్‌వీవీ సత్యనారాయణ సమర్పణలో బి. తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి నిర్మాణంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆనందభైరవి'. ఈ సినిమా చిత్రీకరణ యాభై శాతం పూర్తయింది. ఈ సందర్భంగా కర్రి బాలాజీ మాట్లాడుతూ–''అంజలి, లక్ష్మీరాయ్, అదిత్‌ల కెమిస్ట్రీ చూస్తుంటే నా కళ్లముందు సక్సెస్ కనిపిస్తోంది. సమాజంలో ఉన్న ఎన్నో నిజజీవిత పాత్రలు మా సినిమాలో కనపడతాయి'' అన్నారు. ''ఆనంది పాత్రను పోషిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు అంజలి. ''నేను నటిస్తున్న భైరవి పాత్ర చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ముంబైలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను'' అన్నారు లక్ష్మీరాయ్. ''రొమాంటిక్ అబ్బాయి పాత్రలో నటించా'' అన్నారు అరుణ్. ''నెక్ట్స్ షెడ్యూల్స్ హైదరాబాద్, చెన్నైలో జరగనున్నాయి. వేసవిలో సినిమాను విడుదల చేద్దాం అనుకుంటున్నాం'' అన్నారు నిర్మాతలు. సాయికుమార్, రాశి, మురళీ శర్మ, ఎమ్‌వీవీ సత్యనారాయణ, బ్రహ్మాజీ, కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ.



సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
3-2-2020

పరిపరిశోధన

# తేనెటీగలను కాపాడుకునేందుకు కొత్త మార్గం...



తేనెటీగలనేవి ఈ భూమ్మీద లేని మరుక్షణం మానవజాతికి అంతం మొదలైనట్లేనని ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ ఎప్పుడో చెప్పారు. కానీ.. రసాయన మందుల విచ్చలవిడి వాడకం కారణంగా చాలా చోట్ల తేనెతుట్టెల్లోని ఈగలు అకస్మాత్తుగా గంపగుత్తగా చనిపోవడం మనం చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ఇలాంటి తేనెతుట్టెలు కుప్పకూలడాన్ని నియంత్రించేందుకు టెక్సస్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఓ వినూత్నమైన పరిష్కారాన్ని సూచిస్తున్నారు. బ్యాక్టీరియాలో కొన్ని మార్పులు చేసి వాడటం ద్వారా తేనెతుట్టెలు కుప్పకూలిపోవడాన్ని నివారించవచ్చునని వీరు చెబుతున్నారు. వరోరా మైట్స్ అనే పరాన్నజీవులు తేనెటీగల వీపులకు అతుక్కుని కొవ్వులను తినేస్తూంటాయని, ఫలితంగా ఒక దశ దాటిన తరువాత తేనెటీగలన్నీ మరణిస్తాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త సీన్ లియోనార్డ్ అనే శాస్త్రవేత్త తెలిపారు. పైగా ఈ పరాన్న జీవులు డిఫార్మ్‌డ్ వింగ్ వైరస్ అనే వ్యాధిని వ్యాప్తి చేసేందుకూ దోహదపడుతూంటాయని ఆయన చెప్పారు.

ఈ రెండు సమస్యలను పరిష్కరించేందుకు తాము స్నోడ్‌గ్రాసిల్లా అల్వీ అనే బ్యాక్టీరియాను ఎంచుకున్నామని, తేనెటీగల రోగ నిరోధక శక్తిని ఉత్తేజితం చేసే వ్యవస్థను ఈ బ్యాక్టీరియాలోకి జొప్పించి ఉపయోగిస్తే వైరస్ మరణిస్తుందని.. ఇది కాస్తా వరోరా మైట్స్‌పై ప్రతికూల ప్రభావం చూపి అవి తమంతట తామే చచ్చిపోయేలా చేస్తుందని వివరించారు. ఆధునికీకరించిన బ్యాక్టీరియాను తాము విజయవంతంగా పరీక్షించి చూశామని తెలపారు. పదిరోజుల్లోనే వరోరామైట్స్ 70 శాతం వరకూ తగ్గిపోయాయని చెప్పారు.

# స్వల్పకాలిక కీటో డైట్‌తోనే మెరుగైన ఫలితాలు...



పిండిపదార్థాలకు బదులుగా కొవ్వులను ఎక్కువగా తీసుకునే కీటో ఆహార పద్ధతిని మీరూ పాటిస్తున్నారా? అయితే ఈ వార్త మీ కోసమే. కీటో డైట్ అనేది అప్పుడప్పుడూ నిర్ణీత కాలావధిలో పాటించడం ద్వారానే మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చునని యేల్ యూనివర్శిటీ చెబుతోంది. ఎలుకలపై జరిపిన పరిశోధనల ద్వారా తాము ఈ అంచనాకు వచ్చినట్లు ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు తెలిపారు. ఇంకోలా చెప్పాలంటే ఏకబిగిన ఎక్కువ కాలం పాటు వాడటం వల్ల దుష్ప్రభావాలు ఎక్కువేనని ఈ పరిశధన చెబుతోంది. నేచర్ మెటబాలిజమ్ జర్నల్‌లో ప్రచురితమైన దాని ప్రకారం.. ఈ కీటోజెనిక్ ఆహార పద్ధతి ఎలుకల్లోని గామా డెల్టా టీ కణాలపై ప్రభావం చూపుతోంది. కీటోజెనిక్ దశకు చేరినప్పుడు కీటోన్లు శరీరమంతా విస్తరిస్తాయి.

వారం రోజుల వరకూ కీటో ఆహారం ద్వారా రక్తంలో చక్కెర మోతాదులు, మంట/వాపుల్లాంటివి తగ్గినప్పటికీ అంతకంటే ఎక్కువ కాలం ఆచరించడం వల్ల ఈ లాభాలన్నీ నష్టాలుగా మారే అవకాశముంది. గామా డెల్టా టీ కణాలు తగ్గిపోవడం వల్ల మళ్లీ బరువు పెరగడం మొదలవుతుందని పరిశోధకులు తెలిపారు. గత ఏడాది కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు కూడా కీటో డైట్ శరీరంలో సూక్ష్మపోషకాలను తగ్గించి వేస్తుందనే అంచనా ఇచ్చిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం.

పరిచయం డాక్టర్ బిందు మెనన్



గత ఐదేళ్లుగా 'న్యూరాలజీ ఆన్ వీల్స్'తో 29 గ్రామాలలో ఉచిత క్యాంపులు నిర్వహించిన డాక్టర్ బిందు నిన్న (ఆదివారం) 30వ గ్రామంగా నెల్లూరు జిల్లా వాకాడు మండలం గొల్లపాలెంలో పర్యటించారు.

# ఊరికి వరం

**నెల్లూరు, రామ్మూర్తిపేటలో భార్గవి నంబియార్ బిల్డింగ్. అందులోనే ఉంది యాక్సన్ న్యూరో అండ్ రీహాబ్ కేర్. డాక్టర్ గదిలో మదర్ థెరిసా ఫొటో చూపరులను ఆకర్షిస్తోంది. ''నిస్వార్థమైన సేవకు ప్రతిరూపం మదర్. ఎంత చేసినా ఆమెను చేరుకోవడం అసాధ్యం. కానీ ఆమెను చూస్తూ ఉంటే ఆమె చేసిన సేవలో ఒక్క వంతు అయినా చేయగలనేమోనని ఆశ. రోజూ మదర్ ఫొటో చూస్తూ ప్రేరణ పొందుతుంటాను'' అని చిరునవ్వుతో అన్నారు డాక్టర్ బిందు మెనన్.**

డాక్టర్ బిందు మెనన్ తండ్రి రామచంద్ర నంబియార్‌ది కేరళ. ఆయన భోపాల్‌లోని బిహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగం చేసి అక్కడే స్థిరపడ్డారు. బిందు మెనన్ పుట్టింది, పెరిగింది భోపాల్‌లోనే. ఎంబీబీఎస్ తర్వాత గ్వాలియర్, ముంబయి, బెంగళూరుల్లో న్యూరాలజీలో స్పెషల్ కోర్సులు చేసి తిరుపతి స్విమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. చేరిన తొలినాళ్లలో ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకున్నారు డాక్టర్ మెనన్.

''అది 2002. తిరుపతిలోని స్విమ్స్‌లో (శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఓపీ చూస్తున్నాను. పేషెంట్‌లు తమ కష్టాన్ని తెలుగులో చెప్తున్నారు. ఇంగ్లిష్ వచ్చిన ఒక నర్స్ అనువదిస్తోంది. పేషెంట్ పది వాక్యాల్లో చెప్పిన విషయాన్ని ట్రాన్స్‌లేటర్ రెండు వాక్యాల్లో ముగిస్తోంది. ట్రాన్స్‌లేటర్ చెప్తున్న విషయాలతోపాటు పేషెంట్ మాటల్లో వినిపిస్తున్న బాధను మనసుతో విని వైద్యం చేస్తున్నాను. సంతృప్తిగా అనిపించడం లేదు. పేషెంట్ – డాక్టర్ మధ్య మరో మనిషి ఉండకూడదు, ట్రాన్స్‌లేటర్ అయినా సరే.. ఉండకూడదు. వ్యాధి చిన్నది కావచ్చు పెద్దది కావచ్చు, కానీ ఆ వ్యాధి కారణంగా రోగి మానసికంగా పడే ఆందోళన ఎవరికి వాళ్లకు అదే పెద్దది. ఆ బాధను డాక్టర్లు పేషెంట్ భాషలోనే వినగలగాలి. అప్పుడే పేషెంట్‌కి డాక్టర్ మీద నమ్మకం కలుగుతుంది. ఆ నమ్మకమే అసలైన వైద్యం. డాక్టర్ తన వృత్తికి న్యాయం చేయగలిగేది పేషెంట్ భాషలో మాట్లాడగలిగినప్పుడే. అందుకే తెలుగు నేర్చుకున్నాను. ఉద్యోగంలో చేరిన ఆరు నెలల్లో అనువాదకుల అవసరం లేకుండా వైద్యం చేయగలిగాను. ఆరేళ్ల తర్వాత నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజ్‌కి వెళ్లాను. ప్రస్తుతం అపోలో హాస్పిటల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాను'' అని తెలిపారు డాక్టర్ మెనన్.

## పేదల దగ్గరకు దారి

అపోలో హాస్పిటల్ ఆమెను సంపన్నుల డాక్టర్‌ను చేసింది. అప్పటి వరకు ఆమె దగ్గర వైద్యం చేయించుకున్న పేదవాళ్లు ఆమె గురించి అడగడం, ఆమె లేరని తెలిసి అసంతృప్తికి లోనవుతున్న సమాచారం ఆమెకు చేరుతూనే ఉంది. ఆమె దగ్గరే వైద్యం చేయించుకోవాలని ఉన్న పేదవాళ్లను.. ఆమె ఉన్న పెద్ద హాస్పిటల్ గేటు కూడా భయపెడుతుంటుంది. అప్పుడు వచ్చిన ఆలోచనే న్యూరాలజీ ఆన్ వీల్స్. తనతో వైద్యం చేయించుకోవాలనుకుంటున్న పేద వాళ్ల దగ్గరకు తానే వెళ్లడానికి ఆమె స్వయంగా నిర్మించుకున్న మార్గమే 'న్యూరాలజీ ఆన్ వీల్స్'.

## తిరిగి పట్టాలెక్కుతున్న జీవితాలు

''డాక్టర్ చెప్పే మాటలు వినాలని, డాక్టర్‌తో తన కష్టం చెప్పుకోవాలని కోరుకుంటారు పేషెంట్‌లు. అందుకే గ్రామాలకు వెళ్లి వైద్యం చేస్తున్నాను. గ్రామానికి వెళ్లినప్పుడు ముందుగా నరాల సమస్యలు ఎన్ని రకాలుంటాయో వివరిస్తాను. ఆ తర్వాత ఉచితంగా పరీక్షలు చేస్తాను. మందులు కొనుక్కోలేని వాళ్లను బిందు మెనన్ ఫౌండేషన్ ద్వారా దత్తత చేసుకుంటాను. వాళ్లు పూర్తిగా కోలుకునే వరకు నెలనెలా మందులు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఇస్తున్నాం. అందుకే నేను చేస్తున్న పనికి 'వియ్ రీచ్, వియ్ టీచ్, వియ్ ట్రీట్' అనే థీమ్‌ను రూపొందించుకున్నాను. మా వైద్యసేవ ద్వారా వార్ధక్యంలో ఉన్న వాళ్లు స్వస్థత పొంది ఒకరి మీద ఆధారపడకుండా తమ పనులు తాము చేసుకోగలిగిన స్థితికి చేరుతున్నారు. ఇంట్లో సంపాదించే వ్యక్తి పక్షవాతానికి గురైతే ఆ కుటుంబం తలకిందులైపోతుంది. అలాంటి పేషెంట్‌లు పూర్తిగా కోలుకుని తిరిగి కుటుంబ బాధ్యతలు చేపట్టినప్పుడు ఆ ఇంట్లో అందరి జీవితాలూ తిరిగి గాడిన పడ్డాయని సంతోషంగా ఉంటుంది. డాక్టర్‌గా నేను గెలిచానని పించే సందర్భాలవి'' అన్నారు బిందు మెనన్.

> **అవార్డులు**
> - 11 అంతర్జాతీయ, 24 జాతీయ అవార్డులు
> - 'వరల్డ్ స్ట్రోక్ అవార్డు'
> - ఎపిలెప్సీ లీడర్‌షిప్ అవార్డు
> - సాక్షి ఎక్సలెన్స్ అవార్డు (హెల్త్‌కేర్ విభాగం)

## పల్లెలకు వైద్యరథం

డాక్టర్ బిందు మెనన్.. 'ఎపిలెప్సీ హెల్ప్' యాప్ డెవలప్ చేయించారు. పేషెంట్‌లు మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పేషెంట్ వివరాలు యాప్‌లో నమోదైన తర్వాత రెగ్యులర్ చెకప్ చేసుకోవాల్సిన తేదీతో పాటు ఇతర ఆరోగ్య సేవలకు ఫోన్‌లో అలర్ట్ వస్తుంది. ఎమర్జెన్సీ నంబర్ కూడా ఉంటుంది. మలయాళం, హిందీ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో పేషెంట్ నమోదు చేసుకున్న వివరాలు గోప్యంగా ఉంటాయి. ఇది కాకుండా మైగ్రేన్, స్ట్రోక్, ఎపిలెప్సీ టెలీ అవేర్‌నెస్ టోల్ ఫ్రీ నంబర్ 1800 10 20 237 కూడా అందుబాటులో ఉంది. దీంతో పాటు ఆమె వెన్నునొప్పి, మెడనొప్పి, చేతులు తిమ్మిర్లు పట్టడం వంటి అనేక నరాల సంబంధిత సమస్యల పట్ల ప్రాథమిక సమాచారంతో కూడిన వీడియోలను రికార్డు చేశారు. ఒక్కొక్కటి ఐదు నిమిషాల నిడివితో ఉన్న ఈ హెల్త్ అవేర్‌నెస్ వీడియోలను వేలాది మంది వీక్షిస్తున్నారు. పార్కిన్సన్స్ వ్యాధిగ్రస్థుల కోసం ఒక సపోర్టు గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఇవన్నీ చదువుకున్న వాళ్లు, టెక్నాలజీని అందిపుచ్చుకున్న వాళ్లలో ఆరోగ్య చైతన్యం కల్పించడం కోసం ఆమె చేస్తున్న పనులు. ఇవన్నీ ఒక మోస్తరు అవగాహన ఉన్న వాళ్లను చేరే సాధనాలు. అయితే న్యూరాలజీ సమస్య గురించి ఏ మాత్రం తెలియని వాళ్లకు నరాల వ్యాధుల పట్ల చైతన్యం కలిగించడం కోసం ఆమె స్వయంగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. టెక్నాలజీని పల్లె పల్లెకూ తీసుకెళ్లాలని కంకణం కట్టుకున్నారు. న్యూరాలజీ ఆన్ వీల్స్ ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో 30 గ్రామాల్లో పర్యటించింది. ''న్యూరాలజీ చదివిన డాక్టర్లు అందరూ నగరాలకే పరిమితమై పోతే, గ్రామాల్లో వైద్యం అందేదెలాగ'' అన్నారామె. పక్షవాతం పేషెంట్‌లను నగరాలకు తీసుకెళ్లి వైద్యం చేయించుకోగలిగిన స్థోమత అందరికీ ఉండదు. హెల్త్ అవేర్‌నెస్ లేకపోవడంతోపాటు ఆర్థిక పరిస్థితులు అనుకూలించని కారణంగా పక్షవాతానికి గురైన ఎన్నో జీవితాలు మంచానికే పరిమితమైపోతున్నాయి. వాళ్లను తిరిగి నడిపించడానికి ఆమె తీసుకున్న నిర్ణయమే 'న్యూరాలజీ ఆన్ వీల్స్'. ఈ సేవలందిస్తున్న బిందు మెనన్ ఫౌండేషన్ 'సౌత్ ఈస్ట్ ఏషియా, స్ట్రోక్ ఆర్గనైజేషన్‌కు మెంబర్‌గా నియామకమైంది.



వృద్ధుడికి ధైర్యం చెబుతున్న డాక్టర్ మెనన్

## చైతన్యమే నివారణోపాయం

వైద్యం ఎంత విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ పేదరికం కూడా అదే స్థాయిలో వికటాట్టహాసం చేస్తోంది. పేదరికానికి అవగాహన లేమి కూడా తోడైతే ఇక హెల్దీ సొసైటీ అనే మాట కలలకే పరిమితమవుతుంది. ''ఆహారపు అలవాట్ల మార్పు కారణంగా ముప్పై– నలభై ఏళ్లకే హై బీపీ, షుగర్ వచ్చేస్తున్నాయి. ధూమపానం, మద్యపానం అనే మరో రెండు వ్యసనాలు అలవాటై పోయి ఉంటున్నాయి, దేహానికి వ్యాయామం ఉండదు. ఇన్ని సవాళ్ల తో జీవితాన్ని నెట్టుకొస్తున్న దేహం ఏ రోజైనా కుప్పకూలిపోవచ్చు. అందుకే హైబీపీ దశలోనే వాళ్ల జీవనశైలిని మార్చగలిగితే పక్షవాతాన్ని నివారించవచ్చు. వ్యాధుల పట్ల జనంలో చైతన్యం కలిగిస్తే, ఆ వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చు. నేను చేస్తున్న ప్రయత్నం అదే'' అన్నారు డాక్టర్ బిందు మెనన్.




వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాలతో ప్రత్యేకంగా తయారైన 'న్యూరాలజీ ఆన్ వీల్స్' వాహనంలో గొల్లపాలెం గ్రామస్థురాలికి చికిత్స చేస్తున్న డాక్టర్ బిందు మెనన్

– వాకా మంజులా రెడ్డి
ఫొటోలు: ఆవుల కమలాకర్, సాక్షి, నెల్లూరు

పునఃపరిమళం

# వాడిన పూలు వికసిస్తాయి

దేవుని పూజ కోసం, శుభకార్యాల కోసం ఉపయోగించిన పూలు, స్త్రీలు తలలో పెట్టుకున్నాక వాడిపోయిన పూలు ఎందుకూ పనికి రాకుండా డస్ట్ బిన్నుల్లోనూ, తర్వాత డంపింగ్ యార్డుల్లోనూ చేరుతుండడం అందరికీ తెలిసింది. అయితే వీటిని తిరిగి ఉపయోగకరం చేస్తున్నారు వరంగల్ మహిళలు. గతంలో వరంగల్‌లో మునిసిపల్ కమిషనర్‌గా పని చేసిన రవికిరణ్ వాడిన పువ్వులను రీసైక్లింగ్ చే సి తిరిగి ఏదైన వస్తువు తయారీలో వినియోగించేలా ఆలోచించండి అని మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలనకు మిషన్) అధికారులను ఆదేశించారు. మెప్మా వారు గూగుల్‌లో వెదికారు. నాగ్‌పూర్‌లో వేస్ట్ ఫ్లవర్స్‌తో ధూప్ స్టిక్స్, ప్రమిదలు తయారు చేస్తున్నారని తెలుసుకున్నారు. ఇదే విషయాన్ని కమిషనర్‌కు చెప్పారు. దీంతో అప్పటి కమిషనర్ డ్వాక్రా మహిళ సంఘాలకు వీటి తయారీపై రెండు రోజుల పాటు శిక్షణ ఇప్పించారు. వారిలో ఆదర్శ పట్టణస్థాయి సమాఖ్య (టిఎల్ఎఫ్)కు చెందిన నలుగురు సభ్యురాళ్ళు ధూప్ స్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. నాగపురి కల్పన, పల్లెబోయిన అనిత, కంది లక్ష్మి, జీ విజయలక్ష్మి బృందం ఈ యూనిట్‌ను రూ1.5 లక్షలు పెట్టుబడి పెట్టి విజయవంతంగా నడుపుతున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పూల దుకాణాల వారిని హెల్త్ ఆఫీసర్ సహకారంతో ఈ మహిళలు కలిశారు. వాడిపోయిన పువ్వులను వృథాగా పడేయకుండా వీరికి ఇవ్వాలని పూలదుకాణాల వారికి మున్సిపాలిటీ హెల్త్ ఆఫీసర్ రాజారెడ్డి విజ్ఞప్తి చేశారు. వృథాగా పడేసే పువ్వులను రెండు మూడు రోజులకు ఒక సారి వెళ్లి మహిళలు తీసుకొస్తున్నారు.

> **స్పందన బాగుంది**
>
> 
>
> మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నాం. నలుగురం కలిసి ఈ యూనిట్‌ను ప్రారంభించాం. ధూప్‌స్టిక్స్, దీపాంతలు తయారు చేస్తున్నాం. మేమే స్వంతగా మార్కెటింగ్ చేస్తున్నాం. త్వరలో దోమలనివారణకు సంబంధించి స్టిక్స్‌ను కూడా తయారు చేస్తాం. స్టాల్లలో విక్రయిస్తున్నాం. స్పందన బాగా ఉంది.
>
> – పల్లెబోయిన అనిత



● గులాబీ పువ్వుల నుంచి రెక్కలు వేరుచేస్తున్న మహిళలు

## గులాబి పువ్వులతో ధూప్ స్టిక్స్

మొదట తీసుకు వచ్చిన గులాబి పువ్వుల కాడలను తీసి వేసి రెక్కలను ఆరబెడతారు. ఇలా మూడు రోజుల పాటు ఎండిన తరువాత పువ్వుల రెక్కలను గ్రైండింగ్ చేస్తున్నారు. ఈ పొడిలో గంధం, గుగ్గిలం మైసాచ్చి, చందన చూర్ణాలను కలుపుతారు. ఈ పొడిని నీటితో కలిపి చిన్న పైప్‌ల ద్వారా ధూప్ స్టిక్స్‌ను తయారు చేస్తారు. వాటిని ఆరబెట్టి ప్యాక్ చేస్తున్నారు.

## దీపాంతలు


మూడు భాగాల పువ్వుల పొడి, ఒక భాగం బైండింగ్ పౌడర్ మిశ్రమంలో నీటిని కలిపి వివిధ రకాల దీపాంతలు తయారు చేసి, వాటికి రంగులు వేసి, పాకింగ్ చేసి విక్రయిస్తున్నారు.

## స్వంతగా మార్కెటింగ్

ఆదర్శ పట్టణ స్థాయి సమాఖ్యకు చెందిన వారు ప్రతి వారం మున్సిపాలిటీలో జరిగే గ్రీవెన్స్ సభల దగ్గర, స్వదేశీ మార్ట్‌ల దగ్గర స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే చిన్న చిన్న షాప్‌లలో విక్రయిస్తున్నారు. ధూప్ స్టిక్‌లు 10, ఒక స్టాండ్ కలిపి ప్రత్యేక ప్యాకింగ్ చేస్తున్నారు. దీనిని రూ 35లకు విక్రయిస్తున్నారు. 12 దీపాంతలు, శుభ్, లాభ్, స్వస్తిక్‌లతో కూడిన ప్యాకెట్‌ను రూ 200 లకు విక్రయిస్తున్నారు.



● దీపాంతలు



## పలువురు మహిళలకు ఉపాధి

ధూప్‌స్టిక్స్, దీపాంతాల తయారీ కేంద్రంలో పని చేసే మహిళలకు రోజువారి కూలి కింద ఒక్కో మహిళకు రూ. 100 ఇస్తారు. ఇలా రోజుకు 10 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు.

– గజవెల్లి షణ్ముఖ రాజు
సాక్షి, వరంగల్ రూరల్

గ్యాస్ట్రోఎంటరాలజీ కౌన్సెలింగ్స్

# నాకెందుకీ ఛాతీ నొప్పి?



**నా వయసు 43 ఏళ్లు. నాకు తరచూ ఛాతీ ఎడమ భాగంలో నొప్పి వస్తుండటంతో కార్డియాలజిస్టుకు చూపించుకున్నాను. వారు తగిన పరీక్షలు చేసి, గుండె సమస్య ఏమీ లేదన్నారు. కానీ నొప్పి మాత్రం తగ్గడం లేదు. దాంతో మరోమారు డాక్టరును కలిస్తే గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌కు చూపించమన్నారు. రాత్రివేళ నొప్పి మరీ ఎక్కువగా ఉంటోంది. ఈ నొప్పి ఎందుకొస్తోంది? తగ్గే మార్గం చెప్పండి.**

**– ఆర్. ఈశ్వర్‌రావు, అనకాపల్లి**

మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే మీరు ఆహారవాహికకు సంబంధించిన రిఫ్లక్స్ డిసీజ్‌తో బాధపడుతున్నట్లుగా అనిపిస్తోంది. అది స్థూలకాయంతో ఉండేవారిలో సాధారణంగా కనిపించే సమస్య. అయితే ప్రస్తుతం మీరు ఏవైనా మందులు వాడుతున్నారా, లేదా తెలుపలేదు. మీరు ఒకసారి ఎండోస్కోపీ పరీక్ష చేయించుకోండి. ఈ పరీక్ష వల్ల రిఫ్లక్స్ తీవ్రత తెలుస్తుంది. రాత్రివేళలల్లో నొప్పి ఎక్కువగా వస్తోందంటున్నారు కాబట్టి రాత్రి భోజనం చేసే ముందు కొన్ని మందులు వాడితే మంచి ఫలితం ఉంటుంది. దీంతోపాటు మీరు మీ రోజువారీ ఆహార నియమాల్లో కొన్ని మార్పులు చేసుకోవాలి. బరువును నియంత్రించుకోవడం, భోజనానికి, పడుకోవడానికి మధ్య ఒక గంటైనా వ్యవధి ఉండేలా చూసుకోవాలి. కొన్ని రకాల ఆహార పదార్థాలు వ్యాధి లక్షణాలు ఎక్కువయ్యేలా చేస్తాయి. అలాంటి పదార్థాలేమిటో గుర్తించి వాటికి దూరంగా ఉండాలి. ఈ సూచనలన్నీ పాటించాక కూడా మీ సమస్యకు పరిష్కారం కనిపించకపోతే మీకు దగ్గర్లోని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ను కలవండి. ఆయన ఇచ్చే మందులతో నొప్పినుంచి ఉపశమనం కలుగుతుంది.

# కడుపులోకి నీరు చేరుతోంది... సలహా ఇవ్వండి



**నాకు ఈమధ్య కొంతకాలంగా కడుపులో నీరు వస్తోంది. కాళ్లవాపులు కూడా వస్తున్నాయి. దగ్గర్లోని డాక్టర్‌ను సంప్రదిస్తే మందులు ఇచ్చారు. రెండు సమస్యలూ తగ్గిపోయాయి. కానీ కొన్ని రోజుల్లోనే పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. మందులు వాడితేనే తగ్గుతోంది. నేను దాదాపు ప్రతిరోజూ ఆల్కహాల్ తీసుకుంటాను. దానివల్ల ఈ సమస్య వస్తోందా? జీవితాంతం మందులు వాడాల్సిన అవసరం ఉంటుందా? ఏం చేయాలో తగిన సలహా ఇవ్వగలరు.**

**– డి. రాజారావు, ఖమ్మం**

సాధారణంగా కిడ్నీలో సమస్య వల్ల కాళ్లలో వాపు కనిపిస్తుంది. కడుపులో నీరు చేరడం కూడా ఉంటుంది. కాలేయం, గుండె జబ్బులు ఉన్నవారిలో కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. మీరు దాదాపు ప్రతిరోజూ ఆల్కహాల్ తీసుకుంటున్నానని చెబుతున్నారు కాబట్టి ఇది ముమ్మాటికీ కాలేయం వల్ల వచ్చిన సమస్యే అయి ఉంటుంది. మీరు ఈ విషయమై ఏవైనా వైద్యపరీక్షలు చేయించుకున్నారా లేదా అన్న సంగతి తెలపలేదు. మీరు ఒకసారి కడుపు స్కానింగ్, లివర్ ఫంక్షన్ టెస్ట్, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, కడుపులోని నీటి పరీక్షలు చేయించుకొని, ఆ రిపోర్టులు తీసుకొని మీకు దగ్గర్లోని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ను సంప్రదించండి. వారు ఆ రిపోర్టుల ఆధారంగా మీ సమస్యను గుర్తించి, మీకు తగిన చికిత్స చేస్తారు.

ఫ్యామిలీ డాక్టర్

# కడుపులో నొప్పి... మంట... పరిష్కారం సూచించండి

**నా వయసు 38 ఏళ్లు. గత కొన్ని నెలలుగా నాకు కడుపులో మంట, నొప్పి వస్తోంది. ఒక నెల రోజులుగా వాంతులు కూడా అవుతున్నాయి. ఎండోస్కోపీ చేయించుకుంటే చిన్నపేగుల్లో అల్సర్ ఉందని చెప్పారు. నాకు తగిన సూచనలు ఇవ్వండి.**

**– ఆర్. శ్రీనివాసమూర్తి, వరంగల్**



మీరు చెప్పిన లక్షణాలు 'క్రానిక్ డియోడినల్ అల్సర్' అనే వ్యాధితో బాధపడుతున్నవారిలో కనిపిస్తాయి. ఈ అల్సర్ సాధారణంగా 'హెలికోబ్యాక్టర్ పైలోరీ' అనే బ్యాక్టీరియాతో వస్తుంది. దీన్ని పూర్తిగా నశింపజేయడానికి ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వాటిని క్రమం తప్పకుండా వాడటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అంతేకాదు... ఈ మందుల వల్ల మళ్లీ మళ్లీ అల్సర్ వచ్చే అవకాశాలతో పాటు అల్సర్ వల్ల వచ్చే ఇతర సమస్యలూ తగ్గుతాయి. ఎండోస్కోపీలో చిన్నపేగుల్లోని దారి మూసుకుపోయినట్లయితే ఈ చికిత్స ద్వారా అది తగ్గుతుంది. ఆపరేషన్ అవసరం లేదు. మీరు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌ను కలిసి మందులు వాడాల్సి ఉంటుంది. ఒకసారి గ్యాస్ట్రో నిపుణుడిని సంప్రదించండి.



**డాక్టర్ భవానీరాజు**
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
బంజారా హాస్పిటల్స్,
కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
సోమవారం
3-2-2020

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్.. సంక్షిప్తంగా.. బిట్‌శాట్! దేశంలో పేరున్న విద్యా సంస్థ బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)లో బీఈ, బీఫార్మ్, ఎంఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఆన్‌లైన్ పరీక్ష బిట్‌శాట్! ఇందులో ఉత్తమ స్కోర్‌తో బిట్స్ నాలుగు క్యాంపస్‌లు(గోవా, పిలానీ, హైదరాబాద్, దుబాయ్)ల్లో అడుగుపెట్టొచ్చు. డీమ్డ్ యూనివర్సిటీ హోదా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ గుర్తింపు కలిగిన.. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సు పూర్తి చేసుకుంటే.. ఉజ్వల భవిష్యత్తు ఖాయమనే అభిప్రాయం ఉంది! తాజాగా.. బిట్‌శాట్-2020 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. బిట్‌శాట్‌కు అర్హత, పరీక్ష విధానం, టాప్ స్కోర్ సొంతం చేసుకోవడానికి మార్గాలు..




# బిట్‌శాట్ 2020

బీఈ, బీఫార్మ్, ఎంఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

పిలానీ, గోవా, హైదరాబాద్, దుబాయ్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్

నాణ్యమైన విద్యకు కేరాఫ్ బిట్స్

బిట్‌శాట్.. జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్ తర్వాత జాతీయ స్థాయిలో విద్యార్థులు బాగా ఆసక్తి చూపే పరీక్ష. విద్యా ప్రమాణాలు పాటించడంలో బిట్స్‌కు ఉన్న గుర్తింపు.. వినూత్న బోధన విధానాలే ఇందుకు కారణం. బిట్‌శాట్‌కు ఏటా దేశవ్యాప్తంగా దాదాపు రెండు లక్షల మంది పోటీ పడుతుంటారు. ఈ ఏడాది కూడా భారీ సంఖ్యలోనే విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దేశంలోని మూడు బిట్స్ క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య మూడు వేలు. మరో క్యాంపస్ దుబాయ్‌లో ఉంది. మొత్తం 450 మార్కులకు నిర్వహించే పరీక్షలో 400కు పైగా స్కోర్ సాధిస్తేనే సీటు లభించే అవకాశముంది. గత మూడేళ్లలో క్యాంపస్‌ల వారీగా నమోదైన ఫైనల్ కటాఫ్‌లే ఇందుకు నిదర్శనం. బిట్స్‌తోపాటు దాదాపు 150కు పైగా ఇన్‌స్టిట్యూట్‌లు బిట్‌శాట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తుండటం విశేషం.

### ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్స్

బిట్‌శాట్‌ను ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్నారు. ఇందులో విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఉమ్మడి కౌన్సెలింగ్ ఆధారంగా బీఈ, బీఫార్మసీ,ఎంఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ కల్పిస్తారు.

### క్యాంపస్‌లు.. కోర్సులు

- **పిలానీ క్యాంపస్:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్,కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ ఇంజనీరింగ్, మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్; బీఫార్మ్; ఎంఎస్సీ బయోలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్; ఎంఎస్సీ జనరల్ స్టడీస్.
- **గోవా క్యాంపస్:** కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు; ఎంఎస్సీ బయోలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్.
- **హైదరాబాద్ క్యాంపస్:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు; బీఫార్మ్; ఎంఎస్సీ బయోలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్.
- **దుబాయ్ క్యాంపస్:** కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ ఇంజనీరింగ్,బయోటెక్నాలజీ.

### అర్హతలు

- గ్రూప్ సబ్జెక్టులలో ఒక్కో సబ్జెక్ట్‌లో కనీసం 60 శాతం మార్కులు.. మొత్తంగా గ్రూప్ సబ్జెక్టులలో 75 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఎంపీసీ /బైపీసీ ఉత్తీర్ణత.
- 2020లో ఇంటర్మీడియెట్, తత్సమాన కోర్సుల ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు, 2019లో ఉత్తీర్ణత సాధించిన వారు బిట్‌శాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో బిట్స్ టాపర్లకు నేరుగా ప్రవేశం కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ఇంటర్మీడియెట్, తత్సమాన కోర్సుల్లో ఆయా రాష్ట్రాల బోర్డ్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన అభ్యర్థులు బిట్‌శాట్ అవసరం లేకుండానే అడ్మిషన్ పొందొచ్చు. ఈ విధానంలో అడుగు పెట్టాలనుకునే అభ్యర్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

### కౌన్సెలింగ్ ప్రత్యేకంగా

బిట్‌శాట్‌లో స్కోర్ సాధించిన విద్యార్థులు బిట్స్ ప్రత్యేకంగా నిర్వహించే ఉమ్మడి కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. బిట్‌శాట్-2020 అభ్యర్థులు బిట్స్ అడ్మిషన్స్ వెబ్‌సైట్‌లో కనిపించే 'ప్రొసీజర్ ఫర్ అప్లయింగ్ ఫర్ అడ్మిషన్' లింక్‌పై క్లిక్ చేసి సంబంధిత వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ సదుపాయం మే 18 నుంచి జూన్ 18 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రక్రియలోనే అభ్యర్థులు తమ ప్రాథమ్యాలు పేర్కొనాలి.

### బిట్‌శాట్.. స్వరూపం

బిట్‌శాట్ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. పరీక్ష సమయం మూడు గంటలు. అభ్యర్థులు నాలుగు విభాగాల్లో మొత్తం 150 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 450 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. బిట్‌శాట్‌లో కోర్ సబ్జెక్ట్‌లే కాకుండా.. అభ్యర్థుల్లోని ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్‌ను, రీజనింగ్ స్కిల్స్‌ను పరీక్షించే విధంగా ఉప విభాగాలు కూడా ఉంటాయి.

| విభాగం | ప్రశ్నల సంఖ్య |
|---|---|
| పార్ట్-1: ఫిజిక్స్ | 40 |
| పార్ట్-2: కెమిస్ట్రీ | 40 |
| పార్ట్-3: ఎ) ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ; | 15 |
| బి) లాజికల్ రీజనింగ్ | 10 |
| పార్ట్-4: మ్యాథమెటిక్స్/బయాలజీ | 45 |
| మొత్తం ప్రశ్నలు | 150 |

- పార్ట్-4లోని మ్యాథమెటిక్స్/బయాలజీ సబ్జెక్ట్‌ల పరంగా బీఫార్మసీ కోర్సు అభ్యర్థులు ఈ రెండు సబ్జెక్ట్‌లలో ఏదో ఒకదాన్ని ఎంచుకొని పరీక్ష రాసే వెసులుబాటు ఉంది. బీఈ(ఇంజనీరింగ్) అభ్యర్థులు మాత్రం తప్పనిసరిగా మ్యాథమెటిక్స్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

### అదనంగా 12 ప్రశ్నలు

బిట్‌శాట్ పరీక్షకు కేటాయించిన మూడు గంటల వ్యవధిలోపే 150 ప్రశ్నలను పూర్తి చేసిన అభ్యర్థులకు అదనంగా మరో 12 ప్రశ్నలను కేటాయిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్/బయాలజీ నుంచి నాలుగు ప్రశ్నలు చొప్పున ఇస్తారు. నెగెటివ్ మార్కుల విధానం ఉన్నందున అభ్యర్థులు ఆచితూచి సమాధానాలు గుర్తించడం మేలు.

### పది రోజుల పాటు పరీక్షలు

బిట్‌శాట్-2020ను మే 16 నుంచి మే 25 వరకు.. 10 రోజుల పాటు నిర్వహిస్తారు. రోజుకు రెండు స్లాట్ల చొప్పున (ఉదయం 9 నుంచి 12 గంటల వరకు; మధ్యాహ్నం రెండు నుంచి అయిదు గంటల వరకు) పరీక్ష జరుగుతుంది. కాబట్టి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు అనుకూలమైన తేదీలో, స్లాట్‌లో పరీక్షకు హాజరు కావచ్చు. ఇందుకోసం.. తాము ఎంపిక చేసుకున్న టెస్ట్ సెంటర్‌లో తమకు అనుకూలమైన స్లాట్‌ను రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుంది. బిట్‌శాట్ అభ్యర్థులు ఆన్‌లైన్ టెస్ట్ ముగిసిన వెంటనే కంప్యూటర్ స్క్రీన్‌పై తమ స్కోర్ రిపోర్ట్‌ను చూసుకోవచ్చు.

### నాణ్యమైన విద్యకు కేరాఫ్

ఆయా కోర్సులకు సంబంధించి బిట్స్ ప్రత్యేక కరిక్యులం రూపొందించి ప్రాక్టికల్ దృక్పథం పెరిగేలా బోధన అందిస్తోంది. బీఈలో చేరిన విద్యార్థులు.. కోర్సు వ్యవధిలో రెండుసార్లు ప్రాక్టీస్ స్కూల్-1, ప్రాక్టీస్ స్కూల్-2 పేరుతో అనుసరిస్తున్న నిబంధన ప్రకారం.. నిర్దిష్ట వ్యవధిలో ఆయా పరిశ్రమల్లో రీసెర్చ్ కార్యకలాపాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. అంతేకాకుండా కోర్ సబ్జెక్ట్‌లతోపాటు ఇతర అంశాలపైనా అవగాహన పెంచేలా మైనర్ ప్రోగ్రామ్స్ విధానాన్ని బిట్స్ అమలు చేస్తోంది. ఫైనాన్స్, అకౌంటింగ్, లిటరేచర్, హ్యుమానిటీస్ వంటి పలు సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌లు సైతం అందిస్తుండటం విశేషం.



### బేసిక్స్, కాన్సెప్ట్‌లే విజయానికి కీలకం

- బిట్‌శాట్ పరీక్ష కూడా జేఈఈ మెయిన్ స్థాయిలో క్లిష్టంగానే ఉంటోంది. ప్రశ్నలు అప్లికేషన్ ఓరియెంటేషన్‌లో అడుగుతున్నారు. కాబట్టి బిట్‌శాట్‌లో మంచి స్కోర్ సాధించేందుకు విద్యార్థులు ఇంటర్మీడియెట్ స్థాయి సబ్జెక్ట్‌లైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ బేసిక్స్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా అప్లికేషన్ దృక్పథంతో ప్రిపరేషన్‌ను సాగించాలి. జేఈఈ ప్రిపరేషన్‌తో బిట్‌శాట్ ప్రిపరేషన్‌ను అనుసంధానం చేసుకుంటూ చదవడం వల్ల ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత లభిస్తుంది.
- ప్రతిరోజు, ప్రతి విభాగానికి కచ్చితంగా ఒక సమయం కేటాయించుకొని ప్రిపరేషన్ సాగించాలి. ప్రతి సబ్జెక్ట్‌కు రోజుకు కనీసం రెండు గంటలు చొప్పున కేటాయించాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోని సిలబస్‌ను అనుసరిస్తూ వాటిని బిట్‌శాట్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ.. చదివితే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

### పార్ట్-3.. ప్రత్యేకం

ఇతర ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలతో పోలిస్తే బిట్‌శాట్‌లోని పార్ట్-3 కొంత ప్రత్యేకమైన విభాగమని చెప్పొచ్చు. ఇందులో ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్ టాపిక్స్ నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి. లాంగ్వేజ్ నైపుణ్యం, తులనాత్మక పరిశీలన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఈ విభాగాన్ని పొందుపర్చారు. ఇందులో రాణించడానికి పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌పై, వొకాబ్యులరీపై పట్టుసాధించాలి. తద్వారా 25 ప్రశ్నలకు సులువుగా సమాధానాలు గుర్తించే అవకాశం లభిస్తుంది.

### సొంత నోట్స్ మేలు

- బేసిక్స్‌పై పట్టు సాధించడంతోపాటు విద్యార్థులు నిర్దిష్టంగా కొన్ని వ్యూహాలు అనుసరిస్తే బిట్‌శాట్‌లో మెరుగైన ప్రతిభ చూపే అవకాశం ఉంటుంది. ప్రతి సబ్జెక్ట్‌లో ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లకు షార్ట్ కట్ మెథడ్స్‌తో సొంతనోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్‌కు ఎంతో అనుకూలంగా ఉంటుంది. కెమిస్ట్రీలో ముఖ్యంగా ఆర్గానిక్ కెమిస్ట్రీలో కెమికల్ రియాక్షన్స్‌ను ఒక జాబితాగా రూపొందించుకోవాలి. ఫిజిక్స్‌లో వర్క్ అండ్ ఎనర్జీ, న్యూటన్స్ లా, కరెంట్ ఎలక్ట్రిసిటీ, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మ్యాగ్నటిజం అండ్ మ్యాగ్నటిక్ ఎఫెక్ట్ ఆఫ్ కరెంట్, ఎలక్ట్రిక్ కరెంట్ యూనిట్లలోని ముఖ్య అంశాలతో నోట్స్ రూపొందించుకోవాలి. మ్యాథమెటిక్స్‌లో హైపర్‌బోలా, పారాబోలా, రెక్టాంగులర్ పారాబోలా, ట్రిగ్నోమెట్రీ, వెక్టార్స్, 3-డి, ఇంటిగ్రల్ కాలిక్యులస్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### బిట్‌శాట్-2020 ముఖ్య తేదీలు

- » ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31, 2020
- » అప్లికేషన్‌లో లోపాల సవరణ అవకాశం: ఏప్రిల్ 1- 6, 2020
- » టెస్ట్ సెంటర్ కేటాయింపు వివరాలు: ఏప్రిల్ 9, 2020
- » టెస్ట్ తేదీ, స్లాట్ రిజర్వ్ సదుపాయం: ఏప్రిల్ 10 - ఏప్రిల్ 18, 2020
- » హాల్‌టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: ఏప్రిల్ 20 - మే 12, 2020
- » ఆన్‌లైన్ టెస్ట్ తేదీలు: మే 16, 2020 నుంచి మే 25, 2020
- » అడ్మిషన్ జాబితా, వెయిట్ లిస్ట్ ప్రకటన: జూన్ 20, 2020
- » వెబ్‌సైట్: www.bitsadmission.com

### తెలుగు రాష్ట్రాల్లో టెస్ట్ సెంటర్లు

- బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్, హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- దరఖాస్తు విధానం: www.bitsadmission.com వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకుని ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించాలి. తమకు ఆసక్తి గల క్యాంపస్, బ్రాంచ్ ఎంపిక విషయంలో ముందుగానే స్పష్టత ఏర్పరచుకోవాలి.

# ఫార్మా కోర్సులకు కేరాఫ్ .. నైపర్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్.. నైపర్! ఇంజనీరింగ్‌కు ఐఐటీలు.. మేనేజ్‌మెంట్ విద్యకు ఐఐఎంలు ఎలాగో.. ఫార్మసీ కోర్సులను అందించడంలో ఆ స్థాయి ఇన్‌స్టిట్యూట్‌లుగా నైపర్‌లకు మంచి పేరుంది. కాగా, కొత్త విద్యా సంవత్సరంలో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నైపర్ 2020 నోటిఫికేషన్ మరికొద్ది రోజుల్లో వెలువడే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. అభ్యర్థులకు ఉపయోగపడేలా నైపర్ క్యాంపస్‌లు.. అందిస్తున్న కోర్సులు.. ప్రవేశ విధానం గురించి తెలుసుకుందాం...

- దేశవ్యాప్తంగా ఉన్న ఏడు నైపర్ క్యాంపస్‌ల్లో ప్రతి ఏటా ప్రవేశాలు
- అందుబాటులో ఎంఎస్(ఫార్మా), ఎంఫార్మా, ఎంటెక్(ఫార్మా), పీహెచ్‌డీ, ఎంబీఏ ఫార్మా కోర్సులు




### నైపర్ జేఈఈ

కేంద్ర ప్రభుత్వం ఫార్మా విద్య, పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ స్థాయిలో నైపర్‌లను ఏర్పాటుచేసింది. తొలి నైపర్‌ను ఎస్ఏఎస్ నగర్ (మొహాలీ)లో ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏడు నైపర్‌లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇవన్నీ ఫార్మాకు సంబంధించి పలు స్పెషలైజేషన్స్‌తో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులతో పాటు పీహెచ్‌డీని అందిస్తున్నాయి. నైపర్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలంటే.. జాతీయ స్థాయిలో నిర్వహించే నైపర్ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(నైపర్ జేఈఈ)లో మంచి ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

### నైపర్ అహ్మదాబాద్

నైపర్ అహ్మదాబాద్ క్యాంపస్ గాంధీనగర్‌లో ఉంది. దీనికి 2019 ఎన్ఐఆర్ఎఫ్ ఫార్మా ర్యాంకింగ్స్‌లో 9వ స్థానం దక్కింది. క్యాంపస్‌లో రీసెర్చ్ ల్యాబొరేటరీ, యానిమల్ హౌజ్ తదితర సౌకర్యాలు ఉన్నాయి. నైపర్ అహ్మదాబాద్ ఏడు స్పెషలైజేషన్స్‌తో ఎంఎస్(ఫార్మా) కోర్సును ఆఫర్ చేస్తోంది. బయోటెక్నాలజీ 10, మెడిసినల్ కెమిస్ట్రీ 16, మెడికల్ డివైజెస్10, నేచురల్ ప్రొడక్ట్స్ 10, ఫార్మాస్యూటికల్ అనాలసిస్ 20, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ 16, ఫార్మాస్యూటిక్స్ 20 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

### నైపర్ గువహటి

ఇది 2008 నుంచి కోర్సులను అందిస్తోంది. ఎంఎస్(ఫార్మా),ఎంఫార్మా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. ఎంఎస్‌లో ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ స్పెషలైజేషన్‌తో15, బయోటెక్నాలజీలో10,ఫార్మాస్యూటిక్స్‌లో 15, ఫార్మాస్యూటికల్ అనాలసిస్‌లో 15 సీట్లు ఉండగా.. ఎంఫార్మాలో ఫార్మసీ ప్రాక్టీస్ స్పెషలైజేషన్‌తో 10 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

### నైపర్ హాజీపూర్

పాట్నా ఎయిర్‌పోర్ట్‌కి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. తాజాగా ఈ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ పరంగా పలు సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రస్తుతం మూడు విభాగాల్లో ఎంఎస్(ఫార్మా) కోర్సును ఆఫర్‌చేస్తోంది. బయోటెక్నాలజీలో 16, ఫార్మసీ ప్రాక్టీస్‌లో 16 సీట్లు, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీలో 16 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

### నైపర్ హైదరాబాద్

నైపర్ హైదరాబాద్‌కు ఫార్మాస్యూటికల్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో హయ్యర్ ఎడ్యుకేషన్, రీసెర్చ్‌ల పరంగా దేశవ్యాప్త గుర్తింపు ఉంది. జాతీయ ప్రాధాన్య ఇన్‌స్టిట్యూట్‌గా కూడా గుర్తింపు పొందింది. ఎంఎస్(ఫార్మా), ఎంటెక్(ఫార్మా), ఎంబీఏ(ఫార్మా) కోర్సులను ఆఫర్‌చేస్తోంది. ఎంఎస్‌లో మెడికల్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లో 20, ఫార్మాస్యూటికల్ అనాలసిస్‌లో 20, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీలో 15, ఫార్మాస్యూటిక్స్‌లో 20, రెగ్యులేటరీ టాక్సికాలజీలో 15, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ)లో 15 సీట్లు, ఎంబీఏ(ఫార్మా)లో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

### నైపర్ కోల్‌కతా

దీన్ని 2007లో ఏర్పాటు చేశారు. జాతీయ ప్రాధాన్య ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తింపు పొందింది. నాలుగు స్పెషలైజేషన్స్‌తో ఎంఎస్(ఫార్మా) కోర్సును ఆఫర్‌చేస్తోంది. మెడికల్ కెమిస్ట్రీలో 7, నేచురల్ ప్రొడక్ట్స్‌లో 6, ఫార్మకోఇన్ఫర్మాటిక్స్‌లో 4, ఫార్మాకాలజీ అండ్ టాక్సికాలజీలో 12 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

### నైపర్ రాయ్‌బరేలి

2008లో ఏర్పాటైంది. కేంద్ర ప్రభుత్వం దీన్ని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ప్రకటించింది. నాలుగు స్పెషలైజేషన్స్‌లో ఎంఎస్(ఫార్మా) కోర్సును అందిస్తోంది. మెడికల్ కెమిస్ట్రీలో 20, ఫార్మాస్యూటిక్స్‌లో 15, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీలో 15, రెగ్యులేటరీ టాక్సికాలజీలో 10 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

### నైపర్ ఎస్ఏఎస్ నగర్ (మొహాలి)

ఇది దేశంలో ఏర్పాటైన తొలి నైపర్. దీన్ని కేంద్రం జాతీయ ప్రాధాన్య ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తించింది. ప్రస్తుతం 14 విభాగాల్లో ఎంఎస్(ఫార్మా) కోర్సును ఆఫర్‌చేస్తోంది. మెడికల్ కెమిస్ట్రీలో 26, నేచురల్ ప్రొడక్ట్స్‌లో 12, ట్రెడిషనల్ మెడిసిన్‌లో 4, ఫార్మాస్యూటికల్ అనాలసిస్‌లో 8, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీలో 16, రెగ్యులేటరీ టాక్సికాలజీలో 8, ఫార్మాస్యూటిక్స్‌లో 18, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ఫార్ములేషన్)లో 6, బయోటెక్నాలజీలో 32, ఫార్మసీ ప్రాక్టీస్‌లో 8, క్లినికల్ రీసెర్చ్‌లో 8, ఫార్మకోఇన్ఫర్మాటిక్స్‌లో 16, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ)లో 16, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (బయోటెక్నాలజీ)లో 10సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంబీఏ(ఫార్మా)లో 42 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

### అర్హతలు

- పీజీ కోర్సులకు బీఫార్మసీ, ఎంఎస్సీ, బీవీఎస్సీ, ఎంబీబీఎస్, బీఏఎంఎస్ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణత. వ్యాలిడ్ జీప్యాట్ స్కోరుతోపాటు అర్హత డిగ్రీలో 60 శాతం మార్కులు లేదా 6.75 సీజీపీఏ(10 పాయింట్ల స్కేల్‌లో) ఉండాలి. ఫైనలియర్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. వారంతా తుది కౌన్సెలింగ్ కంటే ముందు విశ్వవిద్యాలయాల అధికారిక మెయిల్ ఐడీల ద్వారా స్వీయ ఫలితాలను పంపాల్సి ఉంటుంది.
- కౌన్సెలింగ్/గ్రూప్ డిస్కషన్ వచ్చేటప్పుడు అభ్యర్థులు తప్పనిసరిగా జీప్యాట్/నెట్/గేట్ స్కోర్ కార్డును తీసుకురావాల్సి ఉంటుంది.
- బీవీఎస్సీ/ఎంబీబీఎస్/బీఏఎంఎస్ డిగ్రీ ఉత్తీర్ణులు, విదేశీ విద్యార్థులు, పబ్లిక్- ప్రైవేట్ సెక్టార్ అండర్ టేకింగ్,ప్రభుత్వ విభాగాలు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ల స్పాన్సర్డ్ అభ్యర్థులు మినహా మిగిలిన కోర్సుల విద్యార్థులకు జీప్యాట్/నెట్/గేట్ అర్హత తప్పనిసరి.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 55 శాతం, పీడబ్ల్యూడీ విద్యార్థులకు 50 శాతం ఉత్తీర్ణత ఉండాలి.

### పరీక్ష విధానం

ఎంఎస్ ఫార్మా, ఎంబీఏ(ఫార్మా) కోర్సులకు కామన్ ఎంట్రన్స్ టెస్టు ఉంటుంది. ప్రశ్నపత్రం 200 ప్రశ్నలు-200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు కోత విధిస్తారు. ప్రశ్నలు.. బీఫార్మసీ, ఎంఎస్సీ స్థాయిలో ఉంటాయి.

### ఎంపిక

నైపర్ జేఈఈ మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ఎంఎస్(ఫార్మా), ఎంఫార్మా, ఎంటెక్ (ఫార్మా) కోర్సుల్లో ప్రవేశాలు ఖరారు చేస్తారు. ఎంబీఏ ఫార్మా(హైదరాబాద్, ఎస్.ఎ.ఎస్.నగర్) కోర్సులో ప్రవేశాలను ఎంట్రెన్స్ టెస్టు, గ్రూప్ డిస్కషన్ అండ్ ఇంటర్వ్యూలో పొందిన మార్కుల ఆధారంగా ఖరారు చేస్తారు. ఎంట్రెన్స్ టెస్టుకు 85 శాతం వెయిటేజీ, గ్రూప్ డిస్కషన్ అండ్ ఇంటర్వ్యూలకు 15 శాతం వెయిటేజీ ఉంటుంది.


### పీహెచ్‌డీ ప్రవేశాలు

✦ **అర్హత:** నైపర్‌లు పీహెచ్‌డీ కోర్సులను అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేస్తాయి. పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి ఎంఎస్(ఫార్మా)/ ఎంఫార్మ్/ఎంటెక్(ఫార్మా) ఉత్తీర్ణత. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్ /డీబీటీ/ డీఎస్‌టీ నెట్-జేఆర్ఎఫ్‌లో క్వాలిఫై అయిన వారు దరఖాస్తుకు అర్హులు. ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. వీరంతా ఇంటర్వ్యూ సమయంలో అర్హతలను ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. వీరితో పాటు నిర్దిష్ట విభాగాల్లో సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఇన్‌స్పైర్, ఆర్‌జీఎన్ఎఫ్ ఫెలోషిప్‌లు పొందిన వారికి కొన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయి.

✦ **పరీక్ష విధానం:** ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్‌లో కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగాలు ఉంటాయి. ప్రశ్నలను ఎంఎస్(ఫార్మా), ఎంఫార్మా, ఎంటెక్(ఫార్మా), ఎంవీఎస్సీ, ఎండీ, ఎంఎస్సీ సిలబస్‌లోని అనుబంధ అంశాల నుంచి అడుగుతారు. వీటితోపాటు ప్రతి విభాగంలో ఫార్మాస్యూటికల్ సైన్సెస్, జనరల్ ఆప్టిట్యూడ్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు, ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

### నైపర్ ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు ప్రక్రియ:** ఏప్రిల్ మొదటివారం.
- » **దరఖాస్తు ఫీజు:** ఎంఎస్(ఫార్మా)/ఎంఫార్మా/ఎంటెక్(ఫార్మా): జనరల్, ఓబీసీ, పీహెచ్, ఎన్ఆర్ఐ విద్యార్థులకు రూ. 3000, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.1500.
- » **ఎంబీఏ(ఫార్మా):** జనరల్, ఓబీసీ, పీహెచ్, ఎన్ఆర్ఐ విద్యార్థులకు రూ.3000, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.1500.
- » **ఎంఎస్(ఫార్మా)/ఎంఫార్మా/ఎంటెక్(ఫార్మా)-ఎంబీఏ(ఫార్మా):** జనరల్, ఓబీసీ, పీహెచ్, ఎన్ఆర్ఐ విద్యార్థులకు రూ. 4000, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.2000.
- » **పీహెచ్‌డీ:** జనరల్, ఓబీసీ, పీహెచ్ కేటగిరీ అభ్యర్థులకు రూ.3000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500.
- » **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ.
- » **వెబ్‌సైట్:** www.niperahm.ac.in



# మళ్లీ జొకో‘విన్’

**తనకెంతో అచ్చొచ్చిన వేదికపై మరో అద్భుత ప్రదర్శనతో సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ అదరగొట్టాడు. రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. తద్వారా ఈ టోర్నీ ఫైనల్స్‌లో 8-0తో తన అజేయ రికార్డును కొనసాగించాడు. ఈ గెలుపుతో జొకోవిచ్ నేడు విడుదల చేసే అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ర్యాంకింగ్స్‌లో రాఫెల్ నాదల్‌ను రెండో స్థానానికి నెట్టి మళ్లీ తాను ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నాడు.**

- ఎనిమిదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ నెగ్గిన సెర్బియా స్టార్
- ఫైనల్లో డొమినిక్ థీమ్‌పై అద్భుత విజయం
- మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ కైవసం
- రూ. 19 కోట్ల 71 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

**మెల్‌బోర్న్:** పోరాట పటిమకు పెట్టింది పేరైన సెర్బియా టెన్నిస్ యోధుడు నొవాక్ జొకోవిచ్ ఆదివారం వీరోచిత ఆటతో ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగం టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. రాడ్‌లేవర్ ఎరీనాలో ఆదివారం 3 గంటల 59 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో రెండో సీడ్ జొకోవిచ్ 6–4, 4–6, 2–6, 6–3, 6–4తో ఐదో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)పై గెలుపొందాడు. జొకోవిచ్ కెరీర్‌లో ఇది 17వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌కాగా, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఎనిమిదోది. గతంలో జొకోవిచ్ 2008, 2011, 2012, 2013, 2015, 2016, 2019లలో చాంపియన్‌గా నిలిచాడు. తాజా విజయంతో జొకోవిచ్ సోమవారం విడుదల చేసే ప్రపంచ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో నాదల్ నుంచి మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. విజేత జొకోవిచ్‌కు 41 లక్షల 20 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 19 కోట్ల 71 లక్షలు)... రన్నరప్ థీమ్‌కు 20 లక్షల 65 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 9 కోట్ల 88 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ రాఫెల్ నాదల్‌ను ఓడించిన 26 ఏళ్ల డొమినిక్ థీమ్ ఫైనల్లోనూ మరో సంచలనం నమోదు చేస్తాడనిపించింది. కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ ఆడుతున్న థీమ్ తొలి సెట్‌ను కోల్పోయాక... అనూహ్యంగా పుంజుకొని రెండు, మూడు సెట్‌లలో నెగ్గి తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా అడుగులు వేశాడు. అయితే గతంలో ఆడిన ఏడు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్స్‌లో విజయం సాధించి అజేయంగా ఉన్న 32 ఏళ్ల జొకోవిచ్ తన ప్రత్యర్థికి సులువుగా తలవంచాలనుకోలేదు. తన అనుభవాన్నంతా రంగరించి పోరాడిన ఈ సెర్బియా స్టార్ నాలుగో సెట్‌లో ఎనిమిదో గేమ్‌లో థీమ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, ఆ తర్వాత తన సర్వీస్‌ను కాపాడుకొని సెట్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచాడు. జొకోవిచ్ ఆటతీరు గాడిలో పడటంతో ఐదో సెట్‌లో థీమ్ ఒత్తిడికి లోనై తడబడ్డాడు. మూడో గేమ్‌లో థీమ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌లను నిలబెట్టుకొని చాంపియన్‌గా నిలిచాడు.

## ఫైనల్ గణాంకాలు

| జొకోవిచ్ | | థీమ్ |
|---|---|---|
| 9 | ఏస్‌లు | 13 |
| 5 | డబుల్ ఫాల్ట్‌లు | 5 |
| 5/12 | బ్రేక్ పాయింట్లు | 5/12 |
| 24/29 | నెట్ పాయింట్లు | 23/31 |
| 46 | విన్నర్స్ | 55 |
| 57 | అనవసర తప్పిదాలు | 57 |
| 157 | మొత్తం పాయింట్లు | 147 |

“ ప్రపంచంలోని నా అభిమాన కోర్టు, నా అభిమాన స్టేడియమిదే. ఈ ట్రోఫీని మరోసారి అందుకోవడంతో పరమానందం కలుగుతోంది. ఈ ఏడాది విషాదభరిత సంఘటనలతో ప్రారంభమైంది. ఆస్ట్రేలియాలో కార్చిచ్చు, ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో సంఘర్షణ వాతావరణం, పలువురు ప్రాణాలు కోల్పోవడం... నా ఆప్త మిత్రుడు, బాస్కెట్‌బాల్ దిగ్గజం కోబీ బ్రయాంట్ దుర్మరణం కలిచి వేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనం సంఘటితంగా ఉండాలి. క్రీడాకారులకూ వేరే జీవితం ఉంటుంది. మనల్ని అభిమానించే వాళ్లతో, ప్రేమించే వాళ్లతో, కుటుంబసభ్యులతో బాధ్యతగా మెలగాలి. ఫైనల్లో థీమ్ బాగా ఆడాడు. భవిష్యత్‌లో అతను కచ్చితంగా గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌గా అవతరిస్తాడు.

-జొకోవిచ్


జొకోవిచ్

**3** పురుషుల సింగిల్స్ విభాగంలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ గెలిచిన క్రీడాకారుల జాబితాలో జొకోవిచ్ (17) మూడో స్థానంలో ఉన్నాడు. ఫెడరర్ (స్విట్జర్లాండ్–20), రాఫెల్ నాదల్ (స్పెయిన్–19) వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

ఒకే గ్రాండ్‌స్లామ్ టోర్నీని 8 అంతకంటే ఎక్కువసార్లు గెలిచిన మూడో ప్లేయర్ జొకోవిచ్. ఫెడరర్ వింబుల్డన్ టోర్నీలో 8 సార్లు, నాదల్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 12 సార్లు చాంపియన్‌గా నిలిచారు.


థీమ్



# నెవర్ బిఫోర్... 5-0

## టి20 సిరీస్‌ను 5-0తో క్లీన్‌స్వీప్ చేసిన తొలి జట్టుగా భారత్ రికార్డు

### ఆఖరి పోరులోనూ మనదే విజయం

### టీమిండియా సమష్టి ప్రదర్శన • న్యూజిలాండ్‌కు మళ్లీ నిరాశ

**అంతర్జాతీయ టి20లు ప్రారంభమై 15 ఏళ్లు గడిచాయి. ఇప్పటివరకు 1037 టి20 మ్యాచ్‌లు జరిగాయి. ఈ క్రమంలో గతంలో ఏ జట్టుకూ సాధ్యంకాని ఘనతను భారత్ సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 5-0తో క్లీన్‌స్వీప్ చేసిన తొలి జట్టుగా భారత్ కొత్త చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌తో ఐదో మ్యాచ్‌లో సమష్టిగా మెరిపించిన టీమిండియా ఏడు పరుగుల తేడాతో నెగ్గింది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ కీలకదశలో తడబడి మూల్యం చెల్లించుకుంది.**

**మౌంట్‌మాంగని:** న్యూజిలాండ్‌లో భారత్ ‘పొట్టి’ చరిత్రకెక్కింది. టీమిండియా టి20ల్లో తొలిసారి 5–0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఈసారి బుమ్రా (4–1–12–3) తన పేస్ పదునుతో న్యూజిలాండ్ గెలుపు దారిని ఓటమి వైపు మళ్లించాడు. దీంతో భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 163 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (41 బంతుల్లో 60 రిటైర్డ్ హర్ట్; 3 ఫోర్లు, 3 సిక్సర్లు), రాహుల్ (33 బంతుల్లో 45; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. కుగ్లీన్ 2 వికెట్లు తీశాడు. తర్వాత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసి ఓడింది. రాస్ టేలర్ (47 బంతుల్లో 53; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), సీఫెర్ట్ (30 బంతుల్లో 50; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేశారు. శార్దుల్, సైనీ చెరో 2 వికెట్లు తీశారు. బుమ్రాకు ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’... రాహుల్‌కు ‘మ్యాన్ ఆఫ్ ద సిరీస్’ అవార్డులు దక్కాయి. మూడు వన్డేల సిరీస్ హామిల్టన్‌లో ఈనెల 5న జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది.


రోహిత్

### రాహుల్ మళ్లీ జిగేల్...

ఈసారి టాస్ భారత్ నెగ్గింది. గత రెండు మ్యాచ్‌ల్లో బౌలర్లు కివీస్‌ను అనూహ్యంగా కట్టడి చేయడం దృష్ట్యా ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. చివరకు ఇక్కడ అదే జరిగింది. రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు వచ్చిన సంజూ సామ్సన్ (2) సువర్ణావకాశాన్ని చేజార్చుకోగా... ఈ మ్యాచ్‌లో రెగ్యులర్ కెప్టెన్ కోహ్లి స్థానంలో పగ్గాలు చేపట్టిన రోహిత్ శర్మ... వన్‌డౌన్‌లో విరాట్ పాత్ర పోషించాడు. అయితే రోహిత్ ఆరంభంలో కాస్త నింపాదిగా ఆడగా... రాహుల్ తన జోరు కొనసాగించాడు. సౌతీ వేసిన 3వ ఓవర్లో ఎక్స్‌ట్రా కవర్స్‌లో 6, కవర్ పాయింట్, డీప్‌స్క్వేర్‌లో వరుసగా రెండు బౌండరీలు బాదాడు. దీంతో 5.1 ఓవర్లోనే భారత్ 50కి చేరింది. ధాటిగా ఆడుతున్న రాహుల్‌ను 12వ ఓవర్లో బెన్నెట్ పెవిలియన్ చేర్చడంతో రెండో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అదే ఓవర్లో రోహిత్ ఫోర్ బాదడంతో జట్టు స్కోరు 100కు చేరింది. రోహిత్ 35 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. ఇతని అండతో శ్రేయస్ అయ్యర్ (31 బంతుల్లో 33 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) అడపాదడపా షాట్లు ఆడాడు. కాసేపటికే రోహిత్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరగ్గా... శివమ్ దూబే (5) నిరాశపరిచాడు. మనీశ్ పాండే (4 బంతుల్లో 11 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) బాదడంతో జట్టు స్కోరు 163కు చేరింది.

### రాణించిన సీఫెర్ట్...

లక్ష్యఛేదనలో ఓపెనర్లు గప్టిల్ (2), మన్రో (15) సహా... బ్రూస్ (0) వికెట్లను 17 పరుగులకే కోల్పోవడంతో భారత్ శిబిరంలో ఉత్సాహం పెరిగింది. బుమ్రా, సుందర్ ఓపెనర్లను ఔట్ చేస్తే, బ్రూస్ రనౌటయ్యాడు. అయితే సీఫెర్ట్, టేలర్‌ల జోడీ టీమిండియా ఉత్సాహంపై నీళ్లుచల్లింది. 12.3 ఓవర్ల దాకా మరో వికెట్ ఇవ్వకుండా కివీస్‌ను 116 స్కోరుకు తెచ్చింది. ఈ క్రమంలో సీఫెర్ట్ (29 బంతుల్లో), టేలర్ (42 బంతుల్లో) అర్ధసెంచరీలను పూర్తిచేసుకున్నారు. భారత్ క్లీన్‌స్వీప్‌కు అడ్డుగా నిలిచిన ఈ జోడీని సైనీ విడగొట్టాడు. దీంతో నాలుగో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యానికి తెర పడింది. తర్వాత మిచెల్ (2)ను బుమ్రా బౌల్డ్ చేశాడు. జట్టు స్కోరు 16 ఓవర్లలో 129/5. ఇక 24 బంతుల్లో 35 చేస్తే కివీస్ గెలుస్తుంది. ఆఖరికి పరువు నిలుస్తుంది. కానీ తర్వాత ఓవర్ వేసిన శార్దుల్ మూడు బంతుల వ్యవధిలో సాన్‌ట్నర్ (6), కుగ్లీన్ (0)లను పెవిలియన్ చేర్చడంతో గెలుపు కథ అడ్డం తిరిగింది. మరుసటి ఓవర్లో సైనీ క్రీజులో పాతుకుపోయిన టేలర్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. 19 ఓవర్ వేసిన బుమ్రా కెప్టెన్ సౌతీ (6)ని అవుట్ చేసి 3 పరుగులే ఇచ్చాడు. దీంతో 12 బంతుల్లో 24 పరుగుల సమీకరణం కాస్త ఆఖరి ఓవర్‌కు వచ్చేసరికి 6 బంతుల్లో 21 పరుగులుగా పెరిగిపోయింది. శార్దుల్ బౌలింగ్‌లో సోధి 2 సిక్సర్లతో మెరిపించాడే కానీ గెలిపించలేకపోయాడు.

### దూబే ఓవర్లో 34....

అంతర్జాతీయ టి20ల్లో ఒకే ఓవర్లో అత్యధిక పరుగులు ఇచ్చిన రెండో బౌలర్‌గా, భారత్ నుంచి తొలి బౌలర్‌గా శివమ్ దూబే చెత్త రికార్డు నమోదు చేశాడు. ఇన్నింగ్స్ పదో ఓవర్లో అతను 6, 6, 4, 1, నోబ్+4, 6, 6లతో మొత్తం 34 పరుగులు సమర్పించుకున్నాడు. కివీస్ ‘గేర్’ మార్చిన ఈ ఓవర్లో సీఫెర్ట్, టేలర్‌లు చెరో 2 సిక్సర్లు బాదేశారు. అంతర్జాతీయ టి20ల్లో ఒకే ఓవర్లో ఎక్కువ పరుగులు ఇచ్చిన బౌలర్ రికార్డు స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లండ్... 2007లో భారత్‌పై 36 పరుగులు; యువరాజ్ 6 సిక్స్‌లు) పేరిట ఉంది. మ్యాచ్ మొత్తంలో బుమ్రా 4 ఓవర్లేసి 12 పరుగులే ఇస్తే... దూబే ఒకే ఒక్క ఓవర్‌తో 3 రెట్లు ఎక్కువ పరుగులిచ్చుకున్నాడు. దీంతో మళ్లీ అతన్ని బౌలింగ్‌కు దించలేదు.

**మా వాళ్లంతా అత్యుత్తమ స్థాయిలో ఉండాలన్నదే నా కోరిక. మా అంచనాలకు తగ్గట్లే జట్టుకు అవసరమైనపుడు వందకు 120 శాతం ప్రదర్శన కనబరిచేందుకు సిద్ధంగా ఉండటంవల్లే ఇప్పుడు ఇలాంటి ఫలితాలు వస్తున్నాయి. మా అందరి లక్ష్యం విజయమే. అందుకే గత మూడేళ్లుగా జట్టులో ఎంతో మార్పు వచ్చింది. ఎంతో ప్రగతి సాధించింది. ఇక న్యూజిలాండ్ గురించి చెప్పాల్సి వస్తే ఆ జట్టు వైట్‌వాష్ అయినప్పటికీ ఓ సమర్థ సారథి చేతుల్లోనే ఉంది. కేన్ విలియమ్స్‌ది, నాది ఒకే విధమైన ఆలోచన. మా దేశాలు వేరు కావొచ్చేమో కానీ మా ఇద్దరి మైండ్‌సెట్లు ఒక్కటే.** -భారత కెప్టెన్ కోహ్లి



## స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రాహుల్ (సి) సాన్‌ట్నర్ (బి) బెన్నెట్ 45; సంజూ సామ్సన్ (సి) సాన్‌ట్నర్ (బి) కుగ్లీన్ 2; రోహిత్ (రిటైర్డ్ హర్ట్) 60; శ్రేయస్ (నాటౌట్) 33; శివమ్ దూబే (సి) బ్రూస్ (బి) కుగ్లీన్ 5; మనీశ్ పాండే (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 163. వికెట్ల పతనం:** 1–8, 2–96, 3–148. **బౌలింగ్:** సౌతీ 4–0–52–0, కుగ్లీన్ 4–0–25–2, బెన్నెట్ 4–0–21–1, సోధి 4–0–28–0, సాన్‌ట్నర్ 4–0–36–0.

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** గప్టిల్ ఎల్బీడబ్ల్యూ (బి) బుమ్రా 2; మన్రో (బి) వాషింగ్టన్ సుందర్ 15; సీఫెర్ట్ (సి) సామ్సన్ (బి) సైనీ 50; బ్రూస్ (రనౌట్) 0; రాస్ టేలర్ (సి) రాహుల్ (బి) సైనీ 53; మిచెల్ (బి) బుమ్రా 2; సాన్‌ట్నర్ (సి) పాండే (బి) శార్దుల్ 6; కుగ్లీన్ (సి) సుందర్ (బి) శార్దుల్ 0; సౌతీ (బి) బుమ్రా 6; సోధి (నాటౌట్) 16; బెన్నెట్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 156. వికెట్ల పతనం:** 1–7, 2–17, 3–17, 4–116, 5–119, 6–131, 7–132, 8–133, 9–141. **బౌలింగ్:** సుందర్ 3–0–20–1, బుమ్రా 4–1–12–3, సైనీ 4–0–23–2, శార్దుల్ 4–0–38–2, చహల్ 4–0–28–0, దూబే 1–0–34–0.

**1** ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం భారత్‌కిదే తొలిసారి. విదేశీ గడ్డపై సిరీస్‌లను వైట్‌వాష్ చేయడం భారత్‌కిది మూడోసారి. 2016లో 3–0తో ఆస్ట్రేలియాను, గతేడాది 3–0తో వెస్టిండీస్‌ను టీమిండియా క్లీన్‌స్వీప్ చేసింది.

**3** ఈ మ్యాచ్‌తో న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ 100 అంతర్జాతీయ టి20లు ఆడిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో షోయబ్ మాలిక్ (113–పాకిస్తాన్), రోహిత్ శర్మ (108–భారత్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

**1** అంతర్జాతీయ టి20ల్లో ఇన్నింగ్స్‌లో 50 అంతకంటే ఎక్కువ స్కోరు అత్యధికసార్లు చేసిన ప్లేయర్‌గా రోహిత్ శర్మ (25) నిలిచాడు. ఇప్పటివరకు కోహ్లి (24 సార్లు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ సవరించాడు.

**8** అంతర్జాతీయ టి20ల్లో భారత్ వరుసగా ఎనిమిది మ్యాచ్‌ల్లో నెగ్గడం ఇదే తొలిసారి. గతంలో మూడుసార్లు భారత్ వరుసగా ఏడేసి మ్యాచ్‌ల్లో గెలిచింది.



### సూపర్... సామ్సన్

*న్యూజిలాండ్‌తో ఐదో టి20 మ్యాచ్‌లో భారత ఆటగాడు సంజూ సామ్సన్ ఓపెనర్‌గా విఫలమయ్యాడు. కానీ ఫీల్డర్‌గా సూపర్ సామ్సన్ అయ్యాడు. మెరుపు విన్యాసంతో భారీ సిక్సర్‌ను అడ్డుకున్నాడు. 8వ ఓవర్లో శార్దుల్ వేసిన ఆఖరి బంతిని టేలర్ మిడ్‌వికెట్ మీదుగా భారీషాట్ ఆడాడు. బౌండరీ లైన్ వద్ద కాచుకున్న సామ్సన్ ఎంతో ఎత్తులో సిక్సర్‌గా వెళ్తున్న బంతిని అమాంతం ఎగిరి అందుకున్నాడు. నియంత్రణ కోల్పోయి బౌండరీ లైన్ అవతల పడబోతున్న అతను మెరుపు వేగంతో బంతిని మైదానం లోపలకు విసిరాడు. 6 పరుగులొచ్చే చోట కేవలం 2 పరుగులే వచ్చాయి. అయితే ఇదంతా రెప్పపాటులో జరిగిపోవడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో ఇదే పెద్ద హైలైట్!*

## భారత మహిళల జట్టు ఓటమి

**కాన్‌బెర్రా:** ముక్కోణపు టి20 మహిళల క్రికెట్ టోర్నీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఓడింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 103 పరుగులు చేసింది. స్మృతి (35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్మన్‌ప్రీత్ (28; 4 ఫోర్లు) రాణించారు. ఎలీస్ పెర్రీ (4/13) భారత్‌ను కట్టడి చేసింది. అనంతరం ఆసీస్ 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసి నెగ్గింది. పెర్రీ (49; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

## శుబ్‌మన్ గిల్ డబుల్ సెంచరీ

**క్రైస్ట్‌చర్చ్:** భారత ‘ఎ’ జట్టు బ్యాట్స్‌మెన్ పట్టుదలతో పోరాడి న్యూజిలాండ్ ‘ఎ’తో జరిగిన తొలి అనధికారిక టెస్టును ‘డ్రా’గా ముగించారు. శుబ్‌మన్ గిల్ అజేయ డబుల్ సెంచరీ (204 నాటౌట్; 22 ఫోర్లు, 4 సిక్స్‌లు) సాధించగా... ప్రియాంక్ పాంచల్ (115; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు), కెప్టెన్ హనుమ విహారి (100 నాటౌట్; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు చేసి జట్టును ఆదుకున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 127/2తో చివరి రోజు ఆట కొనసాగించిన భారత్ ‘ఎ’ తమ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 448 పరుగులు చేసింది. మ్యాచ్‌లో ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు మరో 26 ఓవర్ల ఆట మిగిలి ఉండగానే ‘డ్రా’కు అంగీకరించారు.

## హైదరాబాద్ గెలుపు


ఇవనోవ్
సిక్కి రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్ 4–3తో ముంబై రాకెట్స్‌పై గెలిచింది. తొలుత జరిగిన పురుషుల డబుల్స్, పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ల్లో ఓడి 0–3తో వెనుకబడ్డ హైదరాబాద్‌కు సింధు తన విజయంతో ఊరట కలిగించింది. మహిళల సింగిల్స్‌లో సింధు 15–5, 15–10తో శ్రేయాన్షి (ముంబై)పై గెలిచింది. ఇందులో సింధు ‘ట్రంప్ కార్డు’తో ఆడటంతో జట్టుకు రెండు పాయింట్లు లభించాయి. అనంతరం పురుషుల రెండో సింగిల్స్‌లో ప్రియాన్షు (హైదరాబాద్) 15–13, 15–9తో లీ డాంగ్ కెయున్ (ముంబై)పై సంచలన విజయం సాధించడంతో... ఇరు జట్ల స్కోర్లు 3–3తో సమం అయ్యాయి. ఇక విజేతను నిర్ణయించే మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇవనోవ్–సిక్కి రెడ్డి (హైదరాబాద్) ద్వయం 15–8, 15–8 కిమ్ స రంగ్–పియా జెబదియా (ముంబై) జోడీపై గెలుపొంది హైదరాబాద్‌ను విజేతగా నిలిపింది. సిక్కి రెడ్డికి ‘ప్లేయర్ ఆఫ్ మ్యాచ్’ అవార్డు లభించింది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
3-2-2020


**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు (శనివారం ముగింపు)

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 988 ▼ | 300 ▼ |
| 39,736 | 11,662 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,151 | ▼ 148 |
| డోజోన్స్ | 28,256 | ▼ 603 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,286 | ▼ 96 |
| డాక్స్ | 12,982 | ▼ 175 |
| షాంఘై (జనవరి23న) | 2,977 | ▼ 84 |
| నికాయ్ | 23,205 | ▲ 227 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్


**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 71.06 | 72.05 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 92.52 | 94.93 |
| యూరో | ఎస్‌బీఐ | 77.81 | 79.98 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.69 | 66.53 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.25 | 48.96 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.89 | 53.21 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.24 | 19.84 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.96 | 19.96 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.66 | 11.07 |

# క్రమం తప్పకుండా ఆదాయం

తమ పెట్టుబడులు, రాబడులపై ఎటువంటి రిస్క్ వద్దనుకునే వారు పోస్టాఫీసు నెలసరి ఆదాయ పథకాన్ని (పీవోఎంఐఎస్) పరిశీలించొచ్చు. అన్ని వయసుల వారు ఇందులో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ప్రధానమంత్రి వయవందన యోజన, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ వంటివి 60 ఏళ్లు నిండిన వారికి మాత్రమే. కానీ, ఇవన్నీ సురక్షిత సాధనాలు. మూడు నెలలకోసారి అయినా ఫర్వాలేదనుకుంటే అందుకు సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ఈ మూడింటిలో అధిక రాబడులను ఇచ్చే సాధనం. పోస్టాఫీసు ఎంఐఎస్ పథకంలో ప్రస్తుతం పెట్టుబడులపై 7.6 శాతం వార్షిక వడ్డీ లభిస్తోంది. ఒక్కరు గరిష్టంగా రూ.4.5 లక్షలు, అదే జాయింట్‌గా అయితే రూ.9 లక్షల వరకే ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుమతి ఉంది. దీని కాల వ్యవధి ఐదేళ్లు. ఏడాది పూర్తయిన తర్వాత ముందస్తుగా వెనక్కి తీసుకునేందుకు అనుమతిస్తారు. కాకపోతే పెట్టుబడిలో 2 శాతాన్ని తపాలా శాఖ మినహాయించుకుంటుంది. అదే మూడేళ్ల తర్వాత వెనక్కి తీసుకుంటే అప్పుడు ఒక్క శాతమే కోల్పోవాల్సి వస్తుంది. పీవోఎంఐఎస్ పథకం ద్వారా వచ్చే వడ్డీ ఆదాయం ఆ వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఇతర ఆదాయ మార్గంలో దీన్ని చూపించి అవసరమైతే పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

| వివిధ ఆదాయ మార్గాలు: సాధనం | వడ్డీ రేటు(%) |
|---|---|
| పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ | 7.6 |
| ప్రధానమంత్రి వయవందన యోజన | 8 |
| సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ | 8.6 |
| ఇమీడియట్ యాన్యుటీ ప్లాన్లు | 6 |
| బ్యాంకు ఎఫ్‌డీలు | 5.5-7.85 |
| ఏఏఏ రేటింగ్ ఎన్‌బీఎఫ్‌సీ ఎఫ్‌డీలు | 7.4 శాతం ఆపైన |



- ఆశించే రాబడి, రిస్క్ కొలమానాలు
- వీటి ఆధారంగానే ఎంపిక
- ఎఫ్‌డీలు, యాన్యుటీ ప్లాన్లు, ఎస్‌డబ్ల్యూపీలు
- ఎస్‌సీఎస్‌ఎస్, వయవందన యోజన పథకాలు
- కాల వ్యవధి, రాబడి వేర్వేరు

*పదవీ విరమణ చేసిన వారికి ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆదాయం కోసం కచ్చితంగా ఒక ఏర్పాటు అనేది ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత పెన్షన్ ప్రయోజనాలు ఉంటాయి. ప్రైవేటు రంగంలోని వారికి సైతం పదవీ విరమణ తర్వాత పెన్షన్ కోసం ఈపీఎఫ్‌వో అందించే ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్ ఒకటి ఉంది. కానీ, దీనిపై వచ్చే పెన్షన్ చాలా తక్కువ. కనుక ప్రైవేటు రంగంలోని వారు, స్వయం ఉపాధిలో ఉన్న వారు పదవీ విరమణ అనంతరం క్రమం తప్పకుండా ఆదాయ మార్గాల కోసం అన్వేషిస్తుంటారు. వీరికోసం అందుబాటులో ఎన్నో మార్గాలు ఉన్నాయి. అందరికీ తెలిసిన ఫిక్స్‌డ్ డిపాజిట్‌తోపాటు.. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత మొత్తాన్ని ఉపసంహరించుకోవడం (ఎస్‌డబ్ల్యూపీ) ఇలా ఎన్నో. అయితే, అందరికీ అన్నీ అనుకూలంగా ఉంటాయని చెప్పలేం. కనుక ఈ సాధనాలు, వాటిల్లో రాబడులు, రిస్క్ ఏ మేరకు తదితర వివరాలను తెలియజేసే ప్రాఫిట్ కథనం ఇది..*

## వయవందన యోజన

ప్రధాన మంత్రి వయవందన యోజన (పీఎంవీవీవై) కూడా నెలవారీ ఆదాయం కోరుకునే వారికి ఉద్దేశించిన పెట్టుబడి సాధనం. ఇందులో ప్రస్తుతం 8 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంది. కాల వ్యవధి పదేళ్లు. కనీసం రూ.1.5 లక్షలు, గరిష్టంగా రూ.15 లక్షల వరకు ఒక వ్యక్తి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పీఎంవీవీవై ద్వారా వచ్చే వడ్డీ ఆదాయాన్ని కూడా వార్షిక ఆదాయ రిటర్నుల్లో ఇతర ఆదాయ మార్గం కింద చూపించాల్సి ఉంటుంది. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్) పథకంలో పెట్టుబడులను సెక్షన్ 80సీ కింద చూపించుకోవచ్చు. ఈ పథకంలో పెట్టుబడులపై ప్రస్తుతం 8.6 శాతం వడ్డీ రేటు అమలవుతోంది. ఒకరు గరిష్టంగా రూ.15 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లేదా రిటైర్మెంట్ సమయంలో వచ్చిన మొత్తాన్ని.. ఈ రెండింటిలో ఏది తక్కువ అయితే అంత మేరకే ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుమతిస్తారు. 60 ఏళ్లు నిండిన వారు ఎవరైనా ఇందులో పెట్టుబడులకు అర్హులు. అదే ముందస్తు పదవీ విరమణ తీసుకున్న వారు (55–60 ఏళ్ల మధ్య) ఒక నెల వ్యవధి మించకుండా ఇందులో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరం ప్రతీ త్రైమాసికం చివర్లో.. జూన్, సెప్టెంబర్, డిసెంబర్, మార్చి నెల చివరి తేదీన వడ్డీ చెల్లింపులు చేస్తారు.

## యాన్యుటీ ప్లాన్లు

బీమా కంపెనీలు ఆఫర్ చేసే ఇమీడియట్ యాన్యుటీ పథకాలు కూడా నెలవారీ ఆదాయం కోరుకునే వారికి అందుబాటులో ఉన్న సాధనం. వీటిల్లోనూ రిస్క్ తక్కువే. మీరు ఇన్వెస్ట్ చేసిన మొత్తంపై, మరుసటి నెల నుంచే పెన్షన్ అందుకోవచ్చు. కాకపోతే వీటిల్లో పెట్టుబడులపై రాబడులు తక్కువగా ఉంటాయి. వీటిల్లో గరిష్ట రాబడి రేటు కేవలం 6 శాతమే. వీటిపై వచ్చే ఆదాయాన్ని ఇతర మార్గాల కింద వచ్చిన ఆదాయంగా ఐటీఆర్‌లో చూపించాల్సి ఉంటుంది. వీటన్నింటిలోకి రాబడులు ఎస్‌సీఎస్‌ఎస్‌లోనే ఎక్కువ అని చెప్పుకోవాలి. కాకపోతే గరిష్ట పెట్టుబడి రూ.15 లక్షలు. పైగా మూడు నెలలకోసారి మాత్రమే చెల్లింపులు జరుగుతాయి. మొదటి మూడు నెలలకు సరిపడా నిధి మీ వద్ద ఉంచుకుని మిగిలిన మొత్తాన్ని ఎస్‌సీఎస్‌ఎస్‌లో ఇన్వెస్ట్ చేసుకుంటే, ఈ పథకంలో పెట్టుబడులు సౌకర్యంగా, రాబడులు మెరుగ్గా ఉంటాయి. ఇది అనుకూలంగా లేదనుకున్న వారు వయవందన యోజనను పరిశీలించొచ్చు. అలాగే, ఒక పథకంలో గరిష్ట పెట్టుబడి పరిమితికి మించి ఇంకా నిధి మిగిలి ఉంటే అప్పుడు మరో పథకాన్ని ఎంచుకోవచ్చు.

## ఫిక్స్‌డ్ డిపాజిట్లు

రిస్క్ కొంచెం తక్కువ కోరుకునే వారి కోసం బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా ఉన్నాయి. కాకపోతే జాతీయ బ్యాంకుల్లో అయితే దీర్ఘకాలానికి వడ్డీ రేటు 7 శాతం వరకే ఉంది. ఒకవేళ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు ఆసక్తిగా ఉంటే 7–9 శాతం మధ్య వడ్డీ రాబడి పొందొచ్చు. సాధారణంగా బ్యాంకులు త్రైమాసికం వారీగా వడ్డీ చెల్లింపులు చేస్తాయి. అయితే, డిపాజిటర్ కోరితే నెలవారీగా చెల్లింపులు చేసే బ్యాంకులు కూడా ఉన్నాయి. కాకపోతే నెలవారీగా కోరుకుంటే వచ్చే ఆదాయం కాస్త తగ్గుతుంది. ఐసీఐసీఐ బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ మంత్లీ ఇన్‌కమ్ ఆప్షన్ అనే పథకాన్ని నిర్వహిస్తోంది. సాధారణ ఎఫ్‌డీతో పోలిస్తే ఇది భిన్నమైనది. ఇందులో పెట్టుబడి కాల వ్యవధి తర్వాత చెల్లింపుల కాలవ్యవధి ఆరంభమవుతుంది. అంటే 24 నెలల పాటు పెట్టుబడి కాల వ్యవధిని ఎంచుకున్నారనుకుంటే... ఆ తర్వాత, తదుపరి 24 నెలల పాటు చెల్లింపులు జరుగుతాయి. వడ్డీ రేటు 7.25 శాతం. చెల్లింపుల సమయంలో ప్రతి నెలా చెల్లింపులు చేయగా మిగిలిన మొత్తంపై వడ్డీ కలుస్తూ ఉంటుంది.

## ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిట్లు

అధిక రిస్క్ తీసుకునే వారు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు ఆఫర్ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లను పరిశీలించొచ్చు. కాకపోతే మంచి క్రెడిట్ రేటింగ్ ఉన్న వాటినే పరిశీలించడం మంచిది. బ్యాంకులతో పోలిస్తే ఎన్‌బీఎఫ్‌సీలు అధిక రేటును ఆఫర్ చేస్తాయి. అందుకే రిస్క్ ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు ఏఏఏ రేటింగ్ కలిగిన బజాజ్ ఫైనాన్స్ ప్రస్తుతం 7.72 నుంచి 8.05 శాతం వరకు వార్షిక వడ్డీని నెలవారీగా చెల్లింపులపై ఆఫర్ చేస్తోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే ఆదాయాన్ని ఇతర ఆదాయ మార్గం కింద చూపించాల్సి ఉంటుంది. బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50,000 వరకు 60 ఏళ్లు నిండిన వారు మినహాయింపు పొందొచ్చు.

## సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్

మార్కెట్ ఆధారిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తితో ఉన్న వారు మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ)ను పరిశీలించొచ్చు. మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే సాధనం (సిప్)కు ఇది పూర్తి వ్యతిరేకం. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల నుంచి క్రమం తప్పకుండా ఇంత మొత్తాన్ని వెనక్కి తీసుకునేదానిని ఎస్‌డబ్ల్యూపీగా పేర్కొంటారు. తన మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల నుంచి ప్రతీ నెలా ఇంత మొత్తం కావాలని ఏఎంసీకి ఇన్‌స్ట్రక్షన్ ఇస్తే చాలు. మ్యూచువల్ ఫండ్స్‌లోనూ మీ రిస్క్‌ను బట్టి, పూర్తిగా డెట్ లేదా ఈక్విటీ లేదా ఈక్విటీ డెట్ కలయికతో కూడిన ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కాకపోతే ఇన్వెస్ట్ చేసిన మరుసటి నెల నుంచే తీసుకుంటే మొదటి ఏడాది వరకు ఎగ్జిట్‌లోడ్‌ను భరించాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలి. ఇది ఒక శాతంగా ఉండొచ్చు. పైగా ఎస్‌డబ్ల్యూపీపై ప్రతి నెలా వెనక్కి తీసుకునే మొత్తంపై లాభం ఆర్జిస్తే, అది మూలధన లాభాల పన్ను పరిధిలోకి వస్తుంది. ఈక్విటీ పథకాలు అయితే స్వల్పకాల మూలధన లాభాలు (ఏడాదిలోపు)పై 15 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి మించిన పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే మాత్రం.. మూలధన లాభం రూ.లక్ష వరకు ఉంటే పన్ను లేదు. అంతకుమించి ఉంటే ఆ మొత్తంపైనే 10 శాతం పన్ను అమలవుతుంది. ఈక్విటీ కాకుండా ఇతర పథకాలు అయినా మూడేళ్లకు మించి కొనసాగించినట్టయితే అప్పుడు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను 20 శాతం వర్తిస్తుంది. మూడేళ్ల లోపు కాలంలో వచ్చే లాభాలను వార్షిక ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది.

# ఐటీ.. కొత్త విధానం వద్దే వద్దు!




కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు


'మము బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి' అని అందరూ ప్రత్యక్ష పన్నుల విషయంలో మొరపెట్టుకుంటే.. మొండి చెయ్యి చూపించారు సీతమ్మ తల్లి! పన్నుల పరంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సీత కన్నేశారు.. ఇప్పుడిక ఎన్నో లెక్కింపులు, ఉదాహరణలు వచ్చాయి.. ఏతావాతా ఏమిటంటే ఉద్యోగి రామయ్యను నిరాశపరిచారు సీతమ్మ. పన్ను చెల్లింపు దారులతో ఆడుకున్నారు. తాయిలం కోసం ఎదురుచూసే వారికి తాయత్తు మహిమ అంటూ తదిగిణతోం అన్నారు.

తన వాక్చాతుర్యంతో 'ప్రపంచంలోనే తక్కువ రేట్లు మన దేశంలో' అంటూ ఆదాయపు పన్ను(ఐటీ) కొత్త విధానంలో ఆరు శ్లాబులు, ఆరు రేట్లు ప్రతిపాదించి ఉన్న రిబేట్లు, మినహాయింపులు, తగ్గింపులు ఎత్తివేసి ఎంతో పన్ను భారం తగ్గి పోతుంది అని నమ్మబలికారు.

### విశ్లేషణలోకి వెళితే..

- కొత్త శ్లాబులు, రేట్లు ఐచ్ఛికం.
- ఇది ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు అందరికి వర్తిస్తుంది.
- అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్న వంద మినహాయింపుల్లో 70 వాటికి మంగళం పాడారు.
- ఒక గొడ్డలి పెట్టు లాంటి సెక్షన్ ప్రతిపాదించి ముఖ్యమైన లీవ్ ట్రావెల్ అలవెన్స్, స్టాండర్డ్ డిడెక్షన్, వృత్తి పన్ను, సెల్ఫ్ అక్యూపైడ్ ఇంటి రుణంపై వడ్డీ, ఫ్యామిలి పెన్షన్, 80ఈ కింద లభ్యమయ్యే మినహాయింపులను ఎత్తివేసే ప్రయత్నం చేశారు.
- ఎందరో ఆర్థిక వేత్తలు సిఫార్సుల మేరకు సెక్షన్ 80 మినహాయింపుల పరిమితిని పెంచుతారన్న సామాన్యుడి చిన్న చిన్న ఆశలను చిన్నాభిన్నం చేశారు. దీనితో వ్యక్తిగత పన్నులకు సంబంధించి వారు నిరాశకు గురయ్యారు.




- పరిమితిని పెంచకపోగా మినహాయింపులు ఏమీ ఇవ్వం అంటుండటం మరో విషయం.
- ఉద్యోగస్తులు విధిగా జమచేసే భవిష్యనిధి (పీఎఫ్) మొత్తం ఆర్థిక వనరులుగా ఉపయోగపడతాయి.. వారి త్యాగానికి అంతం ఏది?
- అసలే ధరల పెరుగుదల ఒక వైపు.. ఇంటి అద్దెకు మినహాయింపు లేదా?
- వృత్తి పన్నులు చెల్లించినందుకు గుర్తింపు ఏది?
- స్టాండర్డ్ డిడెక్షన్‌కి స్థిరత్వం లేకుండా పోయింది.
- సొంతిల్లు కల సాకారం చేసుకోండి అంటూనే వడ్డీ చెల్లించినందుకు నడ్డి విరుస్తారా..
- ఫ్యామిలీ పెన్షన్ విషయంలో మినహాయింపులుండవా..

*ఇలా ఎన్నో మినహాయింపుల రద్దు నేపథ్యంలో కొత్త విధానం వలన పన్ను భారం తగ్గదు.. పెరుగుతుంది.. 'పొమ్మనలేక పొగపెట్టినట్లు' జరిగింది.. ఇక నుంచి కంపెనీలు ఇచ్చే డివిడెండ్ల విషయంలో మినహాయింపు లేదు. ఇదీ సీతమ్మగారి 'పన్నుల' బడ్జెట్..!*

### కొన్ని వర్గాలకు ప్రయోజనమే..

**ఐటీ ప్రతిపాదనలపై ఆర్థిక మంత్రి**



న్యూఢిల్లీ: కొత్త వ్యక్తిగత ఆదాయ పన్ను ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించుకున్నారు. ఇవి అన్ని వర్గాలకూ ప్రయోజనకరమని చెప్పడానికి లేకపోయినా కొన్ని శ్లాబుల్లోని వారికి కచ్చితంగా ఉపయోగకరమేనని స్పష్టం చేశారు. వీటిపై అవసరమైతే కేంద్రం మరింత స్పష్టతనిస్తుందని ఆమె ఆదివారం చెప్పారు. 'కొత్త విధానంలో మినహాయింపులేమీ లేవని చెప్పినప్పటికీ.. కొన్నింటిని అనుమతిస్తున్నాం. వీటికి సంబంధించి వివరణ ప్రకటనలు విడుదల చేస్తున్నాం. ఏదేమైనప్పటికీ నిర్దిష్ట ఆదాయ బ్రాకెట్‌లో ఉన్న వారికి కొత్త స్కీమ్‌లో కచ్చితంగా ప్రయోజనాలు ఉంటాయనే విశ్వసిస్తున్నాం. పాత దానికంటే ఎక్కువ పన్ను భారం ఉండే విధానాలను ఎందుకు ప్రవేశపెడతాం' అని ఆర్థికమంత్రి పేర్కొన్నారు.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జనవరి-28-2020 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1-2 ఏళ్లు | 3-5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 5.75 | 6 | 6.1 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.4 | 6.5 | 6.5 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 5.9 | 6.25 | 6.25 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.4 | 6.25 |
| కెనరా బ్యాంక్ | 5.9 | 6.3 | 6.25 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.25 | 6.2 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.15 | 6.55 | 6.35 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.05 | 6.3 | 6.3 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6 | 6.3 | 6.4 |
| ఐడీబీఐ బ్యాంక్ | 5.9 | 6.4 | 6.25 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 6.25 | 6.75 | 6.75 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 6.05 | 6.3 | 6.2 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 5.8 | 6.25 | 6.25 |
| పీఎన్‌బీ | 6.1 | 6.3 | 6.25 |
| ఎస్‌బీఐ | 5.8 | 6.1 | 6.1 |
| సిండికేట్ బ్యాంక్ | 5.75 | 6.5 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.5 | 7.25 |

*బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...*

# కళ్లు చెదిరే రాబడులు

ఈక్విటీ పెట్టుబడులపై మంచి రాబడులు కోరుకునే వారు ఎస్‌బీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్‌ను పరిశీలించొచ్చు. ఎందుకంటే ఈ పథకం ఆరంభం నుంచి ఇప్పటి వరకు అన్ని కాలాల్లోనూ అద్భుతమైన రాబడులతో మంచి పనితీరు చూపిస్తోంది. దీనికి కారణం.. అన్ని రకాల మార్కెట్లలోనూ లాభాలు ఇవ్వగల స్టాక్స్‌ను గుర్తించి ఇన్వెస్ట్ చేయడమే. కనుక ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లకు ఈ ఫండ్ మంచి ఆప్షన్ అవుతుంది. ఈ పథకానికి ఆర్ శ్రీనివాసన్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎస్‌బీఐ ఎమర్జింగ్ ఫండ్‌తో నడిచిన ఈ పథకం పేరు ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్‌గా మారింది.

**పెట్టుబడుల విధానం**

ఇన్వెస్టర్లు నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కాకపోతే ఇందుకు ఎంతో పరిశీలన, అధ్యయనం, అనుభవం, విషయ పరిజ్ఞానం అవసరం. ఇంత శ్రమ లేకుండా తగినన్ని రాబడులు తెచ్చిపెట్టే బాధ్యతను మ్యూచువల్ ఫండ్స్ తీసుకుంటున్నాయి. ఇందుకు గాను పెట్టుబడుల నిర్వహణపై ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీలను కూడా వసూలు చేస్తుంటాయి. ఇన్వెస్టర్ల వద్ద చార్జీలు తీసుకున్నప్పుడు, తగినన్ని రాబడులను ఇచ్చినప్పుడే న్యాయం చేసినట్టు అవుతుంది. ఈ విషయంలో ఎస్‌బీఐ ఫోకస్డ్ ఫండ్ పరీక్షకు నిలబడుతుంది. ఇదొక మల్టీక్యాప్ ఫండ్. అంటే స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ ఇలా అన్ని రకాల కంపెనీల్లోనూ ఇన్వెస్ట్ చేసే వెసులుబాటుతో ఉంటుంది. పోర్ట్‌ఫోలియోలో గరిష్టంగా 25 స్టాక్స్ వరకు నిర్వహిస్తుంటుంది. ప్రస్తుతానికి 23 స్టాక్స్ ఉన్నాయి. టాప్ 10 స్టాక్స్‌లోనే 57 శాతం పెట్టుబడులను పెట్టింది. ప్రస్తుతానికి 95 శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించగా, మిగిలిన ఐదు శాతం నగదు, నగదు సమానాల రూపంలో కలిగి ఉంది. మెగాక్యాప్, లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో 60 శాతం, మిడ్‌క్యాప్ కంపెనీల్లో 33 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 7.5 శాతం వరకు ఇన్వెస్ట్ చేసింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 37 శాతం పెట్టుబడులు ఈ రంగ కంపెనీలకు కేటాయించగా, ఆ తర్వాత ఎఫ్‌ఎంసీజీ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ 16 శాతం పెట్టుబడులు కేటాయించింది. తన పోర్ట్‌ఫోలియోలో ఓ విదేశీ స్టాక్‌ను కూడా యాడ్ చేసుకుంది. గూగుల్ మాతృ సంస్థ అయిన ఆల్ఫాబెట్ ఐఎన్‌సీ క్లాస్‌ఏ షేర్లలో 4.14 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. ఈ తరహా స్టాక్స్ ఎంపిక వల్లే ఈ పథకానికి దీర్ఘకాలంలో మంచి రాబడుల ట్రాక్ ఉందని చెప్పుకోవచ్చు.

### ఎస్‌బీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్

ఫండ్ రివ్యూ




**రాబడులు**

ఈ పథకం రాబడుల పనితీరును బీఎస్‌ఈ 500 సూచీ రాబడులతో పోల్చి చూసుకోవచ్చు. అలా చూస్తే, అన్ని కాలాల్లోనూ ఎస్‌బీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్ రాబడుల పరంగా మెరుగ్గా ఉంది. ఏడాది కాలంలో ఈ పథకం 23.60 శాతం రాబడులతో మెరుగైన పనితీరు చూపించింది. కానీ, ఇదే కాలంలో బీఎస్‌ఈ 500 పెరుగుదల 10.80 శాతంతో పోలిస్తే రెట్టింపునకు పైగా రాబడులు అందించింది. అలాగే, మూడేళ్ల కాలంలో ఎస్‌బీఐ ఫోకస్డ్ ఫండ్ వార్షికంగా 16.81 శాతం రాబడులను అందించింది. ఐదేళ్ల కాలంలో వార్షిక రాబడులు 11 శాతం, ఏడేళ్లలో వార్షిక రాబడులు 14.72 శాతం, 10 ఏళ్లలో వార్షికంగా 17.10 శాతం చొప్పున రాబడుల చరిత్ర ఈ పథకానికి ఉంది. ఇలా అన్ని కాలాల్లోనూ బీఎస్‌ఈ 500 సూచీతో పోలిస్తే 2.5 శాతం నుంచి 12.8 శాతం మధ్య అధిక రాబడులను బీఎస్‌ఈ 500 సూచీ కంటే ఇవ్వడం గమనార్హం.

**టాప్ హోల్డింగ్స్**

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 9.19 |
| ఎస్‌బీఐ | 7.23 |
| బజాజ్ ఫైనాన్స్ | 6.92 |
| పీఅండ్‌జీ హైజీన్ | 6.12 |
| యాక్సిస్ బ్యాంకు | 5.12 |
| భారతీ ఎయిర్‌టెల్ | 5.07 |
| దివిస్ ల్యాబ్స్ | 4.97 |
| కోటక్ బ్యాంకు | 4.62 |
| ఆల్ఫాబెట్ ఐఎన్‌సీ | 4.14 |
| ఐసీఐసీఐ లాంబార్డ్ | 4.01 |



వ్యాపారంలో నిజమైన యజమాని కస్టమర్
చైర్మన్ నుంచి ఉద్యోగి వరకూ ఎవరినైనా పీకేయగలడు...
- శామ్యూల్ వాల్టన్, వాల్‌మార్ట్ వ్యవస్థాపకులు

## బొమ్మ-బొరుసు




# 39,630 దిగువన మరింత పతనం

**మార్కెట్ పంచాంగం**


**ఒ**కవైపు కరోనా వైరస్ సంక్షోభంలో విలవిలలాడుతున్న మార్కెట్‌కు వారాంతంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గట్టి షాక్ ఇచ్చారు. జీడీపీ వృద్ధి రేటును పెంచడానికి పలు ప్రోత్సాహకాలు ప్రకటిస్తారన్న మార్కెట్ అంచనాలు తల్లకిందులుకావడంతో ఇన్వెస్టర్లు ఎడాపెడా విక్రయాలు జరిపారు. ఈ షాక్‌ను పూర్తిగా డిస్కౌంట్ చేసుకోవడానికి మరికొన్ని రోజులు మార్కెట్‌కు పట్టవచ్చు. ఇందుకుతోడు కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగితే డౌన్ ట్రెండ్ తీవ్రతరమయ్యే ప్రమాదం వుంటుంది. ఇక సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి...

### సెన్సెక్స్ సాంకేతికాంశాలు...




ఫిబ్రవరి 1తో ముగిసిన ఆరు ట్రేడింగ్ రోజులవారంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ నిలువునా 39,630 పాయింట్ల కనిష్టస్థాయికి పతనమయ్యింది. చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 1,877 పాయింట్ల భారీనష్టంతో 39,736 పాయింట్ల వద్ద ముగిసింది. బడ్జెట్ రోజునాటి కనిష్టస్థాయి అయిన 39,630 స్థాయిని ఈ వారం ప్రారంభంలో కోల్పోతే మార్కెట్ పతనం కొనసాగే ప్రమాదం వుంటుంది. ఈ సందర్భంగా 200 రోజుల చలన సగటు (200 డీఎంఏ) కదులుతున్న 39,245 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 38,850–38,700 శ్రేణి వరకూ క్షీణించవచ్చు. ఈ లోపున 38,388 పాయింట్ల వరకూ పతనం కావొచ్చు. ఇక అనూహ్యంగా మార్కెట్ ట్రెండ్ రివర్స్ అయితే తొలుత 40,050 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన స్థిరపడితే 40,480 పాయింట్ల స్థాయికి, ఆపై 40,710 పాయింట్ల వరకూ ప్రయాణం సాగించవచ్చు.

### 11,655 దిగువన నిఫ్టీ బలహీనం...




బడ్జెట్ సందర్భంగా వారాంతంలో 11,633 పాయింట్ల కనిష్టస్థాయివరకూ పతనమైన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ, చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 586 పాయింట్ల నష్టంతో 11,662 పాయింట్ల వద్ద ముగిసింది. కీలకమైన 200 డీఎంఏ స్థాయికి సెన్సెక్స్ ఇంకా దూరంలో వుండగా, నిఫ్టీ ఇప్పటికే ఆ స్థాయిని (11,655 పాయింట్లు) గత శనివారం ఇంట్రాడేలో కోల్పోయింది. ఈ స్థాయి దిగువన ఈ సోమవారం నిఫ్టీ ట్రేడ్ అయితే రానున్న కొద్దిరోజుల్లో మరింత పతనం కావొచ్చు. ఆ సందర్భంలో తొలుత 11,550–11,490 పాయింట్ల శ్రేణి వరకూ తగ్గవచ్చు. ఈ లోపున కీలకమైన మద్దతు 11,342 పాయింట్ల స్థాయి. ఇది సెప్టెంబర్ 20 నాటి కనిష్టస్థాయి అయిన 10,670 పాయింట్ల కనిష్టం నుంచి జనవరి 20 నాటి గరిష్టస్థాయి 12,430 పాయింట్ల వరకూ జరిగిన 1,760 పాయింట్ల ర్యాలీకి 61.8 శాతం ఫిబోనకి రిట్రేస్‌మెంట్ స్థాయి. ఈ మద్దతును సైతం వదులుకుంటే 11,090 పాయింట్ల దిశగా నిఫ్టీ కదలవచ్చు. ఈ వారం 200 డీఎంఏపైన నిఫ్టీ స్థిరపడితే తొలుత 11,760 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపైన 11,880 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ స్థాయిని సైతం అధిగమిస్తే 11,940 పాయింట్ల వరకూ పెరగవచ్చు.

– పి. సత్యప్రసాద్

# అక్టోబర్ తర్వాత ఎల్‌ఐసీ ఐపీఓ

- పూర్తి చేయాల్సిన ప్రక్రియలు ఎన్నో
- న్యాయ శాఖతో ఇప్పటికే సంప్రదింపులు
- ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్ వెల్లడి

**న్యూఢిల్లీ:** ఎల్‌ఐసీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఈ ఏడాది అక్టోబర్ తర్వాత ఉండొచ్చని ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఎల్‌ఐసీని స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ చేయడానికి చాలా ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉందని, కొన్ని శాసనాత్మక మార్పులు కూడా అవసరమేనని తెలిపారు. ఇప్పటికే న్యాయ మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. దీనికంతటికి సమయం పడుతుందని, వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగంలో (ఈ ఏడాది అక్టోబర్ తర్వాత) ఎల్‌ఐసీ ఐపీఓ ఉండొచ్చని పేర్కొన్నారు. ఐపీఓలో భాగంగా 10 శాతం మేర వాటాను విక్రయించే అవకాశాలున్నాయని, ఇంకా నిర్ణయం తీసుకోలేదని వివరించారు.



**90,000 కోట్లు సమీకరణ !**

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా రూ.2.1 లక్షల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. దీంట్లో భాగంగా ఎల్‌ఐసీ ఐపీఓ, ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా విక్రయం ద్వారా రూ.90,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఎల్‌ఐసీలో వంద శాతం, ఐడీబీఐ బ్యాంక్‌లో 46.5 శాతం చొప్పున కేంద్ర ప్రభుత్వానికి వాటాలున్నాయి. ఈ దశాబ్దపు ఐపీఓగా ఎల్‌ఐసీ ఐపీఓ నిలిచే అవకాశాలున్నాయని నిపుణులంటున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఐపీఓగా అవతరించిన సౌదీ ఆరామ్‌కో తరహా రికార్డ్‌లను ఎల్‌ఐసీ ఐపీఓ సృష్టించగలదని వారంటున్నారు.

**అతి పెద్ద బీమా సంస్థ...**

దేశంలో అతి పెద్ద బీమా సంస్థ ఎల్‌ఐసీయే. 70 శాతానికి పైగా మార్కెట్ వాటా ఈ కంపెనీదే. పాలసీల సంఖ్య పరంగా ఈ కంపెనీ మార్కెట్ వాటా 76 శాతంగా ఉంది. ఐడీబీఐ బ్యాంక్‌తో సహా ఎల్‌ఐసీకి పలు అనుబంధ సంస్థలున్నాయి.




# దేశీ ఆదాయంపైనే పన్ను

- ఎన్‌ఆర్‌ఐ ట్యాక్స్‌పై ఆర్థిక శాఖ వివరణ
- గల్ఫ్ దేశాలు, మర్చంట్ నేవీలో పనిచేసే వారికి ఊరట

**న్యూఢిల్లీ:** ప్రవాస భారతీయుల (ఎన్నారై) ఆదాయాలపై పన్ను విధించే అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టతనిచ్చారు. ఎన్నారైలు భారత్‌లో ఆర్జించిన ఆదాయాలపై మాత్రమే దేశీయంగా పన్ను విధింపు ఉంటుందని వివరణ ఇచ్చారు. ఇతర దేశాల్లో వారికి వచ్చే ఆదాయాలపై ట్యాక్స్ విధించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. 'ఎన్నారైలకు భారత్‌లో వచ్చిన ఆదాయాలపై మాత్రమే ఇక్కడ పన్ను ఉంటుంది. పన్నుల ప్రస్తావన లేని దేశాల్లో వారు ఆర్జించిన ఆదాయంపై ఇక్కడ ట్యాక్స్ విధించం' అని ఆదివారం విలేకరులతో ఆమె తెలిపారు. ఉదాహరణకు భారత్‌లో ప్రాపర్టీ ద్వారా ఎన్నారైలకు వచ్చే అద్దె ఆదాయాలు మొదలైన వాటిపైనే పన్ను ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు, ఎన్నారై హోదాను అడ్డం పెట్టుకుని కావాలని భారత్‌లో పన్నులు ఎగ్గొట్టే వారిని కట్టడి చేసేందుకే నిర్దిష్ట చట్టాన్ని కఠినతరం చేసినట్లు కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఓ ప్రకటనలో తెలిపింది. ఆదాయ పన్ను విధించని ఇతర దేశాల్లో పని చేసే భారతీయులకు, మర్చంట్ నేవీలో పనిచేసే వారికి దీన్నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొంది. దీంతో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయులకు ఊరటనిచ్చినట్లయింది.

ఇతరత్రా ఏ దేశంలోను ఆదాయ పన్నులు చెల్లించని ఎన్నారైలపై దేశీయంగా ట్యాక్స్ విధించేలా 2020–21 బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ ప్రతిపాదన చేశారు. అలాగే ఎన్నారై హోదా పొందాలంటే సదరు వ్యక్తి ఓ సంవత్సరంలో విదేశాల్లో ఉండాల్సిన వ్యవధిని 183 రోజుల నుంచి 245 రోజులకు పెంచారు. ఆదాయ పన్ను విధించని గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల్లో ఈ నిబంధనలు ఆందోళన రేకెత్తించాయి. దీంతో కేంద్రం తాజా వివరణనిచ్చింది. 'చట్టాల్లో లొసుగులు దుర్వినియోగం కాకుండా చూసేందుకే కొత్త నిబంధనలు చేర్చడం జరిగింది. అంతే తప్ప విదేశాల్లో పనిచేస్తున్న వారి ఆదాయాలపై పన్నులు విధించే ఉద్దేశం లేదు. బడ్జెట్ ప్రతిలో ఉపయోగించిన పదాలే ఈ గందరగోళానికి దారి తీసి ఉండొచ్చు' అని రెవెన్యూ విభాగం కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే పేర్కొన్నారు. ఒకవేళ కొత్త నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదురైన పక్షంలో వాటిని పునఃపరిశీలిస్తామని తెలిపారు.



# పన్ను వసూళ్ల లక్ష్యం కుదింపు


- కొత్త శ్లాబ్‌లు ట్యాక్స్‌పేయర్లకు ప్రయోజనకరమే: సీబీడీటీ చైర్మన్

**న్యూఢిల్లీ:** వివిధ ఆర్థిక అంశాల వాస్తవిక స్థితిగతులను మదింపు చేసిన మీదట కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని దిగువముఖంగా రూ. 11.80 లక్షల కోట్లకు సవరించినట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సీబీడీటీ) చైర్మన్ పీసీ మోదీ వెల్లడించారు. '2019–20లో వ్యక్తిగత, కార్పొరేట్ ఆదాయ పన్ను మొదలైన ప్రత్యక్ష పన్నుల వసూళ్లను రూ. 13.35 లక్షల కోట్లుగా ముందుగా నిర్దేశించుకున్నాం. అయితే, భారీగా రీఫండ్‌లు, కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించడం వల్ల గణనీయంగా రెవెన్యూలో కోత పడింది. దీంతో వాస్తవిక పరిస్థితులు పరిశీలించిన తర్వాత దీన్ని రూ. 11.80 లక్షల కోట్లకు సవరించడం జరిగింది. దీన్ని సులభంగానే సాధించగలం' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా రూ. 7.40 లక్షల కోట్ల మేర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు జరిగాయని చెప్పారు. సాధారణంగా ఆఖరు త్రైమాసికంలో (జనవరి–మార్చి) వసూళ్లు గరిష్ట స్థాయిలో ఉంటాయి కాబట్టి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. అటు కార్పొరేట్లు, ఇటు వ్యక్తులకు కూడా పన్నుల ప్రయోజనాలు మరింతగా అందించేందుకే తాజా బడ్జెట్‌లో కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మోదీ చెప్పారు.



# బడ్జెట్ ప్రభావం, ఆర్‌బీఐ సమీక్షపైనే దృష్టి..

- నిరాశపరిచిన బడ్జెట్ పతనం ఈ వారంలోనూ కొనసాగే అవకాశం: రెలిగేర్ బ్రోకింగ్
- మంగళవారం నుంచి 3 రోజులపాటు ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష
- టైటాన్, భారతి ఎయిర్‌టెల్, హీరో మోటోకార్ప్, ఐషర్ మోటార్స్, పీఎన్‌బీ ఫలితాలు ఈవారంలోనే..



**ముంబై:** వారాంతాన జరిగిన ప్రత్యేక ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 988 పాయింట్లు (2.43 శాతం)నష్టపోయి 39,736 వద్ద ముగియగా.. నిఫ్టీ 300 పాయింట్లు (2.51 శాతం) కోల్పోయి 11,662 వద్దకు పడిపోయింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్.. స్టాక్ మార్కెట్ వర్గాలను నిరాశపరిచిన కారణంగా గత 11 ఏళ్లలో లేనంతటి భారీ పతనాన్ని ప్రధాన సూచీలు నమోదుచేశాయి. గడిచిన 16 నెలల్లో ఎన్నడూ లేని అత్యంత భారీ పతనం శనివారం నమోదైంది. కేంద్రం బడ్జెట్ మెప్పించలేకపోయినందున అమ్మకాల ఒత్తిడి ఈ వారంలోనూ కొనసాగే అవకాశం ఉందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ అంశాలు ప్రతికూలంగా ఉండడం, ఇదే సమయంలో బడ్జెట్ ఏ మాత్రం ఆదుకోలేకపోవడం వంటి అంశాల నేపథ్యంలో అమ్మకాలు కొనసాగే అవకాశం ఉందని రెలిగేర్ బ్రోకింగ్ వీపీ రీసెర్చ్ అజిత్ మిశ్రా అన్నారు. వృద్ధికి సంబంధించి చెప్పుకోదగిన చర్యలేమీ నిర్మలా సీతారామన్ ప్రకటించకపోవడం, కొత్త పన్నుల విధానం ఈక్విటీ పెట్టుబడులను నిరాశపరిచే విధంగా ఉండడం అనేవి మార్కెట్‌కు ప్రతికూల అంశాలుగా ఉన్నాయని ఆనంద్ రాఠీ షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజన్ హజ్రా విశ్లేషించారు. బీమా రంగంపై బడ్జెట్ ప్రభావం అధికంగా ఉండనుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ విశ్లేషించారు.

**ఆర్‌బీఐ పాలసీ ఆదుకునేనా..**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమీక్ష ఈ వారంలోనే జరగనుంది. తాజా బడ్జెట్ అంశాలు, భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ద్రవ్యపరపతి విధానాన్ని ఎంపీసీ యథాతథంగా కొనసాగించేందుకు ఆస్కారం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే, ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ మందగమనానికి సంబంధించి ఏవైన ఆశాజనక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని ఎదురుచూస్తున్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ చేతులు కట్టేసిన కారణంగా వడ్డీ రేట్లలో మాత్రం మార్పునకు అవకాశం లేనట్లేనని భావిస్తున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎకనామిస్ట్ దీప్తి మాథ్యూ వెల్లడించారు.

**700 కంపెనీల ఫలితాలు..**

భారతి ఎయిర్‌టెల్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సన్ ఫార్మా, హీరో మోటోకార్ప్, ఐషర్ మోటార్స్, టైటాన్ కంపెనీ, లుపిన్, హెచ్‌పీసీఎల్, సిప్లా, అరబిందో ఫార్మా, టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, టీవీఎస్ మోటార్, ఎం అండ్ ఎం, బ్రిటానియా, గోద్రేజ్ ప్రాపర్టీస్, ఉజ్జీవన్ ల్యాబ్స్ , టాటా గ్లోబల్, అదానీ పోర్ట్స్, జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ, గుజరాత్ గ్యాస్, డీఎల్‌ఎఫ్, కాడిలా హెల్త్‌కేర్, బాష్, బాటా, ఎన్‌ఎండీసీ, మహానగర్ గ్యాస్, యుసీఎల్, ఎసీసీ, వోల్టాస్ కంపెనీల ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసిక ఫలితాలు ఈవారంలోనే వెల్లడికానున్నాయి.

## కెనరా బ్యాంక్ సీఈఓగా ఎల్.వీ ప్రభాకర్ బాధ్యతలు...



**న్యూఢిల్లీ:** కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా ఎల్.వీ ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. ఆర్.ఏ శంకర నారాయణన్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈయన్ను నియమించింది. ఫిబ్రవరి ఒకటి నుంచి మూడేళ్ల కాల పరిమితితో ఈయన నియామకం జరిగినట్లు వెల్లడించింది. ఈ పదవికి ముందు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ప్రభాకర్ సేవలందించారు. అంతక్రితం అలహాబాద్ బ్యాంక్‌లో వివిధ హోదాల్లో ప్రభాకర్ పనిచేశారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 3-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375–00 |
| చిత్తూరు | 393–00 |
| వరంగల్ | 348–00 |
| విజయవాడ | 350–00 |
| గోదావరి | 350–00 |
| 2–2–2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 345–00 |

**స్టాక్ వ్యూ**

## ఎస్‌బీఐ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ.303 **టార్గెట్ ధర:** రూ.400



**ఎందుకంటే:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. రుణ నాణ్యత మెరుగుపడింది. స్థూల మొండి బకాయిలు 6.94 శాతానికి, నికర మొండి బకాయిలు 2.65 శాతానికి తగ్గాయి. సీక్వెన్షియల్‌గా చూస్తే, మొండి బకాయిలకు కేటాయింపులు రూ.11,041 కోట్ల నుంచి రూ.8,193 కోట్లకు చేరాయి. ఎస్సార్ స్టీల్ బకాయిలు రికవరీ కావడం, ఈ బకాయిలకు జరిపిన కేటాయింపులను రైటాఫ్ చేయడం దీనికి కారణం. ఈ క్యూ2లో 81.23 శాతంగా ఉన్న ప్రొవిజనల్ కవరేజ్ రేషియో ఈ క్యూ3లో 81.73 శాతానికి పెరిగింది. రిటైల్ రుణాలు 18 శాతం, మొత్తం రుణాలు 7 శాతం మేర వృద్ధి చెందాయి. డిపాజిట్లు 10% వృద్ధితో రూ,.31.11 లక్షల కోట్లకు పెరిగాయి. నికర వడ్డీ ఆదాయం 22% వృద్ధితో రూ.27,779 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ 3.59 శాతానికి చేరింది. ఇక నికర లాభం 41% వృద్ధితో రూ.5,583 కోట్లకు పెరిగింది. రూ.1,333 కోట్ల పన్ను సర్దుబాటు కారణంగా లాభం తగ్గింది. రెండేళ్లలో రుణాలు 12%, డిపాజిట్లు 9% చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని అంచనా. 2021–22 నాటికి రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్‌ఓఈ) 14%కి పెరగగలదని భావిస్తున్నాం. ఎస్‌బీఐ కార్డ్స్‌లో వాటా విక్రయంతో నిధులు రానుండటం, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.20,000 కోట్ల మేర నిధుల సమీకరణ, రుణ వృద్ధి పుంజుకోవడం, రికవరీలు మెరుగుపడుతుండటం... సానుకూలాంశాలు.

## హిందుస్తాన్ యూనిలీవర్ | బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ.2,074 **టార్గెట్ ధర:** రూ.2,280



**ఎందుకంటే:** ఎఫ్‌ఎమ్‌సీజీ దిగ్గజ కంపెనీ, హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు అంచనాలను మించాయి. డిమాండ్ బలహీనంగా ఉన్నప్పటికీ, గత క్యూ3లో హై బేస్ అయినప్పటికీ, అమ్మకాలు 5 శాతం పెరిగాయి. నిర్వహణ, నికర లాభాలు చెరో 20 శాతం మేర పెరగడం విశేషం. నికర అమ్మకాలు 3 శాతం వృద్ధితో రూ.98,000 కోట్లకు పెరిగాయి. నిర్వహణ లాభం 20 శాతం వృద్ధితో రూ.2,450 కోట్లకు, నికర లాభం 21 శాతం వృద్ధితో రూ.1,690 కోట్లకు పెరిగాయి. నిర్వహణ లాభ మార్జిన్ 3.5 శాతం ఎగసి 24.9 శాతానికి చేరింది. రానున్న నెలల్లో సబ్బుల ధరలను 5–6 శాతం రేంజ్‌లో పెంచనున్నది. అమ్మకాలు, మార్కెట్ వాటాను పెంచుకోవడానికి ఉద్దేశించిన విన్నింగ్ మెనీ ఇండియాస్(డబ్ల్యుఐఎమ్ఐ) వ్యూహం సత్ఫలితాలనిస్తోంది. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను అందిస్తోంది. మార్జిన్లు అధికంగా వచ్చే ప్రీమియమ్ ఉత్పత్తులను పెంచుతోంది. గ్లాక్సో స్మిత్‌లైన్ కన్సూమర్ హెల్త్ (జీఎస్‌కేసీహెచ్)విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) ఆమోదం లభించనుండటం, జీఎస్‌కేసీహెచ్ విలీనం కారణంగా షేర్ వారీ ఆర్జన(ఈపీఎస్) 10 శాతం పెరగనుండటం, రాబడి నిష్పత్తులు అధిక స్థాయిల్లో ఉండటం, టెక్నాలజీని విస్తృతంగా వినియోగించుకోవడం... సానుకూలాంశాలు.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

# ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేయవచ్చా?

**నేను గత కొంత కాలంగా మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. అయితే వీటి రాబడులు ఇప్పుడు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వీటిల్లో నా ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగించమంటారా ? ఆపేయమంటారా ? ఒకవేళ ఆపేస్తే, ఏ కేటగిరీ ఫండ్స్‌లోకి మళ్లించమంటారు?**

*–సిద్ధార్థ, హైదరాబాద్*

దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటేనే మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌ను ఎంచుకోవాలి. కనీసం ఐదు నుంచి ఏడు సంవత్సరాల పాటు ఇన్వెస్ట్ చేయగలిగి, ఈ మధ్య కాలంలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకోగలిగితేనే మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌ను ఎంచుకోవాలి. ఇంత సుదీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేస్తేనే ఇవి సమంజసమైన రాబడులనిస్తాయి. రెండు, మూడేళ్ల పాటు అంతంతమాత్రం రాబడులనిచ్చినా, మార్కెట్ పెరుగుతున్నప్పుడు మాత్రం గతంలోని నష్టాలను కూడా పూడ్చుకొని ఆరోగ్యకరమైన రాబడులనిస్తాయి. అందుకని మీరు కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయగలిగితే, మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌ల్లో మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించవచ్చు. మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయడమనేది గత కొన్నేళ్లలోనే బాగా పెరిగింది. ఇవి మంచి రాబడులనిస్తున్నాయి కదాని చాలా మంది ఇన్వెస్టర్లు వీటిల్లో ఇన్వెస్ట్ చేయడం మొదలు పెట్టారు. అయితే ప్రస్తుతం ఈ ఫండ్స్ పనితీరు నిరాశాజనకంగా ఉండటంతో చాలా మంది ఇన్వెస్ట్‌మెంట్స్‌ను ఆపేస్తున్నారు. కొంతమంది వెనక్కి తీసుకుంటున్నారు. వేరే ఫండ్స్‌లోకి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మళ్లిస్తున్నారు. కూడా. ముందే చెప్పినట్లుగా మీరు కనీసం ఐదు నుంచి ఏడేళ్లపాటు ఇన్వెస్ట్ చేయగలిగితే, మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో మీ పెట్టుబడులను కొనసాగించవచ్చు. మరో ఏడాది, రెండేళ్ల పాటు వీటి రాబడులు అంతంతమాత్రంగానే ఉన్నా, మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించండి. ఒకవేళ ఈ ఫండ్స్ పుంజుకోవడం ప్రారంభిస్తే, మీరు మంచి రాబడులే పొందవచ్చు. మీ ఇన్వెస్ట్‌మెంట్ కాలం ఐదేళ్లలోపే ఉంటే, ఈ ఫండ్స్ నుంచి లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, లేదా హైబ్రిడ్ ఫండ్స్‌లోకి మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మళ్లించండి.




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్)ల్లో ఇన్వెస్ట్ చేయవచ్చా ? ఇన్వెస్ట్ చేయడానికి కొన్ని మంచి ఈటీఎఫ్‌లను సూచించండి.**

*–కృష్ణన్, చెన్నై*

ఇండెక్స్‌ను ట్రాక్ చేసే ఫండ్స్‌ను ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)గా చెప్పుకోవచ్చు. ఇండెక్స్ పనితీరును ఈ ఈటీఎఫ్‌లు ప్రతిబింబిస్తాయి. ఇవి స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడవుతాయి. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం కంటే ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేయడం కొంచెం భిన్నంగా ఉంటుంది. షేర్లను కొనుగోలు చేసినట్లుగానే, ఈటీఎఫ్‌లను కొనుగోలు చేయవచ్చు. మీరు ఒక ఫండ్‌ను కొనుగోలు చేయడం కోసం రూ.10,000 ఇన్వెస్ట్ చేశారనుకుందాం. ఆరోజు సాయంత్రం ఉన్న ఎన్‌ఏవీ ధరకు మీకు ఆ ఫండ్ యూనిట్లు అలాట్ అవుతాయి. అదే ఈటీఎఫ్ విషయానికొస్తే, మీరు ఏ ధరకు కావాలనుకుంటే, ఆ ధరకు ఆర్డర్ పెట్టవచ్చు. ఈ ఈటీఎఫ్‌లు ట్రేడయ్యే ధరకు, ఎన్‌ఏవీలకు స్వల్పంగా తేడాలు ఉండవచ్చు. ఇక మీరు ఇన్వెస్ట్ చేయడానికి ఎస్‌బీఐ నిఫ్టీ 50 ఈటీఎఫ్, మోతిలాల్ ఓస్వాల్ నాస్‌డాక్ 100 ఈటీఎఫ్‌లను పరిశీలించవచ్చు. ఎస్‌బీఐ నిఫ్టీ 50 ఈటీఎఫ్‌కు వ్యయాలు చాలా తక్కువగా ఉన్నాయి. లార్జ్ క్యాప్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే ఈ ఈటీఎఫ్‌ను పరిగణనలోకి తీసుకోవచ్చు. అంతర్జాతీయ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, నాస్‌డాక్ 100 ఆధారిత ఈటీఎఫ్–మోతిలాల్ ఓస్వాల్ నాస్‌డాక్ 100 ఈటీఎఫ్‌ను పరిశీలించవచ్చు.

**నేను ఇటీవలే రిటైరయ్యాను. కొన్ని స్మాల్ క్యాప్ ఫండ్స్‌ల్లో నా ఇన్వెస్ట్‌మెంట్స్ ఉన్నాయి. రిటైరయ్యాను కాబట్టి, ఈ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్‌మెంట్స్ ఆపేయమని మిత్రులు సూచిస్తున్నారు. నన్నేం చేయమంటారు?**

*–నరసింగరావు, విశాఖపట్టణం*

స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేవారికి మార్కెట్ పట్ల ఒకింత అవగాహన ఉండి తీరాలి. మార్కెట్ ఒడిదుడుకుల పట్ల అవగాహన ఉన్న వారికి స్మాల్ క్యాప్ ఫండ్స్ పనితీరు కూడా అర్థమవుతుంది. ఒక సాధారణ ఇన్వెస్టర్ తన మొత్తం ఇన్వెస్ట్‌మెంట్స్‌లో స్మాల్ క్యాప్ ఫండ్స్‌కు 10 శాతం కంటే మించి కేటాయించకూడదు. మీరు రిటైరైనప్పటికీ, మొత్తం ఇన్వెస్ట్‌మెంట్స్‌లో 10 శాతం లోపే ఈ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ వీటి ప్రభావం మొత్తం పోర్ట్‌ఫోలియోపై పెద్దగా ఉండదు.


మీ ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా ఇదే రేంజ్‌లో ఉంటే నిరభ్యంతరంగా మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించవచ్చు. ఈ ఫండ్స్ పనితీరు అంతంతమాత్రంగానే ఉన్నా, నష్టాలు వచ్చినా, మీ పోర్ట్‌ఫోలియోలో పెద్దగా ప్రభావం పడదు కాబట్టి. పెట్టుబడులను కొనసాగించండి. మార్కెట్ పుంజుకుంటే గతంలో అంతంత మాత్రం రాబడులు ఇచ్చిన స్మాల్ క్యాప్ ఫండ్స్ మంచి రాబడులనే అందివ్వగలవు. ఒక వేళ మీ మొత్తం నిధుల్లో స్మాల్ క్యాప్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్10 శాతానికి మించి ఉన్నట్లయితే అప్పుడు ఈ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి అధిక భాగాన్ని వేరే ఫండ్స్‌లోకి మళ్లించండి. మల్టీ క్యాప్ లేదా అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్స్‌కు ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను బదిలీ చేస్తే మంచిది.

**Rajiv Gandhi University of Knowledge Technologies**
Chancellor's Camp Office, RGUKT Nuzvid campus,
Nuzvid, Krishna District, Andhra Pradesh- 521202.
Ref No.: RGUKT/E-Proc/Catering/Mess/Feb/2020 Date: 03-02-2020
**E-PROCUREMENT - TENDER NOTICE**
Online Tenders are invited from reputed registered agencies/contractors for providing Catering Services including Maintenance of Kitchen and Dining Halls for the messes of RGUKT campuses located at Nuzvid, RK Valley, Srikakulam and Ongole.
**Bidders should submit their bids for each campus separately.**
Interested bidders can download and submit the bids online from 03.02.2020 to 28.02.2020 up to 05:00 PM through https://tender.apeprocurement.gov.in (AP Portal).
For further details please visit our websites : www.rgukt.in, www.rguktn.ac.in, www.rguktrkv.ac.in, www.rguktong.ac.in, www.rguktsklm.ac.in or https://tender.apeprocurement.gov.in.
Sd/-
Office of the Chancellor

**GREATER WARANGAL SMART CITY CORPORATION LIMITED**
**Tender Notice**
No.GWSCCL/CTN/05/e-procurement/2019-20 Dated: 01-02-2020
N.W: 3 No.s of Central Lighting Works in various locations of GWMC under Smart City Grants.
Estimated Amount: **Rs. 3.983 Crores.**
Start & Last Date of receipt of bids: **04-02-2020 & 14-02-2020**
Note: Further details can be seen @ "e"procurement market place @ **www.tender.telangana.gov.in**
Sd/- Managing Director & Chief Executive Officer
Greater Warangal Smart City Corporation Limited

**ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION IMITED**
HEAD OFFICE:10-152/1,SRISAI TOWERS, BANDAR ROAD KANURU, VIJAYAWADA-520007.
Lr.No.PDS.3/32/PU (PPP)/2019 DATED: 02.02.2020.
TENDER NOTICE FOR APPOINTMENT OF STORAGE AND PACKING AGENCY FOR STORAGE AND PACKING OF RICE
*****
APSCSCL desires to appoint Agency for packing of rice with their own packing machine in their own/lease godown. Rice shall be repacked from 50kg Jute bags into PP bags of 5kg, 10kg, 15kg and 20kg to be utilized for Public Distribution System.
Applications are invited to participate in the tender process for appointment of Storage and packing Agency. For details, please visit www.apscsc.gov.in and www.apeprocurement.gov.in (or) contact on 7702003515, 08645-246370/ 71/ 72/ 73/74. Last date for receiving applications along with EMD would be 10th February 2020, 5.00 pm. The EMD shall be transferred through Direct Debit Facility utilizing Debit or Credit Card/ Net Banking / Deposit through system generated challan in e-procurement website.
The date of online reverse auction will be conducted on https://konugolu.ap.gov.in platform as per the time schedule mentioned in the tender document.
Sd/- A Surya Kumari, IAS, VC & Managing Director

## క్లుప్తంగా...



ఇస్రో నూతనంగా రూపొందించిన జియో ఇమేజింగ్ శాటిలైట్ (జీఐశాట్-1) నమూనా

### 25న జియో ఇమేజింగ్ శాటిలైట్ ప్రయోగం

- జీఎస్ఎల్వీ ఎఫ్ 10 రాకెట్ ద్వారా నింగిలోకి
- షార్ రెండో ప్రయోగవేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్న శాస్త్రవేత్తలు

**సూళ్లూరుపేట:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నూతనంగా రూపొందించిన 2,275 కిలోల బరువు కలిగిన జియో ఇమేజింగ్ శాటిలైట్ (జీఐశాట్–1)ను ఈ నెల 25వ తేదీన ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి జీఎస్ఎల్వీ ఎఫ్ 10 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. బెంగళూరులోని యూఆర్ రావు స్పేస్ సెంటర్ నుంచి జీఐశాట్–1 ఉపగ్రహం డిసెంబర్ 23న షార్‌కు చేరుకుంది. ప్రణాళిక ప్రకారం జనవరి 15న ఈ ప్రయోగం జరగాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఫిబ్రవరి 10కి వాయిదా వేశారు. అయితే రాకెట్‌కు శిఖరభాగాన ఉపగ్రహాన్ని అమర్చి హీట్‌షీల్డ్ క్లోజ్ చేసే క్రమంలో తలెత్తిన లోపంతో ప్రయోగాన్ని ఫిబ్రవరి 25వ తేదీకి వాయిదా వేశారు.

### 'పాప'పు లోకాన్ని విడిచి వెళ్లింది

**మర్పల్లి:** తనను కని చెత్తబుట్టలో పారేసిన ఈ పాడు లోకాన్ని చూడకుండానే ఓ పసికందు మృతిచెందింది. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పంచలింగాలలో అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వారు ముళ్ల పొదల్లో పడేసిన సంఘటన విదితమే. ఆ పసి కందును ఓ కుక్క ఎత్తుకు పోతుండగా గుర్తించిన ఓ రైతు ఆ కుక్కను తరిమివేసి పాపను తీసుకున్నాడు. వెంటనే అధికారులు, పోలీసుల సహాయంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతున్న ఆ పాప ఆదివారం మృతిచెందింది. మర్పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కృష్ణవేణి ఆదేశానుసారం మర్పల్లి ఎస్ఐ సతీశ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని హైదరాబాద్‌లోని మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు.



ఆస్పత్రిలో పసికందు (ఫైల్)

### ఆకతాయి అల్లుడు... మామకు చిక్కులు


- స్థానికులతో మేనమామను కొట్టించిన బాలుడు
- పోలీసుస్టేషన్‌కు వెళ్లిన మేనమామ

**అంబర్‌పేట:** ఓ బాలుని ఆకతాయితనం సొంత మేనమామకే చిక్కులు తెచ్చి పెట్టింది. సంబంధం లేని వారి చేతిలో అకారణంగా దెబ్బలు తినడమే కాకుండా పోలీసు స్టేషను గడప తొక్కాల్సి వచ్చింది. సినిమా ట్విస్టును తలపించే ఈ సంఘటన ఆదివారం అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మల్లేశ్ కథనం ప్రకారం.. పటేల్‌నగర్‌లో నివసించే లత కుమారుడు కార్తీక్ స్థానికంగా ఓ పాఠశాలలో 3 వ తరగతి చదువుతున్నాడు. ఓ వస్త్రదుకాణంలో పనిచేస్తున్న తల్లి ఆ విధుల నిమిత్తం ఉదయం బయటకు వెళ్తూ తన తమ్ముడు ప్రవీణ్‌కు ఫోన్ చేసి కార్తీక్‌కు క్షవరం చేయించుకు రావాల్సిందిగా కోరింది. దీంతో అతను కాచిగూడలో ఉన్న సెలూన్‌కు మేనల్లుడ్ని ఆటోలో తీసుకెళ్లాడు. అనంతరం ఆటోలో అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ వరకు వచ్చిన ప్రవీణ్ , తాను వేరే పనులపై వెళ్లేందుకు... అక్కడి నుంచి కార్తీక్‌ను ఇంటికి తీసుకెళ్లాల్సిందిగా తన తమ్ముడు అశ్విన్‌ను పిలిచి అప్పగించి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో వారు నడుచుకుంటూ వెళ్తుండగా బాలుడు చిన్నమామను ఎటువైపు తీసుకెళ్తున్నావని నిలదీస్తూ ఏడుపు మొదలు పెట్టాడు. దారిలో వీరిని గమనించిన వారు ఏమైందని ప్రశ్నించడంతో అతనెవరో తనకు తెలీదని, తనను కొడుతున్నాడంటూ మామపైనే వారికి కార్తీక్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు అశ్విన్ చెప్పింది వినిపించుకోకుండా అతడిని చితకబాదారు. అనంతరం అశ్విన్‌ను, బాలుడిని అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. పోలీసుల వద్దకూడా కార్తీక్ తనకు అశ్విన్ తెలియదనే చెప్పడంతో వారూ తొలుత ఆ మాటల్నే నమ్మారు. అంతే కాకుండా తన పేరు, ఫిర్యాదు సైతం రాసుకోవాలని కోరాడు దీంతో పోలీసులు సైతం ఆశ్చర్యపోయారు. ఈ నేపథ్యంలో అశ్విన్ తన అన్న ప్రవీణ్‌కు ఫోన్ చేయడంతో అతను పోలీసుస్టేషన్‌కు వచ్చి అతను తన తమ్ముడేననీ, కార్తీక్ తమ అక్క కొడుకేనని చెప్పాడు. బాలుడు కూడా ప్రవీణ్‌ను చూసి తన మామ అని చెప్పడం విశేషం. చివరకు సోదరులిరువురూ తమ సోదరి లతతో పోలీసులతో మాట్లాడించడంతో కథ సుఖాంతం అయ్యింది. బాలుడ్ని పెద్దమామతో పోలీసులు పంపించేశారు.

# ఈ సమ్మర్.. సుర్రు

## 'గ్రేటర్'లో ఈ వేసవిలో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు

- హైదరాబాదీలపై పడనున్న తీవ్ర ప్రభావం
- సాధారణం కంటే 5 డిగ్రీల వరకు అధికంగా నమోదు!
- ఫిబ్రవరిలోనే పెరుగుతున్న యూవీ ఇండెక్స్ సూచిక
- సాధారణం కంటే 2 పాయింట్లు అధికం...




**గ్రీన్‌బెల్ట్ శాతం పలు మెట్రో నగరాల్లో ఇలా..**

| స్థానం | నగరం | హరితం శాతం |
|---|---|---|
| 1 | చండీగఢ్ | 35 |
| 2 | ఢిల్లీ | 20.20 |
| 3 | బెంగళూరు | 19 |
| 4 | కోల్‌కతా | 15 |
| 5 | ముంబై | 10 |
| 6 | చెన్నై | 9.5 |
| 7 | హైదరాబాద్ | 8 |

**సాక్షి, హైదరాబాద్:** గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో ఈసారి వేసవిలో గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీనికి సూచకంగా కాంక్రీట్ మహారణ్యంలా మారిన మహానగరంలో ఫిబ్రవరి నెల ప్రారంభంలోనే అతినీలలోహిత వికిరణం (అల్ట్రావయొలెట్ రేడియేషన్) తీవ్రత '7'పాయింట్లకు చేరుకోవడంతో ఉక్కపోత, చర్మం, కళ్ల మంటలతో సిటిజన్లు విలవిల్లాడుతున్నారు. సాధారణంగా ఈ నెలలో యూవీ సూచీ 5 పాయింట్లకు మించరాదు. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే ఏప్రిల్, మే నెలల్లో యూవీ సూచీ 12 పాయింట్లు చేరుకునే ప్రమాదం పొంచి ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. గ్రేటర్ విస్తీర్ణంలో హరితం 8 శాతానికే పరిమితం కావడం, ఊపిరి సలపని రీతిలో నిర్మించిన బహుళ అంతస్తుల కాంక్రీటు, గాజు మేడల నుంచి ఉష్ణం వాతావరణంలో తేలికగా కలవకుండా భూఉపరితల వాతావరణానికే పరిమితం కావడంతో ఫిబ్రవరి నెలలోనే వికిరణ తీవ్రత పెరిగి ఒళ్లు, కళ్లు మండిపోతున్నాయని హైదరాబాదీలు గగ్గోలు పెడుతున్నారు.

**పెరిగే 'యూవీ'తో ఇక్కట్లు..**

అతినీలలోహిత వికిరణ తీవ్రత (యూవీ ఇండెక్స్) పెరగటంతో ఓజోన్ పొర మందం తగ్గి ప్రచండ భానుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూ వాతావరణంలోకి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో కిరణాలు మనుషులపై పడుతుండటంతో కళ్లు, చర్మ సంబంధ వ్యాధులతో విలవిల్లాడుతున్నారు. అధిక సమయం ఎండలో తిరిగితే కళ్లు, చర్మం మండటం, రెటీనా దెబ్బతినడం వంటి విపరిణామాలు తలెత్తుతున్నాయి. యూవీ సూచీ సర్వసాధారణంగా 5 పాయింట్లకు పరిమితమైతే ఎలాంటి ఇబ్బందులుండవు. కానీ 10 పాయింట్లు నమోదైతే ప్రమాదం తథ్యం. ఇక యూవీ సూచీ 12 పాయింట్లు దాటితే చర్మ కేన్సర్‌లు పెరిగే ప్రమాదం పొంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లే సమయంలో వికిరణ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు సన్ స్కిన్ లోషన్లు రాసుకోవాలని, చలువ కళ్లద్దాలు, క్యాప్ ధరించాలని, ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు గొడుగు తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

**హరితహారం పనిచేయలేదు..**

మహా నగరాన్ని గ్రీన్‌సిటీగా మార్చేందుకు ప్రభుత్వం ఉద్యమస్ఫూర్తితో తలపెట్టిన హరితహారం కార్యక్రమం ఉద్దేశం బాగానే ఉన్నా.. నగరంలో గ్రీన్‌బెల్ట్‌ను గణనీయంగా పెంచేందుకు దోహదం చేయలేదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హరితహారంలో భాగంగా గతేడాది 95 శాతం ఇళ్లలో పెంచుకునే కరివేపాకు, తులసి, ఉసిరి, క్రోటన్స్, పూల మొక్కలను పంపిణీ చేశారని.. బహిరంగ ప్రదేశాలు, ప్రధాన రహదారులు, పార్కులు, ఖాళీ స్థలాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ, ప్రైవేటు సంస్థల్లో ఏపుగా పెరిగి ఆక్సిజన్ శాతాన్ని పెంచే రావి, మద్ది, మర్రి, చింత వంటి మొక్కలు ఇందులో 5 శాతం మాత్రమే నాటినట్లు పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో గ్రేటర్‌లో గ్రీన్‌బెల్ట్ 8 శాతానికే పరిమితమైందని.. ప్రభుత్వం చేపట్టిన హరితహారంతో గ్రీన్‌బెల్ట్ 15 శాతానికి పెరగటం అసాధ్యమని స్పష్టం చేస్తుండటం గమనార్హం. గ్రీన్‌బెల్ట్ విషయంలో దేశంలో పలు మెట్రో నగరాల్లో మహానగరం ఏడో స్థానంలో నిలిచిందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

**హరితం తగ్గుముఖం..**

శతాబ్దాలుగా తోటల నగరం (బాగ్) గా ప్రసిద్ధి చెందిన భాగ్యనగరంలో ఇప్పుడు హరిత వాతావరణం రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. రహదారులు, బహుళ అంతస్తుల భవంతులు శరవేగంగా విస్తరిస్తుండటంతో కాంక్రీట్ మహారణ్యంలా మారిన నగరంలో హరిత వాతావరణం క్రమేణా కనుమరుగై మహా నగర పర్యావరణం త్వరగా వేడెక్కుతోంది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం మహానగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిలో 30 శాతం గ్రీన్‌బెల్ట్ (హరిత వాతావరణం) ఉండాల్సి ఉండగా.. నగరంలో కేవలం 8 శాతమే గ్రీన్‌బెల్ట్ ఉండటంతో నగరంలో ప్రాణవాయువు కనుమరుగై సిటిజన్లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శరవేగంగా రహదారుల విస్తరణ, బహుళ అంతస్తుల భవంతులు, వాణిజ్య సముదాయాల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నా.. గ్రీన్‌టాప్ అంతకంతకూ పెరగకపోవడంతో మోటారు వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న గ్రీన్‌హౌజ్ వాయువులైన కార్బన్‌డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి వాయువుల ఉద్గారాలు పెరిగి వేసవి తాపం ఉక్కిరిబిక్కిరి చేస్తోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కరోనా హైఅలర్ట్

- వైద్య కళాశాలల్లో చికిత్సకు ఏర్పాట్లు చేయండి
- నేటి నుంచి గాంధీలో కరోనా నిర్ధారణ పరీక్షలు
- వైద్య ఆరోగ్య అధికారులతో మంత్రి ఈటల సమీక్ష



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కరోనా వైరస్ హైఅలర్ట్ నేపథ్యంలో అన్ని మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆస్పత్రుల్లో అనుమానిత కేసులకు చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆదేశించారు. ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పల్మనాలజిస్టులు అందరూ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. సోమవారం నుంచి గాంధీ మెడికల్ కాలేజీలో కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. ఇప్పటివరకు తెలంగాణలో ఒక్క కేసు కూడా పాజిటివ్‌గా నమోదు కాలేదన్నారు. చైనా నుంచి వచ్చిన ప్రతి ఒక్కరూ ఫీవర్, గాంధీ, ఛాతీ ఆస్పత్రులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రుల్లో చేరినవారికి చికిత్స అందించేందుకు అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు.

**పర్యవేక్షణలో చైనా నుంచి వచ్చినవారు..**


గత 3 రోజుల్లో చైనా నుంచి 15 మంది రాష్ట్రానికి వచ్చినట్లు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం అందింది. కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల్లో మొత్తం 35 మంది వరకు ఫోన్లు చేశారని, వారిలో 15 మంది చైనా నుంచి వచ్చినట్లు తెలిపింది. అయితే వారెవరికీ కూడా కరోనా అనుమానిత లక్షణాలు లేవని, అయితే వైరస్ బయటపడేందుకు 14 రోజుల సమయం పడుతుంది కాబట్టి తమ ఇళ్ల నుంచి బయటకు వెళ్లకుండా ఉండాలని వారిని కోరినట్లు తెలిపారు. అంతేగాకుండా వారి వివరాలన్నింటినీ సేకరించి తమ వద్ద పెట్టుకున్నామని పేర్కొన్నారు. వారుండే ప్రాంతాలు, జిల్లాల వైద్యాధికారులు, సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు సమాచారం ఇచ్చామని, వారిలో వచ్చే మార్పులను గమనిస్తున్నామన్నారు. వారి వివరాలు తెలిపితే పక్కనున్న ఇళ్లల్లోని ప్రజలు దూరం పెట్టే అవకాశముందని, అందుకే వారి సమాచారం ఏమాత్రం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

## రోజూ 30 మందికి కరోనా పరీక్షలు

**గాంధీలో నేటి నుంచి పూర్తిస్థాయిలో..**

- 10 గంటల్లోనే వ్యాధి నిర్ధారణ నివేదిక
- 19 మంది ఆస్పత్రుల్లో చేరిక.. 11 మందికి నెగిటివ్
- వీరిలో ఇద్దరికి స్వైన్‌ఫ్లూ నిర్ధారణ..

**సాక్షి, హైదరాబాద్:** ప్రాణాంతకమైన కరోనా వైరస్‌పై వైద్య ఆరోగ్యశాఖ మరింత అప్రమత్తమైంది. ఇప్పటికే గాంధీ, ఫీవర్, ఛాతీ, సరోజినిదేవి కంటి ఆస్పత్రుల్లో తాత్కాలికంగా 100 పడకలను ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్యశాఖ.. ఇకపై వ్యాధి నిర్ధారణ పరీక్షలను పూర్తిగా గాంధీ ఆస్పత్రి వైరాలజీ ల్యాబ్‌లోనే చేయనుంది. ట్రయల్‌రన్‌లో భాగంగా ఇప్పటికే పలు నమూనాలను పరీక్షించి పుణే వైరాలజీ ల్యాబ్ ఇచ్చిన తుది నివేదికతో పోల్చి చూశారు. రెండు ల్యాబుల్లోనూ ఒకే రకమైన రిపోర్టులు రావడంతో పరీక్షలు గాంధీలోనే చేయాలని నిర్ణయించారు. సోమవారం నుంచి పూర్తి స్థాయి పరీక్షలు చేయనున్నారు. రోజుకు 30 మందికి పరీక్షలు చేసే సామర్థ్యం ఇక్కడ ఉంది. అంతే కాదు 10 గంటల్లోనే రిపోర్టులు రానుండటంతో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.




**గాంధీ నుంచి మియాపూర్ వాసి డిశ్చార్జ్..**

చైనా నుంచి ఇటీవల నగరానికి చేరుకుని, కరోనా వైరస్ సోకిందేమోనన్న అనుమానంతో వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం గత నెల 28 నుంచి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో 18 మంది చేరారు. వీరిలో గోదావరిఖనికి చెందిన తండ్రి, కూతుళ్లకు స్వైన్‌ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణ కాగా.. మొత్తం 10 మందికి నెగిటివ్ రిపోర్టు వచ్చింది. మరో 8 మంది బాధితులకు సంబంధించిన రిపోర్టులు రావాల్సి ఉంది. ప్రస్తుతం వీరిని ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్సలు అందిస్తున్నారు. 3 రోజుల క్రితం గాంధీలో చేరిన మియాపూర్‌కు చెందిన వ్యక్తి(39)కి సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్ష నెగిటివ్ రిపోర్టు రావడంతో వైద్యులు ఆయన్ను ఆదివారం డిశ్చార్జ్ చేశారు.

**ఎన్–90 మాస్కులు ధరించాలి..**

వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, రిపోర్టులో నెగిటివ్ అని తేలడంతో ఊపిరి పీల్చుకుని ఆయా ఆస్పత్రుల నుంచి ఇంటికి వెళ్లిపోయిన బాధితులకు వైద్యులు కీలక సూచనలు చేశారు. బాధితులు 20 రోజుల పాటు ఇంట్లో నుంచి బయటికి రావొద్దని సూచించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అనుమానిత బాధితులతోపాటు వారి కుటుంబ సభ్యులంతా ఎన్–90 మాస్కులు ధరించాల్సిందిగా సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఆలింగనాలను, షేక్‌హ్యాండ్‌లకు దూరంగా ఉండటం, సాధ్యమైనంత వరకు జన సమూహాల్లోకి వెళ్లకపోవడం, తుమ్మినా, దగ్గినా ముక్కుకు అడ్డుగా మాస్కులు పెట్టుకోవడం వల్ల వైరస్‌ల భారీన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# చైనాలో తెలుగు వారు ఆందోళన చెందొద్దు

- వారి క్షేమంకోసం కేంద్రం చర్యలు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** చైనాలోని తెలుగు వైద్య విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, కేంద్ర ప్రభుత్వం అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆదివారం ఉదయం ఢిల్లీ తెలుగు సంఘాలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీలు సోయం బాపూరావు, బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఏపీ ఎమ్మెల్సీ మాధవ్, ఏపీ మాజీ మంత్రి మాణిక్యాల రావు, బీజేపీ నేత పి. రఘురాం, ఢిల్లీ తెలుగు సంఘాల నేతలు హాజరయ్యారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషిచేయాలని కిషన్‌రెడ్డి వారిని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరోనా వైరస్‌కు సంబంధించి కేంద్రం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానంలో మనవారిని చైనా నుంచి ఇండియాకు తరలిస్తున్నామన్నారు. శనివారం 324 మంది, ఆదివారం మరికొంత మందిని తరలించామని, వారిని 15 రోజులు పరిశీలనలో పెట్టినట్లు తెలిపారు. బడ్జెట్‌పై స్పందిస్తూ..'కేంద్ర బడ్జెట్ చాలా బాగుంది.. అన్ని రాష్ట్రాలకు సమానమైన నిధులు కేటాయించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ అనవసరంగా కేంద్రంపై విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ఇస్తామని కేంద్రం చెప్పలేదు..'అని పేర్కొన్నారు.

**తెలంగాణలో నియంతృత్వ పాలన**

ప్రజా ఉద్యమ ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగిస్తూ భావ ప్రకటన స్వేచ్ఛను టీఆర్ఎస్ ప్రభుత్వం హరిస్తోందని మండిపడ్డారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టులపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. నిర్మల్ జిల్లా భైంసాలో ఎంఐఎం అండతో ఓ వర్గానికి చెందినవారు మరొక వర్గానికి చెందిన వారిపై జరిపిన దాడుల్లో బాధితుల ఆవేదనను బయట ప్రపంచానికి తెలియజేసిన జర్నలిస్టు సిద్ధూపై పోలీసులు కేసులు పెట్టడం అక్రమమని తెలిపారు. సిద్ధూ విషయంలో ప్రభుత్వం, పోలీసుల వైఖరిని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టు సిద్ధూకు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంపై తాను తెలంగాణ డీజీపీతో మాట్లాడతానని కిషన్‌రెడ్డి తెలిపారు.



మంటలు రాకుండా ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

# కోనసీమలో గ్యాస్ బ్లో అవుట్

**ఉప్పూడి–1లోని ఓఎన్‌జీసీ బావిలోంచి ఎగసిపడుతున్న గ్యాస్**

**ఉప్పూడి నుంచి సాక్షి ప్రతినిధి:** ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కోనసీమ ఉలిక్కిపడింది. ఓఎన్‌జీసీ బావిలో గ్యాస్ బ్లో అవుట్ సంభవించడంతో ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారు. గాలి ఎటువేస్తే అటు వైపు గ్యాస్ మళ్లుతుండటంతో పరిసర ప్రాంతాలు భయం గుప్పెట్లో ఉన్నాయి. కాట్రేనికోన మండలం ఉప్పూడి గ్రామంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఓఎన్‌జీసీ బావి నుంచి ఒక్కసారిగా గ్యాస్ పెద్ద శబ్దంతో ఎగసిపడింది. ఆ సమయంలో అక్కడే పనిచేస్తున్న పీఎఫ్‌హెచ్ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన ఇద్దరు ఉద్యోగులు గ్యాస్‌ను అదుపుచేసే యత్నం చేశారు. ఇంతలో వెల్ క్యాప్ నుంచి ఒక్కసారిగా భారీ శబ్దంతో విస్ఫోటనం సంభవించింది. దానికి దగ్గరగా ఉన్న ఇద్దరూ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పుకున్నట్టు వీడియోలో కనిపిస్తున్నా కొద్దిసేపటి తర్వాత ఆ ఇద్దరి ఆచూకీ లభించలేదని స్థానికులంటున్నారు. తర్వాత బావి నుంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున గ్యాస్ ఎగదన్నడంతో ఆ ప్రాంతమం తా గ్యాస్ అలముకుంది. అడవిపేట ఓఎన్‌జీసీ డ్రిల్ సైట్‌కు అనుబంధంగా ఉన్న ఉప్పూడి–1 బావిలో 2006 ముందు వరకూ ఓఎన్‌జీసీ సొంతంగా గ్యాస్‌ను వెలికితీసింది. ఈ తర్వాత దీనికి వెల్ క్యాప్ (బావికి మూతవేయడం) వేసిన ఓఎన్‌జీసీ.. గతేడాది కోల్‌కతాకు చెందిన పీఎఫ్‌హెచ్ ఆయిల్ సంస్థతో గ్యాస్ వెలికితీత ఒప్పందం కుదుర్చుకుంది. అప్పట్నుంచి ఆ సంస్థ పర్యవేక్షణలోనే ఈ బావి నిర్వహణ సాగుతోంది. బావిలో గ్యాస్ నిల్వలను అంచనా వేసేందుకు మూత తెరిచేందుకు సంస్థ సిబ్బంది ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలోనే గ్యాస్ ఒక్కసారిగా ఎగదన్నింది.

# రాష్ట్రంలో మానవ అక్రమరవాణా ముఠాలు

- ఆపరేషన్ స్మైల్‌లో చిక్కిన విదేశీ మైనర్లు
- వీరిలో 13 మంది నేపాల్, నలుగురు మయన్మార్ పిల్లలు
- ముమ్మాటికీ అక్రమ రవాణానే అంటోన్న పోలీసులు
- ఆయా దేశాల ఎంబసీలకు సమాచారమిచ్చిన తెలంగాణ పోలీసులు
- ఈ కేసులనూ త్వరలో ఎన్ఐకి బదిలీ చేసే అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** ఈ దఫా ఆపరేషన్ స్మైల్‌లో పలు సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు వీధి బాలలు, వెట్టిచాకిరీ, బాలకార్మికులు, యాచక వృత్తిలో ఉన్న పలువురి చిన్నారులను కాపాడటం కోసం చేపట్టిన ఆపరేషన్ స్మైల్–6లో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా ముఠా ఆనవాళ్లను తెలంగాణ పోలీసులు గుర్తించారు. ఇలా ఈసారి నేపాల్, మయన్మార్ దేశాలకు చెందిన పిల్లలను పోలీసులు రక్షించారు. వీరంతా 17 ఏళ్లలోపు వారు కావడం, అసలు భారతీయులే కారన్నది తెలిసి పోలీసులే కంగుతిన్నారు. వీరి భాష, పోలికల ఆధారంగా ఏఏ దేశాలకు చెందినవారో పోలీసులు గంటల వ్యవధిలోనే గుర్తించగలిగారు. వారిని రక్షించి.. వివిధ హోమ్‌లకు తరలించారు. వీరిలో అధికభాగం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోనే పట్టుకోవడం గమనార్హం. ఈ ఆపరేషన్‌లో ఇలాంటి కొత్త కేసులు వెలుగుచూడటంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**ఎత్తుకొచ్చారని అనుమానం..!**

పిల్లలను బాలకార్మిక కూపాల నుంచి రక్షించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాలన్న లక్ష్యంతో ఏటా జనవరి, జూలై మాసాల్లో స్మైల్, ముస్కాన్‌లు చేపడుతుంటారు. ఇలా ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలను ఏజెంట్ల ద్వారా పనికి కుదుర్చుకుంటున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. దేశవ్యాప్తంగా బిహార్, ఒడిశా, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారిని ప్రతీసారి కాపాడటం పరిపాటే. ఈమారు ఎన్నడూ లేని విధంగా పొరుగుదేశాలైన నేపాల్, మయన్మార్ దేశాలకు చెందిన పిల్లలను పోలీసులు కాపాడటం చర్చనీయాంశమైంది. ఈ పిల్లల తల్లిదండ్రులు మనదేశంలో లేరు.. అందుకే వీరంతా అక్రమ మార్గంలో దేశంలోకి తీసుకువచ్చినవారుగా పోలీసులు తేల్చారు. దీంతో వీరి ఫొటోలు, చిరునామాలు తీసుకొని ఆయా దేశాల ఎంబసీలకు సమాచారమిచ్చారు.వివరాలను పంపారు. వారు ఆయాదేశాల్లో నమోదైన మిస్సింగ్ కేసులతో సరిపోల్చి చూస్తారు.

**రెండు దేశాల నుంచి వేర్వేరు ముఠాలు..**

నేపాల్, మయన్మార్ రెండూ వేర్వేరు దేశాలు. నేపాల్ నుంచి 13 మంది పిల్లలను, మయన్మార్ నుంచి నలుగురు పిల్లలను తెలంగాణలో పోలీసులు రక్షించగలిగారు. అంటే రెండు వేర్వేరు దేశాలకు చెందిన ముఠాలు ఈ పనికి పాల్పడి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ అక్రమ రవాణాలో కచ్చితంగా రెండు కంటే అధిక సంఖ్యలో ముఠాల హస్తం ఉండి ఉంటుందని ఉన్నతాధికారులు వెల్లడించారు.వీరికి మనదేశంలో మంచి పని ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి తీసుకువచ్చారా? తల్లిదండ్రులకు మభ్యపెట్టి కొనుగోలు చేశారా? లేక ఆయాదేశాల్లో కిడ్నాప్ చేసి ఇక్కడికి తెచ్చారా? అన్న విషయాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయంటున్నారు పోలీసులు.

**ఈ కేసులూ ఎన్ఐకే వెళ్లే అవకాశం..**

గతేడాది ఏప్రిల్‌లో పాతబస్తీలో 'బంగ్లాదేశ్ సెక్స్ రాకెట్'కేసును ఛత్రినాక పోలీసులు బయటపెట్టారు. బంగ్లాదేశ్ నుంచి యువతులను అక్రమంగా తీసుకువచ్చి ఇక్కడ వ్యభిచారం చేయిస్తున్నారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. రెండు దేశాలకు మధ్య సంబంధం ఉన్న కేసు కావడంతో దాన్ని నగర పోలీసులు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు బదిలీ చేశారు. ఈ కేసును ఇంకా ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఆపరేషన్ స్మైల్–6లో నేపాల్, మయన్మార్‌కు చెందిన 17 మంది విదేశీ పిల్లలు పట్టుబడటం. మరింత సంచలనం రేపింది. పలు అంతర్జాతీయ అక్రమరవాణా ముఠాలు దీని వెనుక ఉండటంతో తప్పకుండా ఈకేసులు కూడా ఎన్ఐఏకి పంపే అవకాశం కనిపిస్తున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com